

ఆంధ్రసచిత్రవారపత్రిక


19-9-75
60 పైసలు




యన్.వి.యస్.ప్రొడక్షన్స్ వారి
చిట్టెమ్మ - చిలకమ్మ
NAVRANG
కథ:
యన్.వి.సుబ్బరాజు
స్క్రీన్‌ప్లే:
పి.చంద్రశేఖరరెడ్డి
సీడెడ్: నటేష్ ఫిలింస్
నిర్మాత:
అల్లూరి వెంకట్రాజు
దర్శకత్వం:
పోలవరపు బ్రహ్మానందరావు
సువర్ణా ఫిలింస్ రిలీజ్


తప్పక చూడండి!
రాధికా ప్రొడక్షన్స్
మావూరి గంగ
దర్శకత్వం: కె.యస్.ఆర్.దాస్ నిర్మాత: వై.రామచంద్రరావు
సంగీతం: యార్లగడ్డ ఫొటోగ్రఫీ: కె.సుఖదేవ్
నైజాం:
జనతా పిక్చర్స్...
ఆంధ్ర: పూర్ణా రిలీజ్
సీడెడ్:
బలరాం పిక్చర్స్...
NAVRANG

లోకం పోకడ -డామెన్



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 – 1972)
శుక్రవారం : 19–9–'75
రాక్షసనామ సం. భాద్రపదమాస శు. చతుర్దశి
సంపుటము : 69 సంచిక : 2

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

★

సంవత్సర చందా – రు. 33-80
ఆరుమాసాల చందా – రు. 16-90
విడిప్రతి వెల 60 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520003.

విషయానుక్రమణిక

అట్టమీద బొమ్మ :
నటి జయప్రద
(ఫోటో : డి. సుశీల)

పై వారమే ప్రారంభం!

"జీవన సంధ్య" పెద్దకథ

కాకాని కమల రచన

ఉత్తరాలు

కవిత

డా. దాశరథిగారి "వైజయంతిక", మనోజ్ఞంగా ఉన్నది.

జె. పురుషోత్తం. (ఆదోని)

లట్టుమీద బొమ్మ

"మేనరికం, చెల్లీ రైలెక్కకమ్మా" కథలు నా హృదయాన్నెంతగానో ఆకర్షించాయి. ముఖచిత్రం, నటీమణుల, నటులవే గాక ప్రముఖ చిత్ర దర్శకుల, సంగీత దర్శకుల ముఖచిత్రాలు వేయడం బాగుంటుంది మా ఆశ.

బి. లక్ష్మీనారాయణరావు, (హిందూపురం.)

* * *

మంచుకడిగిన ముత్యాలు, సూర్యబింబ తేజస్సు గల, ఎర్రని కాంతులతో, వెల్లివిరుస్తూ, అందమైన ముఖ వర్చస్సును ఇనుమడింప జేసికొని, పుణికి పుచ్చుకున్న, హిందీచిత్ర జగతిలో బుల్లెట్ హీరోగా అభినయిస్తూ, లక్షలాది ప్రేక్షకుల హృదయాలలో నిండు పున్నమిలా కాంతిని విరుసుతూ, మదిలోమాటి మాటికి మసలే 'శత్రుఘ్నసిన్హా' ముఖచిత్రం ముగ్ధ మనోహరంగా మండి, పత్రికకు మణిపూసలా అల్లుకుంది.

మహమ్మద్ జహీరు అహమదు, ఎం జెడ్. ఎ.
ఫాతిమా జహీర్. (ఎస్.ఆర్.)

సీరియల్

నటి సుజాత ముఖచిత్రముతో వెలువడిన 22.8.75 ఆంధ్ర సచిత్ర వారపత్రిక ఎమ్మెల్యంతో ఆకర్షించింది. రాగపిపికలు సీరియల్ చాలా మలుపులు తిరుగుతూ ముందుకు సాగుతోంది. గాజు మేడ సీరియల్ ఇతివృత్తం నేటి సమాజ దృష్ట్యా చాలా వాస్తవికంగా ఉందనే చెప్పాలి.

చల్లా సత్యనారాయణ, మహమద్ హైమద్
జాని. (గోదావరిఖని)

* * *

వాణిశ్రీ ముఖచిత్రముతో వెలువడిన 29.8.75 సంచిక చూడముచ్చటగా ఉన్నది. "కానీ జాతక రహస్యం" లాంటి కథలు ఎందుకు వేస్తారో తెలియుటలేదు. ఏమీ బాగాలేదు. "చెల్లీ రైలెక్కకమ్మా" కథ చాలా బాగుంది. ఈ కథ అన్నయ్యల కర్తవ్యమును బోధిస్తుంది. "గాజు మేడ" సీరియల్‌లో ఈ వారం లీల ప్రవర్తన నాకేమీ నచ్చలేదు. పెద్దల ప్రమేయం లేకుండా పెళ్లి ఏర్పాటు చేస్తానని, శోభనపు ఏర్పాట్లు చేసి అతని పెదిమిలకు తన పెదిమిలు అందించి—ఇదే మన పెళ్లి గుర్తు అని చెప్పి, తెల్లవార్లూ మురళి కౌగిటలో లీల ఉండుట నాకు నచ్చలేదు.

కొర్రు రామకృష్ణశర్మ, (అడవులదీవి)

(46 వ పేజీ చూడండి)

ఫాలాక్షుని డైరీ

వైమరచిన దొంగ!

టొరెంటోలోని సముద్రపొడ్డు హోటళ్లలోని వో హోటలులో వో దొంగ జొరబడి, అద్దం పగులగొట్టి, వో గదిలో జొరబడ్డాడట. తీరా లోపలకు వెళ్ళేసరికి అక్కడి దృశ్యం అతన్ని తన్మయుణ్ణి చేసిందట. మంచం మీద వో దంపతులు నగ్నంగా, వైమరచి, పడుకుని ఉన్నారట. ఆ పడుకుని ఉన్న నగ్న స్త్రీ సౌందర్యానికా దొంగ వైమరచి, నెమ్మదిగా మంచం దగ్గరకు వెళ్లి ఆమె శరీరాన్ని ఆశగా తడిమాడట. శరీరం మీద ఏదో పాకుతున్నట్టయి, ఆమె లేచి, మూడో వ్యక్తిని చూచి బ్రా బోయ్ అని భర్తను లేపేసరికి ఆ దొంగ చేతికందిన పర్సుతో పారిపోయారట. దొంగను ఆ దంపతులు ఎంచక్కా చూసినందున వల్ల ఆ వర్ణనలతో పోలీసులు దొంగను పట్టేశారట—వాటిజ్!! హి యుజ్ ఏ లక్కీ ఫెలో!!

మాతృదేశంపై మక్కువ

ఎర్గిన్ అనే ఒకాయన భార్య తాను హిందూ దేశంలోనే బిడ్డను కనాలన్న ఆశతో ఉమ్‌స్టర్ డామ్ నుంచి ఢిల్లీ విమానంలో ప్రయాణం చేస్తుండగా మధ్యేమార్గంలో ఆమెకు నొప్పులు వచ్చాయట. విమానాన్ని బొంబాయికి మళ్లించి, అక్కడ వైద్యసదుపాయాలవీ మాట్లాడారట. తీరా విమానం బొంబాయిలో దిగేలోగానే ఆమె పండంటి బిడ్డను కన్నదట. అదే విమానంలో ఉన్న వో ఇద్దరు డాక్టర్లామెకు పురుడు పోశారట. ఆమె అసలు పూర్తి కొచ్చిన్‌ట!! ఈవిడ పశ్చిమ జర్మనీలో పనిచేస్తున్నదట.

ఘోర హత్య!

అనంతపూరు జిల్లా వినుబోలు గ్రామంలో ఆగస్టు 18వ తేదీన ఇ. సుబ్బారెడ్డి అనే ఆయన్ని ఆయనింట్లో పద్దెనిమిది మంది పట్టుకుని చితక తన్నారట. అనక వో ఇద్దరు ఆయన చెరో రెక్కా పట్టుకుంటే మూడో వ్యక్తి ఆయన తలను నరికేశాడట. ఈ ఘోర దృశ్యాన్నంతా ఆయన భార్య కళ్లారా చూసిందట. ఆ దురాత్ములు సుబ్బిరెడ్డి తలను తీసుకుపోయారట. ఆయన భార్య వెంటనే గ్రామ మునసబుకు ఖబురెట్టి ఆయన వెళ్లలేదట. ధైర్యంగా ఆవిడే ఆరుకిలో మీటర్లు ఒంటరిగా నడిచి, నాగసముద్రం గేటు అనేవూరు వెళ్లి, అక్కడ నుంచి బస్సులో చెన్నకోటపల్లి పోలీసుస్టేషన్‌కు వెళ్లి, యీ హత్యను గురించి రిపోర్టు చేసిందట.

జీన్స్, టైట్స్, జుట్టు పెంచడంపై నిషేధం

ఢిల్లీలో తమిళనాడు ఎడ్యుకేషన్ (విద్య) సొసైటీ నడుపుతున్న ఓ స్కూలు విద్యార్థులు జీన్స్ వేసుకోడం, పొడుగు జుట్టు పెంచుకోవడం, వంటి అతికినట్టుండే బట్టలు కట్టుకోడం యిటువంటి వాటిని నిషేధించిందట. తత్ఫలితంగా ఆ స్కూలు విద్యార్థినులు జీన్స్‌గాని, వంటికి పట్టే బట్టలు గాని వేసుకోరాదట. మగవారు పొడుగాటి జుట్టును ఉంచుకోరాదట. ఏల!! ప్రశ్నింపరాదు.

రాలినముత్యాలు

శ్రీ సోమసుందర్

అహరహ యాత్రావలంబి
ఆదిత్యుని చూడరా
ధ్వాంత మోచటనున్న అతని
స్వాంత ముజ్వలించురా!

గంటకులక్ష వసూలు!

కలకత్తా కార్పొరేషన్ ఆగస్టు ఒకటో తేదీన వో రెండు గంటల కాలంలో రెండు లక్షల బకాయి పన్నులు టకటక వసూలు చేసేసిందట. ఇదంతా హఠాత్తుగా జరిపిన శోధనల ఫలితమేనట. గంటకు లక్షా!

కూజాల వ్యాపారివద్ద 12 లక్షలు!

ఢిల్లీ కమలానగర్‌కు చెందిన ఒకాయన వో మిల్లులో కార్మికుడుగా పనిచేయడమే గాక, మంచినీళ్ల కూజల వ్యాపారం కూడా చేస్తున్నాడట. అంతేకాక మిల్లు పనివారెవరైనా కష్టాలలో ఉంటే వారి వద్ద నగో, నట్రో లాకట్టు పెట్టుకుని, ఋణమో, పణమో అప్పుగా కూడా ఇస్తున్నాడట. అయితే కస్టమ్స్ శాఖ, ఆదాయప్పన్ను శాఖవారసుమానం మీద చేసిన దాడిలో ఈయన వద్ద సుమారు పన్నెండు లక్షల విలువచేసే ధన, కనక, వస్తు, వాహనాలు ఉన్నట్టు తేలిందట. బ్యాంకు లాకర్లు తొమ్మిది తీసుకుని, అందులో యీయన యీ నిక్షేపమంతా దాచేశాడట. పోలీసులు తెరచిన రెండు లాకర్లలో ఒకదాంట్లో 75 వేల విలువ చేసే వెండి వస్తువులు, మరోదాంట్లో ఆరు లక్షల రూపాయల విలువచేసే బంగారు వస్తువులు ఉన్నాయట. ఇంకా ఏడు లాకర్లు తెరవనేలేదట. ఇదేదో తెరుచుకోనసీం!! అలీబాబా కథలా ఉందా! బట్ట్ స్టాపెన్స్:

తెల్ల మందారం

మందారపువ్వు మామూలుగా ఎరుపు, ఆ ఎరుపుకు చెందిన రంగుల్లో వుంటుంది. సోవియెట్ రష్యాలో మంచువంటి తెల్లని మందార పువ్వును పెంచారట. అవి 25 సెంటిమీటర్ల వెడల్పు వుందట. మామూలుగా మందార పువ్వు పది గాని పదిహేను గాని సెంటిమీటర్ల వెడల్పు వుంటుందట. ఈ పువ్వుకు సోవియట్ వృక్షశాస్త్ర పండితుడు రసెనోవ్ "తాజ్‌మహల్" అని పేరు పెట్టారట.

హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

త్యాగోపనిషద్:

ఈ మధ్య ఒక సుప్రసిద్ధ రచయిత్రిని కలుసుకున్నాను. నా మిత్రుడు పెట్టబోయే పత్రికకి ఒక కథ వ్రాయమని కోరాను. ఆమె వెంటనే "నేను మూడు సంవత్సరాల వరకు బుక్ అయి ఉన్నాను. క్షణం తీరిక లేదు" అంటూ గంట సేపు నాతో గప్పాలు కొట్టింది. నేను అడిగినందుకన్నా ఆమె గంటలో ఏదో కథ వ్రాసి ఉంటే ఎంతో బాగుండేది. కొంత పేరువచ్చిన తర్వాత తీరిక లేదని ప్రచారం చేసుకోవడం కొందరికి ఒక ఇది! కొందరు ఇతర రంగాలలోని, ముఖ్యంగా పోలీసు శాఖలోని మిత్రులు చెన్నకృష్ణయ్య, ఇ. ఎస్. పురుషోత్తమన్ వంటి వారిని చూస్తున్నప్పుడు, వారి కృషి గమనించినప్పుడు కర్తవ్య నిర్వహణ కాలం పోను ఇంత తీరిక వారికి ఎక్కడ చిక్కిందా?— అని నాకు ఆశ్చర్యం కలుగుతుంది. విద్యారంగంలో ఉంటూ "తీరికలేద"ని జపం చేసేవారికన్నా ఇతర రంగాల లోనివారే సాహిత్యానికి ఎక్కువ సేవ చేయగలుగుతారనే భావమూ దృఢపడింది, శ్రీ ఇ. ఎస్. పురుషోత్తమన్ "త్యాగోపనిషద్" అనే గ్రంథ ఆవిష్కరణోత్సవం ఆగస్టు 16వ తేదీన కళా భవన్‌లో చూచిన తరువాత. 'త్యాగోపనిషద్' శ్రీ పురుషోత్తమన్ లోగడ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో వారం వారం ప్రచురించిన 125 త్యాగరాజ కీర్తనల ఆంగ్ల వ్యాఖ్యల సంకలనం. దీనిని ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక ఎకాడమీ మూలాలు తెలుగు లిపిలోను, వ్యాఖ్య ఆంగ్లంలోను ప్రచురించింది. ఆవిష్కరణోత్సవానికి అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఆవుల సాంబశివరావు అన్నట్లు షేక్స్‌పియర్ నాటకాలకు బ్రాడ్లే వ్యాఖ్యలాగ పురుషోత్తమన్ వ్యాఖ్య విస్తృతం విషయ భరితమూను. గ్రంథాన్ని ఆవిష్కరించిన విద్యామంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావు అన్నట్లు త్యాగరాజ కీర్తనలకు శ్రీ పురుషోత్తమన్ ఆంగ్లంలో వ్యాఖ్య చేయడం వల్ల కీర్తనలు వివిధ దేశాలవారు అవగాహన చేసుకుని ఆనందించే అవకాశం ఏర్పడింది. ఈ విధంగాను వ్యాఖ్యాత ప్రశంసనీయులు. దీని ఆవిష్కరణకు ఇది పవిత్రమైన తరుణంగా అకాడమీ భావిస్తున్నదని అకాడమీ కార్యదర్శి శ్రీ కె. వి. సుబ్బారావు చెప్పడం, డాక్టర్ ఎస్. శ్రీదేవి వ్యాఖ్యను ప్రశంసిస్తూ సంగీత జ్ఞానము, క్షీరసాగర శయనా, శాంతము లేక అనే త్యాగయ్య కీర్తనలను ఆలపించడమూ, డాక్టర్ దివాకర్ల వెంకటావధాని, శ్రీ మంచాళ్ళ జగన్నాథరావు వ్యాఖ్యాతను ప్రశంసించడమూ సముచితంగా ఉన్నాయి. పిటన్నిటికీ ముకుటాయమానంగా కరూరు వైశ్యబ్యాంక్ అధ్యక్షుడు శ్రీ పి. బి. శరవణన్ శాలువలోను, గోఖ్లే రామవిలాస సభ ఉపాధ్యక్షులు శ్రీ ఎ. ఎస్. రామస్వామిఅయ్యంగార్ పట్టుపీతాంబరం తోను శ్రీ పురుషోత్తమన్‌ను సన్మానించడం చాల సముచితంగా ఉంది. అకాడమీ అధ్యక్షుడు శ్రీ కె. వి. గోపాలస్వామి స్వాగత వచనాలతో ఆరంభమయిన ఈ ఉత్సవం వ్యాఖ్యాత ప్రతిజ్ఞా సమర్పణంతో సమాప్తమైంది. తీరిక లేనట్లు, నిరంతరం శారదారాధనంలోనే నిమగ్నులైనట్లు పోజులు కొడుతూ తీరా లెక్కపెడితే "ఉడ్డా మూడు" పుస్తకాలైనా వ్రాయని పెద్దలకు ఈ ఉత్సవం కనువిప్పు కాగలదని నా విశ్వాసం. ఎవరికో ఎందుకూ నాకూ ఇది కనువిప్పు.

తిరుమలకు సరాసరి బస్సు ప్రయాణం:

రవాణాశాఖవారు తిరుమల మీదికి సరాసరి బస్సు ప్రయాణం ఏర్పాటుచేయటం వల్ల తిరుమల తిరుపతి యాత్రికులకు గంటల కొలది తిరుపతిలో పడిగాపులుకాచే కష్టం తప్పింది. ఏ ప్రాంతాలనుంచి వచ్చినా, సరాసరి టిక్కెట్టుతో అందే బస్సుల ద్వారా వెంటవెంటనే కొండ మీదికి వెళ్ళే అవకాశం కల్పించి రవాణా శాఖవారు యాత్రికుల కృతజ్ఞతలకు పాత్ర మయ్యారు.

కళాప్రపూర్ణుని బొమ్మ:

తను వయస్సంతో అన్ని కావ్యాలు వ్రాసిన కళాప్రపూర్ణ శ్రీ వోయి భీమన్న ఒకొత్తగా నిష్కరింపబడిన పాత కావ్యం 'బొమ్మ' ఆవిష్కరణోత్సవం డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్షతన ఆగస్టు 24న సారస్వత పరిషత్తు హాలులో జరిగినప్పుడు, ఎంత ఇదయినా పత్రికా రచయితలే మేలు, ఏ రంగంలో దిగినా దానిని ఎగ్గులు పట్టడానికి యత్నిస్తారు— అనిపించింది. మిత్రుడు భీమన్న నేడు ఎంతవాడయినా, ప్రధానంగా, సారాంశతః పత్రికా రచయిత. చురుకుగా విషయాలు సేకరించడం, మీనమేషాలు లెక్కించక పనిలో దిగడం, ఎదుటివారు తప్పులు చూపితేనో, తడబడితేనో చిరునవ్వు చిలికించడం, సోమరితనం సుంతైనా లేక నిరంతరం అధ్యయనపరుడు కావడం ప్రశంసలు పొందగానే ఫుల్‌స్టాప్ పెట్టకపోవడం, ప్రధానంగా

(41 వ పేజీ చూడండి)

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

ఎం. ఏ. ఆర్. — శ్రీకాకుళం.

...మీ కలం నత్త నడక నడుస్తుందంటే మీ సహేతుకమైన వివరణ ?

అభ్యుదయ భావాలు రాస్తే చాలని అనుకుంటున్నానని కదా మీ భావన ? మీరు చాలా పొరపడుతున్నారు... పొలికేకలు వేస్తే విప్లవంరాదు. అనుభవ సాధ్యం కాని ఆదర్శాలని గట్టిగా రాస్తే ఏం ప్రయోజనం ?...నేను జీవితంలో అమలులో పెట్టిన, పెట్టడానికి అనువైన ఆదర్శాలు నావి మీకు నత్తనడక అనిపించినా నేను ఏమను కుంటానో తెలుసా ? 'దిస్లో అండ్ స్టడీ విన్సది రెస్' అని

పి. ఎస్. — కదిరి.

'ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అన్న పరమాత్ముడు ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే భూమిమీద అవతరించాలంటాను...ఏమంటారు ?

ఎక్కడో అవతరించే వుంటాడని నానమ్మకం ఈ వచ్చే ఎన్నికల్లో...మనకి సాక్షాత్కరిస్తాడని...

బి. ఎస్. ఆర్. — కడప.

తిండిబట్ట తప్పించి మానవుడు కోరుకోతగ్గది ఇంకేమైనా వుందా ?

ఉంది తృప్తి.

టి. ఎస్. బి. — కాశిబుగ్గ.

పత్రికలోని ప్రశ్నలు జవాబులు జ్ఞానాభివృద్ధికై ఉపయోగపడడానికి కదా ?

నాకు తెలియదే! అలాంటివి డాక్టరు సలహాలు. మిగిలినవన్నీ అన్ని రకాలవారి సరదాకోసం.

ఎస్. ఎం. ఆర్. అల్లిపురం

పెండ్లి ఎందుకు చేసుకోవాలి ?

భోజనానికి పడక్కి ఇబ్బంది లేకుండా ఉండడానికి !

కె. ఆర్. వి. ఆర్. విజయవాడ

అభిమానవతి రిలీజుకు మీరొస్తారని ఆశపడ్డ మాలాంటివారికి నిరుత్సాహం కల్గింది ? ఎందుకు రాలేదు ?

పిలవని పేరంటానికి అయినవాళ్ల ఇంటికేనా వెళ్లకూడదనికదా— పెద్దల మాట !

డి. ఆర్. డి. కడప

బీడు వారిన మగువల మనస్సులను మీ తొలకరి జల్లుల్లాంటి పలుకులతో సస్యశ్యామలం చేస్తున్నారు. మహిళాలోకంతరఫున నా కృతజ్ఞతలు స్వీకరిస్తారా ?

చిట్టి తల్లీ— రోగానికి రొస్టు అన్నారు గాని ఆరోగ్యానికి గుట్టు కావాలి. మందు పని చేస్తూంటే చెప్పకు. పనిచెయ్యకపోతే గోలచెయ్యి.

ఎమ్. ఎస్. ఏ. — అమలాపురం.

ఆడదై పుట్టడంకంటే అడవిలో మానై పుట్టడం మేలని నా అభిప్రాయం ?

నేనలా అనుకోడం లేదు ! తమరికేమైనా అభ్యంతరమా ?

సిహెచ్. పి. ఆర్. సిరిసెల్ల

మేమే రాజ్యాన్ని పరిపాలిస్తున్నామని గర్వముతో— కథలలో వ్యాసాలలో మొగవారిని విమర్శించడం . . .

ఇది ప్రజాస్వామ్యం. ప్రజలెవరికి ఎక్కువ ఓట్లు వేసి గెలిపిస్తే—వాళ్లే అధికారానికి వస్తారు. అలా వచ్చినది స్త్రీ అయినంత మాత్రాన— ఎందుకంత కోపం? . ఇక ఈ రకం రాజ్యాంగంలో—చదువనూ,రాయనూ, మాట్లాడనూ హక్కు ఉంది. అంచేత రాసినంత మాత్రాన మీరిలా బాధపడ్డం దండుగ.

డి. ఎస్. ఆర్. సిద్దిపేట

ఏమండీ రామలక్ష్మిగారూ, సారంలేని సంసారం ఎలా ఉంటుందండీ ?

సరసత లేని శృంగారం లాగా— హక్కులేని బాధ్యతల్లాగా— మహ బోరుగా ఉంటుంది.

ఎస్. ఎస్. తిరుపతి

స్త్రీకి సమాన హక్కులా ? కావలసింది విలువా నిర్ణయించుకోగలరా?

సమానత్వం లేని వారిమీద ఎవరేనా విలువ చూపిస్తారా ?!

సిహెచ్. ఆర్. ఎస్. ఆర్. — జన్‌గోవన్

ఆడవారు ఎంత చదివినా మరి కుండల వద్దకే కదా ?

కాని జాగ్రత్త బాబూ వెల సులభమని చదువు రాని గుడ్డిదాన్ని పెళ్లాడేవు— పూటకో ఆవ కుండలు పని చేస్తుంది !

కె. డి. పి. మదనపల్లి

మీరిచ్చే సమాధానాలని బట్టి చూస్తే స్త్రీలని అందలం ఎక్కించమంటూలు. అంతేనా.

అబ్బే. అందలం ఎక్కాలన్న కుతూహలాన్ని అత్యాశగా చూడకండి అంటాను. అన్నిహక్కులూ ఆదాయ వ్యయాలూ, హాయిల్నీ మగవారికే ఉంటే ఎన్ని తరాలు పడి ఉండకలదా ఆడది.

'బల' 'అబల'లు కలమనదేశంలో దేనికిలోటు.

గుర్తింపునకు.

ఏ. ఎన్. ఎ. ఆర్. వి. — ఖర్గపూరు

ఆడదాని ధైర్యంతో మగవాడు లేచిపోతే బాగుంటుందా ?

బాగానే ఉంటుంది—ఆమె ఉద్యోగం ఆధారంగా చూసుకొని లేచిపోకండి—అంతే.

వి. ఆర్. ఎస్. — ఉంద్రాజవరం

మీకు అహం ఎక్కువ. ఏ ప్రశ్నకీ సరైన సమాధానం ఇవ్వరు. మోసపు స్త్రీ తరఫున పురుషుని అవహేళన చేసే మీరు ...

నరకంలో పడతానంటారు ! అంతేగా.

కె. పి. ఆర్. — సికింద్రాబాదు

అవకాశం చేయి జారినా ఆశ చావదు. కారణం?

అవకాశం చేయి జారాక మరీ మంచిదానిలా కన్పిస్తుంది— వచ్చినప్పటికంటే— అందుకు.

జి. ఎస్. పి. ఆర్. — హైదరాబాదు

మీ ప్రశ్నలకు కేటాయించబడుతున్న పేజీ శుద్ధ దండుగ అంటాను. దానికి మీరేమంటారు ?

మీకులేని ధైర్యం నాకుందంటాను— ఈ కార్డు ఎడిటరుగారికి రాస్తే సరిపోయేదిగా —

పి. సి. ఆర్. — తాడపత్రి

స్త్రీకి సమాన హక్కులు కావాలంటూ మీరు చేస్తున్న ప్రచారం మీ అభిమానవతి ద్వారా కూడా దెబ్బతింది. . . ఇక మీరు. . .

దోరణి మార్చమంటాను. కర్ణుడి చావుకి కారణా లనేకం అన్నట్టు సినిమాకి కూడా అంతే కాని— మీ రనుకున్నట్టు— సమాన హక్కులా వ్యక్తిత్వంకాదు.

క్యూ!

— సీరపాణి

క్యూ క్యూ క్యూ
కొళాయి దగ్గర క్యూ
కోటా దగ్గర క్యూ
మిల్క్ బూత్
పోలింగ్ బూత్
పదవులబూత్ - క్యూ
బడిలో ఫీజులు
గుడిలో ముడుపులు
సినిమా, ఎనిమా—క్యూ
లంచం దగ్గర క్యూ-మరి
మంచం దగ్గర క్యూ
రోజులు క్యూ—మన
మోజులు క్యూ
చౌరాస్తాలో పోజులు క్యూ
రైళ్ళకోసం క్యూ-మరి
జైళ్ళలోనూ క్యూ
ఋతువులు క్యూ - మన
బ్రతుకులు క్యూ
చావూ పుట్టుక క్యూ
క్యూ క్యూ క్యూ ఢేంకూ

ఎవరిది మోసం?

వి. మోహన్‌కుమార్

"ఆ అబ్బాయి క్రాఫ్ చూడు, ఎంత బాగుందో", హోటల్ సరోవర్‌లో కాఫీ తాగుతూ అంది సుమ, ఆ అబ్బాయి ఎవరో కళ్లతోనే సూచిస్తూ.

"ఎవరే?" అంది, ఎదుటి సీట్లో కూర్చున్న రమ.

"అదిగో, పక్కవరసలో ఇక్కణ్ణించి మూడో టేబిల్ దగ్గర కూర్చున్నాడు."

"ఎక్కడే?" అంటూ పక్కకు తిరిగి, తల వెనక్కి తిప్పి "ఓహో! అతనా" అంది గట్టిగా, చెయ్యెత్తి అతన్ని చూపిస్తూ.

కాఫీ తాగుతున్న అతను ఉలిక్కిపడి వీళ్ల వైపు చూసాడు. పసిమి ఛాయతో, మంచి ఒడ్డూ పొడుగుతో, మగసిరి వుట్టిపడుతున్న అతను సినిమాలో హీరోలా వున్నాడు. ఉంగరాల జుట్టు అతనికి వింత అందాన్ని తెచ్చిపెడ్తోంది.

"ఛీ. ఛీ నీ కసలు సిగ్గులేదు. మరీ అలా చెయ్యెత్తి చూపిస్తే చూసేవాళ్లేమను కుంటారు? చూడు, అతను మనవైపు ఎలా చూశాడో? అతనేమను కుంటాడు" నొచ్చుకుంటూ అంది సుమ, కొంచెం కోపాన్ని మేళవిస్తూ.

"అనుకుంటే అనుకోనీ ఎవరిక్కావాలి. దారినపోయే వాళ్ల గురించి మనం ఎన్నో కామెంట్లు చేస్తాం. వాళ్లందరి గురించి పట్టించుకుంటే అయినట్టే" అంది రమ నిర్లక్ష్యంగా.

"అదికాదే, ఇలా హోటల్లో చెయ్యెత్తి చూపిస్తే ఎంత అసహ్యంగా వుంటుంది. అతను చూడబోతే మంచి వాడిలా వున్నాడు. మనని చూసి ఏమనుకుంటాడు చెప్పు"

"ఓహో అయిందీ. శుభం. చూడు, అసలు వయసులో వున్న నీలాంటి ఆడపిల్లల్ని ఇలా బయట తిరగనివ్వడం పొరపాటు. ఎప్పుడు తమ మనసు ఎక్కడ పారేసుకుంటారో చెప్పలేం. ఆ అబ్బాయిని చూడగానే క్రాఫ్ బాగుందన్నావు. ఇప్పుడేమో, మంచి వాడిలా కనిపిస్తున్నా డంటున్నావు. కొంపతీసి అతన్ని ప్రేమిస్తున్నావా?" గట్టిగా వెటకారంగా అంది రమ.

"కాస్త నెమ్మదిగా మాటాడు. అసలు నీతో చెప్పడం, నాదే పొరపాటు. ఇంకెప్పుడూ చెప్పను ఈ సారికి క్షమించి వదలెయి."

"చూడమ్మాయి, నే నూహించింది నిజమైనట్టుగా వుందే. ప్రేమిస్తే చెప్పమ్మడూ, నేనిప్పుడేవెళ్లి 'మహానుభావా! నా చెలి మిమ్మల్ని ప్రేమించింది, మిమ్మల్ని తన సొత్తనుకుంది అలాంటి మిమ్మల్ని నేను చెయ్యెత్తి చూపించాను, మన్నించరూ,' అని వేడుకుంటాను, సరేనా?" అంది రమ నవ్వుతూ.

సుమకు కొంచెం కోపం వచ్చింది. ఏమీ మాట్లాడకుండా మౌనంగా, కాఫీ తాగ సాగింది.

అతను తిరిగి వీళ్లవైపు చూసాడు. ఎదురుగా కనిపిస్తున్న సుమ అతన్ని ఎంతో ఆకర్షించింది. పసుపురంగు చీర, అదే రంగు జాకెట్ వాటితో పోటీపడే శరీర ఛాయతో అప్సరసలా కనిపించిందతనికి. పెద్ద కొప్పు, సిగలో చామంతులూ ఆమెకు కొత్త అందాన్ని ప్రసాదించాయి. పొడుగాటి జుట్టున్న ఆడవాళ్లంటే అతనికి ఎంతో ఇష్టం. ఆ పక్కనే కూర్చున్న రమ ఎరుపురంగు చీర, అదే రంగు జాకెట్‌తో కాంతు లీనుతోంది. రెండు జడలు వేసుకుని కనకాంబరాల్ని దండగా కట్టి పెట్టుకుంది. రెండు జడల కన్నా సిగే అందంగా కనిపించింది. సినిమాల్లో హీరోయిన్లా వుంది అనుకున్నాడు.

బిల్లు చెల్లించి ఆఖరిసారి అతన్ని, అతని అందమైన క్రాఫ్‌ని చూద్దామని తలెత్తిన సుమ, తదేకంగా తన వైపు చూస్తున్న అతన్నిచూసి, సిగ్గుపడి లేచి వెళ్లిపోదామను కున్న ప్రయత్నాన్ని మానుకుంది.

"ఉ. ఇంక లేచేదిలేదా. అబ్బాయిల్ని మరీ అంత తదేకంగా చూడకూడదే. చాలా చెడ్డ అలవాటు" అంది రమ.

"దీని తస్సాదియ్యా. ఆవలిస్తే పేగులు లెక్కపెట్టేటట్టుగా వుందిది. ఇంకెప్పుడూ దీంతో బయటకు రాకూడదు" అనుకుంది సుమ... "నడు పోదాం" అంటూ లేచింది.

"ఏదీ మీ హీరోని ఆఖరిసారిగా చూద్దాం" అంటూ అతనివైపు పరీక్షగా చూసి, "ఏదో సరదాకన్నాను కానీ బాగానే వున్నాడేవ్. చూడబోతే మంచి ఉద్యోగస్తుడిలా వున్నాడు. ఒక పని చేస్తేనేమిటి. ఒక మంచి ముహూర్తం చూసి అతగాణ్ణి ప్రేమించెయ్. ఆ తర్వాత ప్రేమ లేఖలు, శుభలేఖలు, ఇలా డెవలెప్ చేద్దాం. నీకేమన్నా కావాలంటే నేను హెల్ప్ చేస్తాను" అంది రమ నవ్వుతూ.

"అతను అందంగా వున్నాడని నేనన్నానా? అతని క్రాఫ్ బాగుందీ అన్నాను. దానికింత వెక్కిరింపులు వెటకారాలు ఎందుకు."

"వెటకారాలు, వెక్కిరింపులు దేనికీ. వున్న మాటన్నాను. కావాలంటే ఎవర్నైనా అడుగు. మీ జంట ఎంతో బాగుంటుంది. వన్ మేడ్ ఫర్ అదర్ అంటూ ఫొటోలు పబ్లిష్ చెయ్యొచ్చు. నా సలహా నేనిచ్చాను. మీ ఇష్టం. నాకంటే మా బావతో పెళ్ళి నిశ్చయం అయిపోయిందిగాని లేకపోతే అసలు నేనే ప్రేమించేసి వుండేదాన్ని."

"సంతోషించాం వూరుకో."

మందగమనంతో బయటకు నడచిపోతున్నవారిద్దర్నీ చూసిన మూర్తి దీర్ఘంగా నిట్టూర్చాడు. ఆ పసుపు రంగు చీర కట్టుకున్న అమ్మాయి ఎంతో అందంగా కనిపించింది మూర్తికి. ముఖ్యంగా ఆమె హెయిర్ స్టైల్. తన కేసి చూసి వారిద్దరూ ఏదో మాట్లాడుకుంటున్నారు. హేళనచేస్తున్నారా? మెచ్చుకుంటున్నారా? ఎందుకు హేళన చేస్తారు. మెచ్చుకునే వుంటారు. వెళ్ళిపోయేటప్పుడు ఆ పసుపురంగు చీర కట్టుకున్నఅమ్మాయిసిగ్గుతో

అలవోకగా చూసిన చూపు ఇంకా అతని మనసులో చెరగని ముద్ర వేసుకుంది. ఆ అమ్మాయిని, ఆ హెయిర్ స్టైల్‌ని మనసులోనే మననం చేసుకుంటూ, బరువుగా కుర్చీలోంచి లేచి వెళ్ళిపోయాడు.

*　　*　　*

"వాళ్ళు వచ్చే వేళయింది అంతా తయారుగా వుందా?" గదిలో అలంకరణతో కుస్తీ పడుతున్న తల్లీ కూతుళ్ళని బయట నుంచే అడిగాడు వెంకట్రామయ్య.

"ఆ అంతా రెడీ" అంటూ బయటకు వచ్చింది కమల. ఆవిడ వెంట బయట అడుగు పెట్టింది సుమ.

"సుమా వాళ్ళొస్తున్నారని నువ్వేం ఖంగారు పడకు. నేను వాళ్ళకు మన గురించి అంతా చెప్పాననుకో. అయినా వాళ్ళేమన్నా అడిగితే భయపడకు. నీకు తోచినట్టు చెప్పెయి. ఆడ పెళ్ళివాళ్ళమైనంత మాత్రాన మనకేంటి భయం. మనకూ స్టేటస్ ఉంది" కూతురితో చెప్పాడు వెంకట్రామయ్య పరీక్షకు వెడుతున్న విద్యార్థినికి ధైర్యం చెప్పినట్టు.

తండ్రి అమాయకత్వానికి నవ్వొచ్చింది సుమకు. అయినా చిరునవ్వు నవ్వుతూ 'అలాగే' అన్నట్టు తల వూపింది.

"అదంత అమాయకురాలేం కాదులెండి. మీరేం చెప్పనక్కరలేదు" అంది కమల.

"అదిగో ఆ వెధవ అహంకారం పనికి రాదన్నాను. పెద్దవాడు, అనుభవజ్ఞుడు ఎందుకు చెప్తున్నాడో ఆలోచించలేని అవివేకివి నువ్వు నా కూతురుకి నేను చెప్తున్నాను. నీ క్కాదు నువ్వు నోరు మూసుకో" అన్నాడాయన, విడవైపు కోపంగా చూస్తూ. తన్నలా ప్రతిదానికి ఆవిడ చిన్న బుచ్చడం ఆయనకి నచ్చదు. భర్త ఛాదస్తం ఆవిడకు గిట్టదు.

"చూడమ్మాయి. నేనుంటాను. అంతా సర్దుతాను ఐనా నువ్వు ధైర్యంగా ఉండాలి"

"ఫర్వాలేదులే నాన్నా ఇదేమన్నా ప్రాణాంతకమైందా? మీరేం వర్రీ కాకండి" అంది సుమ.

"నీమీద నాకు ధైర్యం వుందనుకో. అయినా ఊరికే చెప్తున్నాను. చాలా మంచి సంబంధం, అయినా ఫర్వాలేదు. ఖంగారు పడాల్సిన పని లేదు. నేనుంటానుగా అన్నీ సర్దేస్తాను"

"మీరు కాస్త ఖంగారు తగ్గించుకుని ఊరుకోడం మంచిది. మీరు కల్పించుకుంటే వ్యవహారం చెడుతుంది" అంది కమల.

"నిన్ను నోరు మూసుకోమన్నానా. ఈ రోజు నేను చెప్పినట్టు చెయ్యి ఎంతో కష్టపడి తెచ్చాను ఈ సంబంధాన్ని. తొందరపడి తగలెయ్యకు"

"అలా తగలేసేది మీరే". ఇంతలో కాలింగ్ బెల్ మోగింది.

"అదిగో అదే . ..." అంటూ ఆవిడకి కోపంగా సమాధానం చెప్పబోయిన ఆయన నోటికి మూతపడింది.

"అదిగో వచ్చినట్టున్నారు" పరుగున వెళ్ళి తలుపులు తీశాడాయన "రండి మీకు నూరేళ్ళ ఆయువు ఇప్పుడే మీరు వచ్చే టైం అయిందని మా ఆవిడతో చెప్తున్నాను. కూర్చోండి" అంటూ సాదరంగా ఆహ్వానించి ఆసీనుల్ని చేశాడు.

'మంచినీళ్ళు తెప్పిస్తానుండండి" అని, "కమలా" అంటూ పిల్చాడు.

ఆవిడ గదిలోకి వచ్చి, అక్కడున్నవాళ్ళకి చేతులు జోడించి నమస్కరించింది. వారు ప్రతి నమస్కారం చేశారు.

ఆవిడ లోపలికి వెళ్ళింది వెంకట్రామయ్య వడిగా లోనికి నడిచాడు. "వాళ్ళకేం కావాలో కనుక్కుని మర్యాద చెయ్యి" అన్నాడు భార్యతో.

"ఆ సంగతి నాకు తెలియదా? అదిగో ఆ వెధవ ఖంగారే వద్దంటాను. అలా ఖంగారుపడే ఇదివరకు అన్నీ తగలేశారు మీరు గదిలో కూర్చుని మాటాడుతూ ఉండండి. అన్ని ఏర్పాట్లు నేను చేస్తాను" అందికమల గదివైపు వెళబోతున్న భర్తను "ఏమండీ!" అంటూ పిల్చి, "అబ్బాయి బాగున్నాడు కదండీ – భగవంతుని దయవల్ల ఈ సంబంధం నిశ్చయం అయితే బాగుండును" అంది.

"సెలక్షన్ ఎవరిదనుకున్నావు, నాది. నేనేదో ఖంగారు మనిషినని, నువ్వేదో పెద్ద నిదానస్తురాలవని అనుకుంటావు కదూ! ముందు ముందు తెలుస్తాయి నా తెలివితేటలు, అయినా అహంభావివి నీకేం తెలుస్తుంది నా సమర్థత. లోకం అంతా నన్ను గుర్తించింది



రువ్వు తప్ప" అన్నాడాయన ధుమ ధుమ లాడుతూ.

"ఈ చిందులు ఇప్పుడు తొక్కకండి. వాళ్లని ప్రశాంతంగా గడప దాటనివ్వండి. ఎలాగూ ఈ భాగోతం మనకెప్పుడూ ఉన్నదేగా."

"సరె. నేనక్కడ కూర్చొని మాట్లాడుతూ వుంటాను. పనులు చక చక అయిపోవాలి" అంటూ గదిలోకి వెళ్లి, అక్కడ కూర్చొని కబుర్లలోకి దిగాడు.

ఆవిడ చల్లని మంచినీళ్లు అందరికీ అందజేసింది.

మగవాళ్ళిద్దరూ కబుర్లలోకిదిగిపోయారు.

దేశ ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులు, నేటి విద్యావిధానం, యువతీ యువకులు, నగరంలో ప్రదర్శనశాల, సినిమాలు, ఆస్పత్రులు, అక్కడ అన్యాయాలు, ఊర్లో పేరుమోసిన డాక్టర్లు, విహారయాత్రలు చూడదగ్గ ప్రదేశాలు, ఎన్నికలు, స్త్రీల సమస్యలు, స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగాలు ఇలా అనేక విషయాలు, ఆ సంభాషణలో దొర్లాయి. వెంకట్రామయ్య ఉత్సాహంతో చెప్పుకు పోతున్నాడు. ఓపిగ్గా వింటున్నాడు వచ్చినాయన. ఆ ధోరణిని గమనించిన కమల, ఇక వూరుకుంటే వెంకట్రామయ్య అసలు సంగతి మరిచిపోయి, ఇంకో రెండు గంటలు అలాగే కబుర్లు చెప్పి, వాళ్లను పంపేస్తాడేమో అని భయపడి మెల్లగా ఆయన చెయ్యి గోకింది. ఆవిడలా చేసిందంటే కర్తవ్యాన్ని గుర్తుచేస్తున్నట్టు లెక్క.

ఆ దెబ్బకి వెంకట్రామయ్య తేరుకొని, "అమ్మాయిని తీసుకొస్తాము వుండండి, కమలా అమ్మాయిని తీసుకురా" అన్నాడు.

కమల లోనికి వెళ్ళింది. ఆవిడ వెంట ఆయనా లోనికి నడిచాడు.

ఒక నిమిషం తర్వాత కర్టెన్ తీసుకుంటూ ఒక అప్సరసలాంటి లావణ్యవతి, అడుగులో అడుగేసుకుంటూ మందగమనంతో ఆ గదిలోకి ప్రవేశించింది.

పెళ్లి చూపులకొచ్చిన అతను, ఆమెను చూశాడు. అదే పసుపురంగు చీర! అదే రంగు జాకెట్! వాటితో పోటీపడే శరీర ఛాయ! అదే హెయిర్ స్టైల్! అవే చామంతులు! అతనికి మతిపోయింది. అనందంతో ఉక్కిరిబిక్కిరైపోయాడు.

"ఏ దివిలో విరిసిన పారిజాతమో!
ఏ కవిలో విరిసిన ప్రేమగీతమో!" అని పాడుకోబోయి అందరూ ఎదురుగా వుండడంతో ఆగిపోయాడు.

ఆమెను ఎదురుగా కుర్చీలో కూర్చోబెట్టారు. అమె తల వంచుకు కూర్చుంది.

అతనికి ఆత్రం ఎక్కువైపోయింది. ఆమె తనని చూసిందా? చూస్తే ఆ అమ్మాయి 'ఇంప్రెషన్' ఏమిటి? ఇది తెలుసుకోవాలన్న కోరిక ఎక్కువైపోయింది.

అతను తనవంక చూడటం లేదని నిర్ధారణ చేసుకున్నాక, ఆమె తల ఎత్తి అలవోకగా అతని వైపు చూసింది.

అతను!!!

అదే ఆరడుగుల పొడవు! ఆ పొడుక్కు తగ్గ లావు. అందం తొణికిసలాడే ఆకర్షణీయమైన విగ్రహం. ఉంగరాల జుట్టు!

అతనా!!!

ఈసారి ఆశ్చర్యపోవడం ఆమెవంతయింది.

ఎవరిది

ఆమె ఆనందంతో పులకించిపోయింది.

నిండు పున్నమినాడు, పండు వెన్నెల్లో జాబిల్లి వెండి కిరణాల్ని నేలమీదకి దారాల్లా జారుస్తున్నప్పుడు, డాబామీద ఒళ్లో పడుకున్న అతని జుట్టుతో ఆడుకుంటూ, ఆ వుంగరాల జుట్టులో వేళ్లుపెట్టి తిప్పుతూ తాము కబుర్లు చెప్పుకుంటున్న దృశ్యం, ఎదుట పడగానే ఆమె సిగ్గులమొగ్గైంది.

ఓరగా అతనివైపు చూసింది.

అతను కిటికీలోంచి బయటకు చూస్తూ ఆలోచిస్తున్నాడు.

అతను ఏం ఆలోచిస్తున్నాడు? ఏంఅడగాలి అని ఆలోచిస్తున్నాడా? లేక ఆ రోజు సాయంత్రం హోటల్లో రమ అతని కేసి చెయ్యెత్తి చూపించి, గట్టిగా అతని గురించి మాట్లాడ్డం, గుర్తు చేసుకుని తప్పుగా అంచనా వేస్తున్నాడా?

ఆ ఆలోచన రాగానే ఆమె భయపడిపోయింది. 'ఛ. అక్కడికి ఆ రోజు దాంతో అలా వాగద్దే అని చెప్పింది. అది విందా? లేదు. పైగా దారినపోయే దానయ్య గురించి ఎన్నో అనుకుంటాం అంది. ఇప్పుడితను దారినపోయే దానయ్యా? దాన్నాధారంగా చేసుకుని అతనేమన్నా చెడ్డగా అనుకుంటే? స్నేహితురాలట, స్నేహితురాలు. ఎంతపని చేసింది' అనుకుందామె. ఆమెకు సన్నగా చెమటలు పోయసాగాయి. తనమీద అతని కెలాంటి 'ఇంప్రెషన్' వుందో! అదేంటి అలా బెల్లంకొట్టిన రాయిలా వుంటాడు. ఎంతకీ మాట్లాడ్డేం? అతను

వార

19-9-1975 శుక్రవారం మొదలు
25-9-1975 గురువారం వరకు

మేషం :— వ్యతిరేకమైన వార్తలను వింటారు. వ్యాపారంలో శ్రమ కలుగుతుంది. మీ తాలూకు వస్తువులు పోవచ్చును. వారం అఖరులో ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలులాభిస్తాయి. స్త్రీలకు —ఆరోగ్యం బాగుండదు. వినోద కాలాక్షేపాల్లో పాల్గొంటారు.

వృషభం :— మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. నూతన వ్యవహారాలు బాగుంటాయి. వారం అఖరులో ఫలితంలేని శ్రమ కలుగుతుంది. ఉద్యోగంలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. విలాస వస్తువులు కొంటారు.

మిధునం:— అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. ప్రయాణాలు ఫలిస్తాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు —ఆరోగ్యం బాగుంటుంది. బంధు మిత్రులను కలుసుకొంటారు.

కర్కాటకం:— వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. రావలసిన డబ్బు అందుతుంది. నూతన విషయాలను తెలుసుకొంటారు. మీ కంటే పెద్దవారు కూడా మీ సహకారాన్ని కోరవలసి వస్తుంది. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. స్త్రీలకు — పుణ్యకార్యాలు చేస్తారు. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

సింహం :— మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. సాహసిక వ్యవహారాల్లో నష్టం రాగలదు. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు బాగుంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు. స్త్రీలకు —ఆరోగ్యం బాగుండదు. శుభకార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

కన్య :— భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగుంటాయి. మీ ఆలోచనలు ఫలిస్తాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వారం ఆఖరులో చికాకులు యేర్పడతాయి. మీ ప్రయత్నాలకు ఆటంకాలు రాగలవు. స్త్రీలకు —కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. ఆందోళన కలుగుతుంది.

హో సం ?

మూగవాడా ? ఆ ఆలోచన రాగానే ఆమె ప్రాణం విలవిల లాడిపోయింది.

"ఆ. ఇందాక ఏం చెప్తున్నాను ? ప్రమోషన్ గురించి కదూ!" అంటూ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వచ్చాడు వెంకట్రామయ్య. "ఈ స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగాలింతే. ఎన్నాళ్ళయినా ఎక్కడున్నావే గొంగళీ అంటే వేసినచోటే అన్నట్టుగా, ఎన్నాళ్లయినా సీటు సైతం మారేది లేదు. నా కెంత అన్యాయం జరిగిందనుకున్నారు......" చర్చ మళ్లీ ఉద్యోగాలమీదకి మళ్లింది. తను అన్ని టెస్ట్లు పాసయినా, ప్రమోషన్లు అన్నీ తన జూనియర్లకి ఎలా ఇచ్చేశారో! ప్రభుత్వంలో కుల తత్వం, మత తత్వం, ప్రాంతీయాభిమానాలు డబ్బు, పలుకుబడి ఎలా పనిచేస్తున్నాయో ఆయన సోదాహరణంగా చెప్పకుంటూ పోసాగాడు. భర్త ధోరణి కమలకు చికాకుని కలిగించింది.

'సమయం సందర్భం లేకుండా ఏమిటీ అతివాగుడు. అసలు వాళ్లు వచ్చిందెందుకు. ఈయన వాళ్లకి చెప్తున్నదేమిటి ? ఈయన ప్రమోషన్ సంగతి ఎవడిక్కావాలి ? బోడి ప్రమోషన్ వస్తుంది, వస్తుందనడమే కాని అదివచ్చే జాడేలేదు. అమ్మాయి పెళ్లి చూపుల కోసం వాళ్లొస్తే, ఈయన తన ప్రమోషన్ గురించి వాళ్లను బోరెయ్యడమేమిటి ? పైగా పక్కన ఆడవాళ్లు ఇవేం అర్థంకాక విల విల లాడుతున్నారన్న సత్యం, ఆయన కెప్పుడర్థమవౌతుంది" అనుకుంది కమల చికాగ్గా. వాళ్లు లేకపోతే బైటకు అనేసేదే ఇప్పుడలా అంటే తల్లిలాగే కూతురు కూడా భర్తను లెక్కచేయ్యదేమో అని వాళ్లెక్కడ అనుకుంటారో అని భయపడింది. భర్తను ఊరుకోమన్నట్టు సైగ చేసింది వాళ్లు చూడకుండా. ఆయన వెంటనే వాగ్ధాటిని కట్టేశాడు.

"ఈమేనండీ మా అమ్మాయి" అంది కమల పెళ్లిచూపుల తతంగానికి నాంది పలుకుతూ.

"నీ పేరేమిటమ్మా" అడిగాడు పెళ్లి కొడుకు తండ్రి.

"సుమ" రపీమని సమాధానం చెప్పాడు వెంకట్రామయ్య. "అసలు సుమిత్ర అని పెట్టాం. కాని దాన్ని సుమ అని మార్చుకుంది" అంటూ సర్దుకుంటూ కూర్చున్నాడు.

"నీ వయస్సెంతమ్మా" అని అడిగింది పెళ్లికొడుకు తల్లి.

"అబ్బే ఎంతో ఎక్కడండీ. మొన్ననే పందొమ్మిది వెళ్లి ఇరవై ప్రవేశించింది" అందుకున్నాడు వెంకట్రామయ్య. దాని డేట్ ఆఫ్ బర్త్ ఫిబ్రవరి పద్నాలుగు పందొమ్మిది వందల యాభైఆరు అనుకుంటా. ఏమే అంతేనా" అంటూ భార్యవైపు తిరిగి అడిగాడు. ఆయన ప్రవర్తన చూస్తే ఆవిడకి అరికాలిమంట నెత్తికెక్కుతోంది. ఆమె ఏం మాట్లాడక పోవడంతో "ఆగండి అమ్మాయి ట్వెల్త్‌క్లాస్ రిజిస్టర్ పట్టుకొస్తాను" అంటూ కుర్చీలోంచి లేచాడు.

"అబ్బెబ్బె అక్కర్లేదండీ. ఊరికే అడిగాము" అంటూ లోపలికి వెళ్లబోతున్న ఆయన్ని వారించి కుర్చీలో కూర్చోపెట్టాడు వచ్చినాయన.

తండ్రి పడుతున్న ఖంగారుకి నవ్వొచ్చింది సుమకి.

ఆ వచ్చినాయన ఒక నిమిషం ఆగి కుర్చీలో సర్దుకుంటూ "ఏం చదువుకున్నావమ్మా" అని సౌమ్యంగా అడిగాడు.

"బి. యస్ సి. ఫస్ట్‌క్లాస్‌లో పాసయిందండి. నేను అమ్మాయిని బయలాజికల్ సైన్స్ తీసుకుని మెడిసన్ చదవమని చెప్పాను. కాని దానికి లెక్కలంటే ఇంట్రస్ట్. మేథమెటిక్స్‌తో డిగ్రీ పాసయ్యే ఆడపిల్లలు నూటికి కోటికి ఒకరు" అంటున్న ఆయన వంక చికాగ్గా చూసాడు పెళ్లికొడుకు. ఆమె కిన్నెర గొంతు విని ఆనందిద్దామంటే ప్రతి దానికి ఈయనేమిటి. పానకంలో పుడకలా ?

అతని భావాన్ని అర్థం చేసుకుంది కమల.

"వాళ్ల ప్రశ్నలకు సమాధానం చెప్పనివ్వకుండా నాన్నేమిటి మధ్యలో. ఏం మాట్లాడకపోతే, ముంగిలా కూర్చుంది. చదువుకున్నదన్న గర్వం అనుకుంటారేమో వచ్చినవాళ్లు" అని మనసులోనే భయపడింది సుమ.

"అన్నట్టు ఈ విషయం చెప్పడం మర్చిపోయాను. అమ్మాయికి కాలేజీలో మెరిటోరియస్ గర్ల్ అని ప్రైజ్ కూడా ఇచ్చారు. సర్టిఫికెట్‌కూడా వుంది" వాళ్ల మనోగత భావాల్ని పట్టించుకోకుండా తన ధోరణిలో అన్నాడు వెంకట్రామయ్య.

ఒక నిమిషం నిశ్శబ్దం రాజ్యం చేసింది.

"అబ్బాయి ! ఏమన్నా అడుగుతావా ?" అని కొడుకును అడిగాడాయన.

ఫలం

తుల :— మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. సాటివారితో మాటపట్టింపులు తగవు. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. ప్రయోజనంగల సంభాషణలను జరుపగలరు. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు —ఆరోగ్యం బాగుంటుంది. ఆడంబరంకోసం వ్యయం చేస్తారు.

వృశ్చికం — వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. మిత్రుల సహాయం లభిస్తుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. ప్రయాణాలు శ్రమ మీద ఫలిస్తాయి. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. స్త్రీలకు —సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి. దైవకార్యాలు నెరవేరతాయి.

ధనుస్సు:— ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. మీ మంచితనమే మీకు ఇబ్బందిని కలిగిస్తుంది. దైవకార్యాలు నెరవేరతాయి. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. స్త్రీలకు —ఆరోగ్యం బాగుంటుంది. బంధువులకు సహాయం చేస్తారు.

మకరం :— వృత్తిలో సాటివారి పోటీ తగ్గుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. సామాన్యమైన పనులకు కూడా యెంతో కృషిచేయవలసి వస్తుంది. స్త్రీలకు — పుణ్యకార్యాలు చేస్తారు. వేడుకలు ల్లోపాల్గొంటారు.

కుంభం:— ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. నూతన వ్యవహారాలు బాగుంటాయి. మీ ఆలోచనలు ఫలిస్తాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.

మీనం :— మీ కార్యక్రమాలు బాగుంటాయి. సాటివారిలో గౌరవం లభిస్తుంది. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. రావలసిన డబ్బు అందగలదు. స్త్రీలకు —కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధు మిత్రులను కలుసుకొంటారు.

— మహేష్

"మీకు లలిత కళలలో ప్రవేశం ఉందా?"
అడిగాడా అబ్బాయి.

"అమ్మయ్య అతనికి మాటలొచ్చు" అనుకున్న సుమ బోల్డు సంతోషపడిపోయింది. నోరు తెరచి సమాధానం చెప్పబోయింది.

"లేకేమండీ. అమ్మాయి బ్రహ్మాండంగా పాడుతుంది. యువవాణిలో ఎన్నో ప్రోగ్రాంలిచ్చింది కూడా. రవి ఆర్ట్స్ వాళ్లు పెట్టిన పోటీల్లో ఫస్ట్ ప్రైజ్ కూడా వచ్చింది మా అమ్మాయి ప్రైజ్‌లు, సర్టిఫికెట్లు చూపిస్తానుండండి" అంటూ కుర్చీలోంచి లేచాడు వెంకట్రామయ్య.

"అబ్బే అక్కర్లేదండీ" అని వాళ్లంటున్నా వినిపించుకోకుండా, "మా సంతృప్తి కోసం చూద్దురుగాని" అంటూ ఉత్సాహంగా లోపలికి వెళ్లిపోయాడాయన.


పెళ్ళికొడుకు తల్లి భృకుటి ముడివడింది "ఏమిటీయన ధోరణి. ఆ పిల్లను మాట్లాడనీయకుండా, ఈయనేమిటి? అసలా అమ్మాయికి మాటలొచ్చా? కొంపతీసి మూగపిల్లను ఎదుట కూర్చోపెట్టి నాటకమాడుతున్నారా? లేక మాలాంటి వాళ్లతో మాట్లాడ్డం ఆమెకి నామోషీనా?" అని అనుమాన పడిందావిడ.

ఆ అమ్మాయి కంఠస్వరం ఎలా వుందో వినాలనుకున్న పెళ్లికొడుకు నిరాశ చెంది పోయాడు

పెళ్లికొడుకు తండ్రి గడ్డం కిందచెయ్యి నుంచుకు భావాలకుఅతీతంగాఎటోచూస్తున్నాడు.

వాళ్లందర్నీ చూసిన కమలమ్మ నెమ్మదిగా లేచి లోపలికి వెళ్లింది.

బీరువాలోని వస్తువుల్ని చిందరవందరగా పారేస్తున్నాడు వెంకట్రామయ్య.



ఇది కొత్త మోడల్ చొక్కా! దీనికి పాంటు వేసుకోనే పనుండదు!!

ఎవరిది మోసం ?

"ఏమిటండీ ఏమైందీ?" అడిగిందావిడ.

"నీ బొంద ఏం కావాలి. అమ్మాయి సర్టిఫికెట్లేవి? నీ దిక్కుమాలిన సర్దడం కాదుగానీ ఈ ఇంట్లో ఏమీ కనిపించిచావదు." విసుక్కుంటూ అన్నాడాయన.

"ఎవరడిగారండి సర్టిఫికెట్లు"

"ఎవరడగాలి? సరదాగా చూపిద్దామని"

"చూడండి ఒక్కప్రశ్న అడుగుతాను. సమాధానం చెప్తారా? పెళ్ళిచూపు లెవరికి? మీకా? దానికా?"

"ఏమిటా చచ్చుప్రశ్న. నన్ను మరీ అంత చేతగాని చవటగా భావిస్తున్నావు నువ్వు"

"లేకపోతే ఏమిటండి. వాళ్ళు అడిగే ప్రశ్నలకు మీరెందుకు సమాధానం చెప్పడం? అది చెప్పలేదా."

"అదికాదే ఏదో చిన్న పిల్ల కదా! మొహమాట పడ్తుందేమో అని"

"అది మీకన్నా ఎక్కువ చదువుకుంది తెల్సా. అమ్మాయిగురించి మీరు వాళ్ళకు ముందే చెప్పారుగా. అయినా వాళ్ళ అడుగుతున్నారంటే కారణం, అమ్మాయి ఎలా సమాధానం చెప్తుందో చూడాలనేగా. వాళ్లకా అవకాశం ఇవ్వకుండా దాని వంతుకూడా మీరే సమాధానం చెప్పేస్తే వాళ్లేమనుకుంటారు. అమ్మాయి మూగదేమో, మాటలు రావేమో అది కప్పిపుచ్చటానికి మనం ఇట్లా మాట్లాడుతున్నాం అనుకోరూ"

"అబ్బే నేనంత దూరం ఆలోచించలేదే"

"సరే. మీరు మాట్లాడకుండా కూర్చోండి" అందావిడ ఇద్దరూ గదిలోకి వచ్చేసరికల్లా, పెళ్లి వాళ్ళతో మాట్లాడుతున్న కూతుర్ని చూసి ఆశ్చర్యపోయాడు వెంకట్రామయ్య.

"మా నాన్న అలా అంటారుగాని, నేనంత పెద్ద గాయకురాల్ని కానులెండి. అయినా చిన్నతనంనుంచీ నాకు సంగీతమంటె ఇష్టం అందుకే కొద్దిగా ప్రాక్టీసు చేశాను" అంది సుమ వినయం ఉట్టిపడేట్టుగా.

ఆ స్వరం ఆనందభైరవి పల్కుతున్న వీణానాదంలా వుంది పెళ్ళికొడుక్కి.

"బాగా పాడేవాళ్లకు ఇలా చెప్పుకోడంఅలవాటనుకుంటాను" అన్నాడతను నవ్వుతూ.

"బహుశః అది మీ అనుభవమేమో" చిరునవ్వుతో అంది సుమ.

"అబ్బ. ఇది ఇంత చక్కగా మాట్లాడ్డం ఎప్పుడు నేర్చుకుందబ్బా" అనుకుంటూ ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని వుండిపోయాడు వెంకట్రామయ్య.

గాలి రివ్వున వీచింది. అతని ఉంగరాల జుట్టు ఎగిరిపడి అతని నుదుటిమీద అల్లరిగా నర్తించసాగింది. దాన్ని చూసిన సుమ "ఎంత బాగుంది ఇతని క్రాఫ్" అనుకుంది.

అదే సమయంలో ఆమె వైపు చూశాడతను. అందమైన ముఖం అందాన్ని ఇనుమడింపచేస్తున్న హెయిర్ స్టైల్. "అబ్బ సినిమాల్లో హీరోయిన్లా ఉంది" అనుకున్నాడతను.

ఆ తర్వాత వాళ్ళు కొన్ని ప్రశ్నలడిగారు. ఆమె చక్కగా సమాధానం చెప్పింది.

"ఇక సెలవు. మేం కొద్దిరోజుల్లో తెలియజేస్తాం" అంటూ లేచారు వాళ్ళు.

"నాకు మాత్రం అమ్మాయి నచ్చింది. ఆ అమ్మాయికి కూడా నేను నచ్చితే ఖాయం చేసెయ్యండి" అంటూ తన 'స్పాట్‌డెసిషన్'ని ప్రకటిస్తూ ఆ అబ్బాయి బయటకునడిచాడు.

ఈ సారి ఆశ్చర్య పోవడం అందరి వంతూ అయింది.

* * *

"ఆయన జుట్టు ఎంత అందంగా ఉంది! ఒకవేళ దీన్ని చూస్తే ఏమన్నా అనుకుంటారేమో" అనుకుంది సుమ, ఏకతోకలా వున్న తన చిన్న జడను డ్రస్సింగ్ టేబిల్ దగ్గర అద్దంలో చూసుకుంటూ. ప్రక్కనే వున్న విగ్ ఆమెను వెక్కిరించింది "నేను మోసం చేసాననుకుంటారేమో! అయినా దాందేముంది, అందం కేవలం కురుల్లోనే వుందా. ఆ ఒక్క లోపం తప్ప, నేను అందాల బరిణను కానూ?" అనుకుంది సుమ భయంగా.

* * *

అదే సమయంలో,

"ఆ అమ్మాయి హెయిర్ స్టైల్ ఎంత అందంగా ఉంది! ఒకవేళ దీన్ని చూస్తే ఏమన్నా అనుకుంటుందేమో" అనుకున్నాడు మూర్తి, పాతికేళ్ళకే జుట్టు రాలిపోయి బట్టతలగా మారిన తలను అద్దంలో చూసుకుంటూ. పక్కనే వున్న విగ్ అతన్ని వెక్కిరించింది "నేను మోసం చేసాననుకుంటుందేమో అయినా దాందేముంది, అందం అంతా ఉంగరాల జుట్టులోనే వుందా! ఈ ఒక్క లోపం తప్ప నేను అందాల రాముడ్ని కాదూ" అనుకున్నాడు మూర్తి గుబులుగా.

సీరియల్

రాగవీచికలు

ఆదూరి వేంకటసీతారామమూర్తి

ఉదయం తొమ్మిదై వుంటుంది — ముందు హాల్లో యేదో ఆలోచిస్తున్న వర్ధని 'పోస్ట్' అన్న కేకకు త్రుళ్లిపడి లేచి వెళ్లింది—

వచ్చిన మూడు కవర్లలో ఒకటి రాజశేఖరంగారిది — ఆఫీసుకు సంబంధించినదని కవరే చెబుతోంది. రెండవ దానిపై ఆనందరావు ఎడ్రసు చక్కగా టైపు చేసి వుంది— మూడోది తన పేర్న వచ్చిన ఇన్‌లాండ్ కవరు-

దస్తూరి చూస్తేనే అది ఎవరు రాశారో తెల్సిపోయిందామెకు— గబగబా చింపి మొదలు పెట్టింది— నాలుగు లైన్లు చదివిందో లేదో ఆత్రుత తగ్గించి నెమ్మదిగా చదివింది— పూర్తిగా చదివాక ఆలోచనలో పడింది-

పాపం పసివాడు — మనసెంతలానో గాయపడితేగాని అలా రాయలేడు— నిజమే— ఒక విధంగా ఆలోచిస్తే వాసు పరీక్ష తప్పడానికి వాడొక్కడే కారణమెలా అవుతాడు? తలిదండ్రుల ప్రేమాభిమానాలకు దూరమైనా ఆ లోటును భర్తీ చేయగల వారి వద్దనే పెరుగుతున్నారు. కానీ వాళ్ళలో యింత కక్ష? తండ్రిచేసిన తప్పుకు పిల్లల మీదా పగచూపటం? పుస్తకాలులేనిదే వాళ్ళుమాత్రం ఎలా చదవగలరు? ఎలా పాసవగలరు — యేదో యింత తిండి పడేస్తూంటే చాలదా అనేగా వాళ్ళవుద్దేశం?

వర్ధని ఆలోచనలు పరిపరివిధాల పోయినాయి. ఎలాగైనా అన్నయ్యని ఒప్పించి వాళ్ళిద్దరినీ యిక్కడే చదివించే యేర్పాటు చేయాలనుకుంది.

ఎందుకో యిప్పటివరకూ యేదాపరికమూ లేకపోయినా యీ సంగతి మాత్రం మామయ్యకు అత్తయ్యకు చెప్పకూడదనుకుంది.

* * *

"రా అమ్మాయ్. రా—ఇంకా నేనే వద్దా

(గత సంచిక తరువాయి)

మనుకుంటున్నాను" లోపలకు వస్తున్న వర్ధనినిచూసి అన్నాడు ప్రసాద్. తనకోసం చేస్తున్న కాఫీలో మరికాసిన్ని పాలు పోసి రెండుగ్లాసుల్లోకి సర్ది,

"యేమిటమ్మా విశేషం" అన్నాడు కూర్చుంటూ.

"యేంలేదన్నయ్యా — నిన్నుచూసి వారం పైనే అయిందిగా. రెండోది వాసు వుత్తరం రాశాడు — ఆ విషయమై నీతో మాట్లాడి పోదామని..."

వర్ధని మాటల కడ్డొచ్చి "అయితే వాడు అన్నంతపనీ చేశాడన్నమాట" అన్నాడు.

"యేమిటన్నయ్యా అది?"

"యేముందీ పరీక్ష తప్పిందే కాకుండా మందలించబోయే తాతయ్యను నానామాటలూ అన్నాడట—పైగా అక్కడుండమే యిష్టం లేదన్నాడట —

మా అన్నయ్య దగ్గరుంటే నెత్తినెక్కిం

జరిగినకథ: 8 చదువుకుని ఉద్యోగంచేసి కుటుంబాన్ని ఆదుకోవాలనే వుద్దేశ్యంతో విశాఖపట్నం వచ్చిన వర్ధనికి, రాజశేఖరం మామయ్య ప్రోత్సాహం లభిస్తుంది. వర్ధని అన్న ప్రసాద్ చిరుద్యోగి. స్నేహితుడు రజనీకాంత్‌ని వర్ధనికి పరిచయం చేస్తాడు ప్రసాద్. వర్ధని మెట్రిక్ పాసవుతుంది. వర్ధని తల్లి మాణిక్యమ్మగారు మరణిస్తారు. వర్ధనీ రజనీకాంత్‌లు వివాహం చేసుకోవాలనుకుంటారు. సుందరిచే మోసగించబడ్డ ఆనందరావుకి అతనంటే ఇష్టపడే రాణిగురించి చెప్తుంది వర్ధని. ప్రయివేట్‌గా ఇంటర్ చదువుతూంటుంది వర్ధని.

చుకుని పూజిస్తాడా అన్నాట్ట- వీడికీ బుద్ధి ఎందుకు పుట్టిందో చెప్పు? పోని యేదో తల్లిలేని వాళ్లని ఆదరిస్తే వీడు చేసేదిదా? వాళ్ల మాటటుంచినా అది తెలిస్తే మామయ్యలేమనుకుంటారు? వాళ్లకీ కోపమొచ్చి వున్నపాళంగా పొమ్మన్నారనుకో — అప్పుడెందరో ఆలోచించాడా?"

ప్రసాద్‌లో అంతటి కోపాన్ని ఏనాడూ యెన్నడూ చూడని వర్ధని మొదట ఆశ్చర్యపోయింది. తర్వాత సర్దుకుని.

"ఇంతకీ నీకెవరు చెప్పారిలా అని..."

"ఇంకెవరు? తాతయ్యే స్వయంగా రాశాడు — ఇదిగో చూడు." అంటూ జేబులోని వుత్తరం తీసి అందించాడు.

అంతా చదివి "అన్నయ్యా. నేనొక మాట చెబుతా వింటావా" అంది వర్ధని.

"చెప్పమ్మా"

"నేను బాగా ఆలోచించే చెబుతున్నానిది"

"యేమిటమ్మా"

"యేంలేదు— తమ్ముళ్ళ నిద్దర్నీ యిక్కడే వుంచి చదివిద్దాం — నెల నెలా వీళ్లున్నారుగదాని అప్పో సప్పో చేసి పాతికో పరకో పంపిస్తూనే వున్నావు — కానీ వీళ్ల భారమంతా వాళ్లే మోస్తున్నట్లు చెబుతున్నారు. అసలు వీళ్లకయ్యే ఖర్చేమిటో చెప్పు — వాళ్ల పనివాడొక్కడు తినేది వీళ్లద్దరికీ చాలు — పోనీ నువ్వు పంపినదానితోనన్నా వాళ్ళకో గుడ్డ కుట్టించి పుస్తకాలు కొనొచ్చుగా — పైగా నువ్వు పంపేది ఎందుకు పనికొస్తుందని మాట! — ఎందుకుచెప్పు యివన్నీ — వాళ్ళకి భారమై వాళ్లముందు తప్పుచేసిన వాళ్ళలా తలొంచేకంటే యేవో నాలుగు మెతుకులు యిక్కడే తింటే మేలు."

వర్ధని మాటలు పూర్తిగా విన్నాడు ప్రసాద్. విని, 'యేమిటమ్మా-నువ్వు చెప్పేపని అయ్యేదే నంటావా? మనమొక దానికి చేస్తే వాళ్లింకోలా మాట్లాడతారు — తెగతెంపులు చేసుకున్నామనుకోరూ?"

"అనుకుంటే అనుకోనీ అన్నయ్యా — ఎన్నాళ్లని వాళ్ళనక్కడ వదిలేస్తాం—అంతగా కోపమొస్తే అమ్మ పేర్న రాసిన ముక్క మనకి కాకుండా తిరిగి రాయించేస్తారు — అంతేగదా—అంతకంటే మరేం చేయలేరు — కొండంత అమ్మే పోయింది — ఆవిడ డబ్బు యిస్తేనేం, యివ్వకపోతేనేం? నిజమైన

ప్రేమాభిమానాలే వాళ్ళకుంటే వాళ్ళిచ్చేది యేదో విధంగా ముట్టచెప్పకపోరు."

వర్ధని మాటలకు ప్రసాద్ చాలసేపు మాట్లాడలేదు.

"నువ్వు చెప్పిందీ ఆలోచించ దగ్గ విషయంలానే కన్పిస్తోంది" అన్నాడా తర్వాత.

ఆరోజు వర్ధనికి కంటిమీద కునుకు లేదు.

* * *

రాజశేఖరంగారు పట్టుదల గల మనిషి. అనుకున్నది సాధించేవరకూ అతనికి తృప్తి వుండదు.

వర్ధని యింటర్ పరీక్షలు రాసింది మొదలు వుద్యోగ ప్రయత్నంలోనే వున్నారాయన - తెల్సున్న ఆఫీసర్లు కందరికీ ఫోన్‌లు చేసి, స్వయానా కల్సుకుని మాట్లాడి చివరికి సాధించారు.

ఒక షిప్పింగ్ కంపెనీలో వర్ధనికి జాబ్ సంపాదించారు - ఆ వార్త విని నిజంగా పొంగిపోయింది వర్ధని - ఆనందభాష్పాలతో మామయ్య కాళ్ళు తడిపేంత పని చేసింది.

ఆయనపట్ల మునుపటి గౌరవభావం ద్విగుణీకృతమయిందా క్షణాన —

అదే రోజు మరో శుభవార్త కూడ తెల్సింది — వస్తుందో రాదో ననుకున్న వుద్యోగం ఆనందరావుకి వచ్చింది.

ఆ రోజు ఆయింట ఆనందం వెల్లివిరిసింది — ప్రసాద్ కూడ ఆ వుత్సాహంలో పాలు పంచుకున్నాడు. ఆ రాత్రే చెల్లెలితో మాట్లాడి ఆమె సూచనను అమలు జరిపేందుకు తన సమ్మతిని తెలియజేశాడు.

* * *

వివరివెలా నొప్పించకుండా ఒప్పించాలో ఆలోచించుకున్నారు అన్నా చెల్లెళ్ళిద్దరూ — మాధవరావుగారితో మంచిగానే విషయం కదిల్చి అట్టే శ్రమ లేకుండానే సఫలీకృతుడయ్యాడు ప్రసాద్.

రాజశేఖరంగారితో పరిస్థితినంతా వివరించి పిల్లల బాగోగులకోసం తనూ అన్నయ్య దగ్గరే వుండటం భావ్యమేనేమోనన్న అభిప్రాయం వ్యక్తపరచింది వర్ధని.


మొదట రాజశేఖరంగారేం మాట్లాడలేదు — తర్వాత "నిన్ను చదివించింది నీ కాళ్ళమీద నువ్వు నిలబడేటట్లు చేయడానికే నమ్మా — ఆలోచించుకుని నీ యిష్టమొచ్చినట్లే చెయ్యి" అన్నారాయన —

అంతే!

జీవితంలో ఎంతో సాధించా ననుకుంది వర్ధని ఆ క్షణాన —

రెండు గదులున్న మంచి యిల్లొకటి అద్దెకు తీసుకుని పాలు పొంగించి రాజశేఖరంగారినీ, విమలనీ, ఆనందరావుని ఆహ్వానించి తన జీతంలో కలిగినంతగా సత్కరిస్తేగాని ఆమెకు సంతృప్తి అన్పించలేదు—

ఆ రాత్రి వర్ధని కంటినిండా నిద్రపోయింది.




19

రా గ వీ చి క లు

ఆరోజు ఫస్టు తారీఖు. మామూలుగా సాయంకాలం ఐదు గంటలకు యింటికి వచ్చే ప్రసాద్ యింకా యిల్లు జేరలేదు— అతని కోసం ఒకరిద్దరు వచ్చికూడ వెళ్ళారు— వీధి గుమ్మంలో కూర్చుని అన్నయ్య రాక కోసం ఎదురు చూస్తోంది వర్ధని— రకరకాల ఆలోచనలు వస్తున్నాయి. ప్రసాద్ కోసం వచ్చి వెళ్ళిన వారెవరో చూచాయిగా గ్రహించకపోలేదు— అయితే అందుకే అన్నయ్య యింటికి రాలేదా ?

ఉన్నట్టుండి వర్ధని కళ్ళు ఎదురింటి మేడ మీదికి పోయాయి— అతనెవరో ఎప్పట్నించి చూస్తున్నాడోగాని కళ్ళతోనే తాగేసేట్టు చూస్తున్నాడు—



పల్లెటూళ్ళలోలా పట్నాల్లో వీధి గుమ్మంలో కూర్చోడానికి పడదు— ఎవరిదో ఒకరి కన్ను యేదో విషయంలో కని పెడుతూనే వుంటుంది.

వీధి తలుపులు జారవేసి లోపలకొచ్చి కూర్చుంది— ఆమె ఆలోచనలు రజనీకాంత్ పైకి మళ్ళాయి— అందమైనవాడు, అందమైన హృదయం కలవాడు— డబ్బు—డబ్బుకు తగ్గ హోదా— అన్నీ ఉన్నాయి— గులాబి ముళ్ళవంటి లోపాలు తొంగి చూడకపోతే మనిషెలా అవుతాడు ?

యేమో ! తనే అతనిని తక్కువ అంచనా వేస్తోందా ? జీవితంలో ఎందరో ఎన్నో రకాలుగా తారస పడతారు— కొందరి నప్పటికప్పుడే మర్చిపోగలం— కొందరిని జీవితాంతం మర్చిపోలేం తనకు అతను తారస పడినట్లే అతని కామె కూడ తారసపడొచ్చుగా— అది కేవలం అక్రమ సంబంధమనే ఎందు కనుకోవాలి ? స్నేహమో మరోటో ఎందు కవ కూడదు ?

ఆ రాత్రి తొమ్మిది దాటాక యింటికి వచ్చాడు ప్రసాద్. అప్పటికే వాసు, కిష్టుడు అన్నాలు తిని నిద్రపోయారు — స్నానానికి నీళ్ళిచ్చి తనకూ ప్రసాద్‌కు కంచాలు పెట్టింది వర్ధని.

"యేమిటమ్మా — నువ్వింకా తినలేదూ ? ఇలా బయటకుపోయే వాడితో లంకె పెట్టుకు కూర్చుంటే ఎలాచెప్పు ? మేమేదో ఎక్కడో ఎక్కడో యిన్ని కాఫీనీళ్ళు తాగి వుండిపోతాం."

అతని మాటకు సమాధానం చెప్పకుండానే అన్నం కలుపుకుంది వర్ధని— ఆమెకు తెల్సు ప్రసాద్ ఎక్కడా యేమీ తినడని — ఇంట్లో పొద్దుట కాఫీతాగి వెళితే మళ్లీ మధ్యాహ్నమే భోజనం—సాయంకాలం వచ్చాక కాఫీ — రాత్రి భోజనం—ఎప్పుడో వారానికోసారి టిఫిన్ వుంటే వుంటుంది.

భోజనాలయ్యాక "అన్నట్టు...అన్నయ్యా నీ.గురించి ఎవరో యిద్దరొచ్చి వెళ్ళారు" అంది వర్ధని. చెల్లెలి మాటలకు గతుక్కుమని, "యేమన్నా అన్నారా" అడిగాడు.

"యేంలేదన్నయ్యా. నువ్వున్నావేమోనని వచ్చారుట. రాలేదని చెప్పగానే వెళ్లిపోయారు." మామూలుగానే అంది వర్ధని. నిజానికి వాళ్ళంత సౌమ్యంగా అడగలేదు. అన్నయ్య ముఖంలో మారిన రంగులను గమనించకపోలేదు వర్ధని. అందుకే భోజనమయ్యాకే చెప్పిందా విషయాన్ని. మరేం మాట్లాడకుండా ముందు గదిలోకి వెళ్లి యీజీ ఛైర్‌లో కూర్చున్నాడతను.

వంటింట్లో పనంతా పూర్తిచేసుకుని ప్రసాద్ పక్కదులిపి, చాప, దిండు నేలమీద వేసుకుని కూర్చుని.

"ఈరోజు ఓటీయా అన్నయ్యా" అంది.

"లేదమ్మా— ఆఫీసునుండి యింటికొస్తూంటే దుర్వార్త చెవినబడింది— దాంతో మనసు వికలమై ఆటుపరుగెత్తాను"

"యేమిటన్నయ్యా అది" గుండెను దిటవు చేసుకుని నెమ్మదిగా అడిగింది—

"రాజమండ్రీ వెళ్లి వస్తూన్న రజనీకాంత్‌కు యేక్సిడెంటైందమ్మా. స్కూటరు నామరూపాలు లేకుండా పోయిందట— ఎవరో పుణ్యాత్ములు కారులో వేసుకొచ్చి ఆస్పత్రిలో ఎడ్మిట్ చేశారుట— రామయ్య ఎదురై చెప్పాడీసంగతి"

ఈ వార్త వినేసరికి వర్ధని మనసు ఆదోలా అయిపోయింది. గుండెలో వేయి గునపాలు ఒక్కసారి గుచ్చినట్లైంది.

"నువ్వెళ్ళి చూశావా అన్నయ్యా— ఎలా వున్నారాయన !" అడిగింది ఆత్రుతగా—

"నేను వెళ్లేసరికి అతనికింకా స్పృహ రాలేదమ్మా— తలకు, కాళ్లకూ గాయాలు తగిలాయి— ఎడం చెయ్యి ప్రాక్చర్ అయిందని అంటున్నారు డాక్టర్లు— అయినవాళ్ళెవరూ లేకపోతే యిలాగే వుంటుంది. జేబులో పాస్‌పోర్టున్నా వుండబట్టి యీ సంగతన్నా తెల్సింది. పాపం రామయ్యే బంధువులకంటె ఎక్కువగా కనిపెట్టుకు కూర్చున్నాడు. నేను వెళ్లాకనే వాళ్ల ఆఫీసువాళ్లు కూడా వచ్చి వెళ్లారు."

అతని మాటలు వింటుంటే వెంటనేవెళ్లి అతన్ని చూద్దామా అన్పించింది వర్ధనికి. పెదవి వరకూ వచ్చిన మాటను దిగమింగుకుంది.

అర్ధరాత్రి - అందులోనూ పరాయి మగాడు లోకంవరకూ వెళ్లకపోయినా బంధువులైనా యేమన్నా అనుకోక మానరు !

కాస్సేపటికి ప్రసాద్ నిద్రపోయినా వర్ధని మాత్రం నిద్రపోలేకపోయింది. కళ్లు తెరచినా మూసినా అతడే కన్పిస్తున్నాడు.

నవ్వుతూ... అదోలా చూస్తూ...ఎగతాళి చేస్తూ... విరహంతో వేగిపోతూ

తనెంతటి దుర్మార్గురాలు? యే విషయమూ తెల్సుకోకుండా మనసులో అతనిపట్ల అనుమానానికి తావిచ్చింది. అనుమానమన్నది కల్లకనే పోవాలి. అది అగ్నికంటే భయంకర మైనది. అందుకేనేమో తను మునుపటిలా రజనీకాంత్ యింటికి వెళ్లలేకపోతుంది.

యేమైనాసరే తెల్లారిలేచి ఆయనను చూడాలి. మనసు విప్పి అన్నీ చెప్పెయ్యాలి. తన తప్పుడు ఊహకు తగిన శిక్ష విధించ మనాలి.

ఆలోచనల్తో ఎప్పుడో మాగన్ను పట్టింది.

పాలవాడు తలుపు బాదుతుంటే చటుక్కుని తెలివి తెచ్చుకుని లేచింది. చీకటి తెరలను తొలగించుకుని తూర్పు ఆకాశం ఎర్ర బడుతోంది.

చర్చి గంట అయిదు కొట్టింది.

"యేమిటమ్మా — ఈరోజు త్వరగాగావి వెళ్లాలేమిటి ఆఫీసుకి" అడిగాడు ప్రసాద్ కాఫీ తాగుతూ. అప్పటికే స్నానం అవి ముగించి రెడీగా వుంది వర్ధని.

"యేంలేదన్నయ్యా రాత్రి నువ్వు ఆ సంగతి చెప్పింది మొదలు ఆయనను చూడా లనిపించింది. ఒక్కసారి హాస్పిటల్‌కి వెళ్లొస్తాను" అంది.

"దానికేముంది వెళ్లమ్మా. కానినువ్వొక్క దానివీ కనుక్కోగలవా? అయినా స్పెషల్ వార్డులో పేరుచెబితే చెప్తారులే" అన్నాడు.

"త్వరగానె వచ్చేస్తాను. ఒకవేళ బస్సు దొరక్క నేను రాలేని పక్షంలో భోంచేసివెళ్లు. వంట అయిపోయింది" అంది ఫ్లాస్కులో కాఫీ పోసి సంచిలో పెడుతూ—

"సాయంకాలం ఆఫీసు నుండి వచ్చే టప్పుడు వస్తానని చెప్పమ్మా ఆయనతో" అన్నాడు ప్రసాద్ గుమ్మం దాటి వెళ్తున్న వర్ధనితో.

* * *

సిటీబస్సు దిగి హాస్పిటల్‌లోకి అడుగు పెట్టింది వర్ధని. అప్పటికే రోగులతోనూ డాక్టర్లతోనూ కిటకిటలాడుతున్న ఆ ప్రదేశాన్ని చూస్తుంటే గుండె గుభేలుమంది. బెడ్స్ అన్నీ నిండిపోయి వున్నాయి. కొందరి

రాగవీచికలు

రోగులకు పక్కలు క్రిందనే వేశారు. ఒక్కో చోట బెడ్‌కీ బెడ్‌కీ మధ్య ఒక అడుగు దూరం కూడ లేదు. ఇంత పెద్దాసుపత్రి వున్నా చాలటంలేదంటే దేశంలో రోగాల సంఖ్య జనాభాను మించి వుందేమో ననిపించింది.

ఆట్టే శ్రమపడ కుండానే స్పెషల్ వార్డు లోనికి అడుగు పెట్టింది. ఎందుచేతనో ఆమె

నాకూవచ్చు కవిత్వం

వచ్చు వచ్చు
నాకూ వచ్చు
కవిత్వం!
వాక్యాలను
త్వం
చి,
ముక్క ముక్కలు చేసి,
అవరోహణ క్రమంలో
వ్రాసేయడమే కదా
కవిత్వమంటే!
ఓ యబ్బో! ... ...
కవిత్వమంటే ఎంతో
కష్టమనుకున్నా యిన్నాళ్ళూ!
అబ్బా!
ఎంత సులభం
మీ కర్మకొద్దీ
నాకూ వచ్చింది కవిత్వం!
మెచ్చేరా సరేసరి!
లేదా,
బూతులు తిడతా!

— "వికటవాణి"

కాళ్లు వణికాయి. మనసు భయానికి లోనైంది.

అక్కడ బెడ్సు చాల తక్కువే వున్నాయి. ఉదయం, అందులోనూ విజిటర్స్ రోగులను చూసే సమయం కాబట్టి ప్రతి మంచం దగ్గరా ఒకరో యిద్దరో వుండనే వున్నారు. కానీ రజనీకాంత్ దగ్గర మాత్రం ఒక్కరూ లేరు. ఎత్తైన దిండుమీద తల వాల్చి చూస్తున్న వాడల్లా వర్ధనిని చూసి చిన్న నవ్వునవ్వాడు.

అతని తలకు చిన్న కట్టు వుంది. ఫేంటు తొడగడంవల్లనేమో కాలికున్న కట్టు కన్పించటంలేదు. ఎడంచేతికి పెద్ద బేండేజ్ వుంది. ఆ స్థితిలో అతన్ని చూసేసరికి వర్ధనితో ఎక్కడలేని దుఃఖమూ ముంచుకొచ్చింది.

"బాగున్నావా వర్ధనీ" బలహీనంగా వున్నాయతని మాటలు. కొంచెం సేపు యే మాటా మాట్లాడలేక పోయింది వర్ధని. మౌనంగా అతని వంక రెప్ప వాల్చకుండా చూస్తూ నిలబడి పోయింది.

"కూర్చో వర్ధనీ. నిన్నొకసారి చూస్తే బాగుండుననీ అనుకుంటున్నాను. నామీద దయవుంచి వచ్చావు" అన్నాడు తిరిగి అతనే—

"నన్ను మన్నించండి కాంత్" కూర్చుని తల దించుకుంది.

"ఎందుకూ' కొద్దిగా కదిలి లేవబోయి. లేవలేక తిరిగి యధాస్థానంలో పడుకుని ప్రశ్నించాడు ఆమె వంకే చూస్తూ.

ఆమె కన్నుల్లో నీళ్లు నిలిచాయి.

"ఛా, అదేమిటి వర్ధనీ బాధపడు తున్నావా? ఇప్పుడేమైందని? యీ ఘటం ఇంతలో పోయేది కాదులే" నవ్వేసి, కళ్ల నుండి వుబికి చెంపలమీదుగా జారుతున్న ఆమె కన్నీటిని రెండు వేళ్లతో తుడిచాడు.

దుఃఖాన్ని దిగమింగుకుని ఫ్లాస్క్‌లోని కాఫీ తీసి అతని కిచ్చింది రెండు గుటకలు తాగి "పొద్దుటే అనుకున్నాను వర్ధనీ యిక్కడున్న రోగులందరికీ అందరూవున్నారు నాకే ఎవరూ లేరని"

"నేను బ్రతికుండగా మీ కెవ్వరూ లేక పోవడమేమిటండీ" ఆమె కన్నుల్లో సంతోషం చిలికింది—

"ఇంతకీ వర్ధనీ. ఈ యేక్సిడెంటు ఎందు కైందో చెప్పగలవా"

నాకేం తెలుసు నన్నట్లు అతని వంక చూసింది.

"నే చెప్పనా. రాజమండ్రి వెళ్తున్నట్లు దేవిగారికి చెప్పకపోవడం వల్లనే"

అతని మాటలకు తలొంచుకుంది.

"ఇంతకీ డాక్టర్లేమంటున్నారో తెల్సా"

"యేమంటున్నారూ?"

"యింకో పది రోజులన్నా వుండాలట"

"మరి వుండొద్దా? తగ్గాలిగా"

"వుండాలి వుండాలి. హాస్పిటల్లో వుంటేనే తగ్గుతుందా యేం? రేపే యింటికి పోయి ప్రైవేట్‌గా ట్రీట్‌మెంట తీసుకోవాలి.

[ఇంకా ఉంది]

సీరియల్

గాజువోడు

పోలాప్రగడ రాజ్యలక్ష్మి

"రౌడీ సంగతి మీకు తెలియదు. అది మహా గడుగ్గాయి. పెళ్ళయితే ఆ వెర్రి సీతాలుగాడిని కూర్చోబెట్టి పైన గంప బోర్లిస్తుంది."

కొంచెం కోపంతో కొద్దిగా ఎర్రగా అయిన కళ్ళని బరువుగా ఎత్తి అతనికేసి చూసి "అదేవిటండీ! మీరు మరీను" అంది జానీ.

"నిజం అండీ ... పైగా వాళ్ళిద్దరూ తోడు దొంగలు. ఇంతకుముందు ఇద్దరూ కూడబలుక్కునే వుంటారు. మిమ్మల్నీ మిమ్మల్నీ చెప్పమనడం ఇదంతా ఒక తంతు."

ప్రభాకరం యీ మాటలన్నీ చెప్తూంటే టేబిల్‌మీద వున్న గుండ్రని గాజుబంతి లాంటి పేపర్ వైట్‌ని, గుండ్రంగా తిప్పుతూ నిశ్శబ్దంగా కూర్చుని కూర్చుని, వెళ్ళబోయేముందు, కళ్ళు పూర్తిగా ఎత్తకుండా ప్రభాకరంవేపు గమ్మత్తయిన చూపు చూసి తడబడుతూ బరువైన అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయింది జానీ.

ఆ చూపుకి బిత్తరపోయాడు ప్రభాకరం.

అతని మనస్సూ, హృదయం ఒక్కమారు అతని వశం తప్పాయి. ఎప్పుడూ ఏ ఆడదాని చూపులకీ చలించని తాను ఇప్పుడిలా ఒక్కక్షణం కదిలిపోయాడేవిటి? ... టేబిల్‌మీద పేపర్ వైట్ ఇంకా గుండ్రంగా తిరుగుతూనే వుంది., అతని మెదడులో చెలరేగి సుడి తిరుగుతూన్న ఆలోచనలకి ప్రతీకగా —

15

"లీలా నాకు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో ఉద్యోగం వచ్చింది. జీతం నెలకి మూడు వందలు" అంటూ వీధిలోంచే అరుస్తూ వస్తూన్న మురళిని చూసి ముసిముసినవ్వులు నవ్వుతూ మురిసిపోయింది లీల. చేత్తో ఆర్డరు కాగితం పట్టుకుని ఆ గదిలోంచి ఈ గదిలోకీ, హాలులోంచి వంటింట్లోకీ, నడవలోంచి పెరట్లోకీ, ఇలా గబగబా తిరిగేస్తూ తనని వెదికేస్తూన్న మురళిని చూస్తే ముచ్చటేసి అమాంతం వెళ్ళి అతన్ని ముద్దులతో ముంచేద్దామా అనిపించింది లీలకి.

"ఎక్కడ లీలా? ఎక్కడికెళ్ళావు?" అంటూ కళ్ళతో ఇల్లంతా కలయవెదికేస్తున్నాడు. లీలకి నవ్వు ఆగలేదు. "హమ్మదొంగా ఇక్కడున్నావా?"అంటూ దగ్గరగా వచ్చి, ముఖానికి అడ్డంగా పెట్టుకున్న పేపర్ని మురళి లాగిపడెయ్యడంతో లీల పకపకా నవ్వేసింది.

"నాకు ఉద్యోగం వచ్చింది తెల్సా?"

"ఊఁ"

"ఎక్కడని అడగవేం?"

"చెప్పు"

"చావ్‌కూర్ స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో"

"అహా!"

"జీతం ఎంతో తెల్సా? నెలకి మూడు వందలు"

"బాగానే వుంది."

"ఏవిటంత నిర్లిప్తంగా అంటావు అహా, ఉహూ, అలాగా అంటూ, నేనింత సంతోషంగా ఈ వార్త చెబుతూవుంటే!"

(గత సంచిక తరువాయి)

"లేకపోతే నీతోపాటు అరుస్తూ గెంతమంటావా?"

"ఏవిటి లీలా?" మురళి చిన్నబుచ్చుకున్నాడు.

"లేకపోతే ఏవిటి మరి? బోడి మూడువందల రూపాయల ఉద్యోగానికి అంత సంతోషం ఎందుకు? పైగా నీ అంతటి ఆర్టిస్టుకి అంత చిన్న ఉద్యోగం వచ్చినందుకు ఈ దేశం యొక్క దౌర్భాగ్య స్థితికి విచారించాలికాని సంతోషించనక్కర్లేదు. పోతే, ఈ వుద్యోగం నువ్వు చెయ్యొద్దు."

మురళి ఛర్రున లేచాడు. "ఏవిటి? యిది బోడి వుద్యోగమా? ... అవున్లే ... ధనవంతురాలివి కదూ? అందువల్ల యివి ముష్టి మూడు వందలులాగే కనిపిస్తాయి నీకు. ఉద్యోగం చెయ్యొద్దంటావా? ... ఏం? ... రాక రాక, నాకిన్నాళ్ళకి వుద్యోగం వస్తే చెయ్యకపోవడం ఏమిటి? చేస్తాను. చేసితీరుతాను."

"అదికాదు మురళీ! ఆ వుద్యోగం మనకి ఎందుకు చెప్పు! మనకేం లేదా పోదా? మూడు తరాలు తిన్నా తరగని ఆస్తి వుంది మా నాన్నకి. ఆయనకి నే నొక్కర్తెనే కూతుర్ని ... హాయిగా ఆయన దగ్గర్నుంచి డబ్బు తెప్పించుకుంటూండడం, మనకి చూడాలనున్న ప్రదేశాలకీ, శిల్ప క్షేత్రాలకీ పోయి చూస్తూవుండడం...ఆర్ట్‌మీద నీకు కావలసినన్ని పుస్తకాలు తెప్పించుకొని చదువుతూ ఉండడం, వెయ్యాలని ఉన్నప్పుడు బొమ్మలు వేసుకుంటూ ఉండడం— రాజాలాగ బతక్క నీకు ఎందుకొచ్చింది చెప్పు ఈ ఉద్యోగం బాదరబందీను?..."

"నాదంటూ ఒక సంపాదన లేకుండా ఇంకా ఎన్నాళ్ళు నీ ఆస్తిమీదా, డబ్బుమీదా బతకమంటావు?"

"నీదేవిటి నాదేవిటి మురళీ! నేనే నీ దాన్నయినప్పుడు నా డబ్బు నీదికాదా?"

"ఏమైనా సరే లీలా నేనీ ఉద్యోగం చేసి తీరాల్సిందే"

"ఏవిటా పట్టుదల మురళీ"

"అవును...అంతే"

"నా మాట వినవా?"

"ఉహూఁ"

"సరే అయితే !"

ఆ రోజల్లా లీల మురళితో మాట్లాడలేదు. మురళి కూడా ఆమె పలకరిస్తేనే పలుకుదాం అని ముభావంగా కూర్చున్నాడు ... రెండు మూడు గంటలు ఒకళ్లతో ఒకళ్లు మాట్లాడుకోలేదు. తర్వాత "చాలా సంతోషం కాని ... కడుపులో ఈ పాటికి ఆకలివేస్తూ ఉంటుందీ, లే భోజనం చేద్దువుగాని" అంది లీల కోపంగా.

అన్నం తింటున్నంతసేపూ మురళి ముఖం ముడుచుకొనే కూర్చున్నాడు. పెరుగు పోస్తూ "పంతం నెగ్గించుకున్నావుగానీ, మూతి బిగించుకొని కూచోకు ... కాస్సేపు మాట్లాడు. అల్లాగే జేరుదువుగానిలే వుద్యోగంలో!" అంది లీల విసుగ్గా. అయినా ఆ రోజల్లా మురళి ముభావంగానే వున్నాడు. అతణ్ణి నవ్వించి మామూలు మనిషిని చెయ్యడానికి ఆ తర్వాత ఇరవైనాలుగు గంటలు పట్టింది లీలకి.

రెండురోజు లయ్యాక ఆ యింట్లో మళ్ళీ పూర్వంలాగ నవ్వులూ, కబుర్లూ, ఛలోక్తులూ వినిపించాయి. అయితే ఏ పది పదిహేను రోజులకో ఒకమాటు ఏదో ఒక విషయంమీద వాళ్ళిద్దరూ వాదించుకుంటూనే వున్నారు. మాటలు బిగించు

జరిగిన కథ 10 : భద్రయ్యగారి పిల్లలు మురళి, ఉషలు. భద్రయ్యగారి ఆస్తంతా దాన ధర్మాలతో హరించిపోయింది. భద్రయ్యగారి కుటుంబాన్ని కనిపెట్టి వుండమని కొడుకు ప్రభాకరానికి చెప్తారు జోగమ్మగారు. ఉషని చెరచ ప్రయత్నిస్తాడు అంకరాజు. భద్రయ్యగారు మరణిస్తారు. ఢిల్లీ చిత్ర కళా ప్రదర్శనలో బహుమతి సంపాదిస్తాడు మురళి. ఉషని మద్రాసులోని ఆంధ్ర మహిళా సభలో చేర్పిస్తాడు ప్రభాకరం. దొడ్డమ్మ జోగమ్మగార్ని చూడాలని వస్తుంది లీల. మురళితో కలసి విహార యాత్రలకి బయల్దేరుతుంది లీల. పెళ్లనే తంతు లేకుండానే దంపతు లౌతారు లీల మురళిలు. మెడిసన్ పూర్తయ్యాకే పెళ్లి అన్న ప్రభాకరం అంటే యేవగింపు కలుగుతుంది ఉషకి. లీల మురళిలను చూడాలని వచ్చిన ఉష, ప్రభాకరాన్నీ కలుస్తుంది. ప్రమాదవశాత్తు మేడమీదనుంచి పడిన జోగమ్మగారి వెన్నెముక దెబ్బతింటుంది. ప్రభాకరం సహాయాన్ని తిరస్కరిస్తుంది ఉష.

కుంటూనే వున్నారు, తిరిగి ఎవళ్ళో ఒకళ్ళు తమ పట్టుదల తగ్గించుకుని రెండోవాళ్ళని పలకరించి నవ్విస్తూనే వున్నారు. మురళి వుద్యోగానికి వెళ్ళి వస్తూనే వున్నాడు. వారాలూ నెలలూ గడుస్తూనే వున్నాయి. కృష్ణపక్షం, శుక్లపక్షం లాగ చిన్న చిన్న కలహాలూ, ప్రణయ కోపాలూ, అలకలూ, కులుకులూ, నవ్వులూ, కేకలూ, కేరింతాలూ నడుస్తూనే వున్నాయి.

ఒకరోజున మురళి అర్జంటుగా పంపవలసిన చిత్రాన్ని గీస్తున్నాడు. అరగంటయి పక్కనే వచ్చి కూచున్న లీలని అతను గమనించనేలేదు. దాంతో లీల విసుగ్గా "ఎప్పుడూ ఈ బొమ్మలూ, రంగు లేనా ? వేరే ప్రపంచం అక్కర్లేదా ?" అంది.

"ఇప్పుడేమైందని ?" — బొమ్మ మీంచి దృష్టి మరల్చకుండానే అన్నాడు.

"ఇటు చూసి మాట్లాడటానికి ఏం ? అంత పనికిరాని వస్తువునై పోయానా ? అవున్లే ! కొన్నాళ్ళయేసరికి మొగాళ్ళ మోజులు యిలాగే తగ్గుతాయి."

"ఏవిటా అర్థంలేని కోపం ? ఈ బొమ్మని అర్జంటుగా వేసి పంపాలి ..నాతో వాదించి నా పని పాడుచెయ్యక వెళ్ళు."

"ఆ ?...విసుక్కోవడం వరకూ వచ్చిందీ?... అవున్లే .. నాకు ఏ ఆర్టూ రాదుకదూ ? అందు చేత ఈ అలుసు." ఈ మాటలు అంటున్నప్పుడు లీల కంఠం బొంగురుపోయింది. కంఠంలో వచ్చిన మార్పు గమనించి, చేతిలో వున్న కుంచె పక్కన బెట్టి దగ్గరగా వచ్చి బుజ్జగిస్తూ గెడ్డం ఎత్తి ఆమె ముఖాన్ని తనవేపు తిప్పుకుంటూ "ఈమాత్రానికే ?" అన్నాడు. అప్పటికే ఆమె కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

"దొంగ బుజ్జగింపులూ నువ్వూ — నాకేం అక్కర్లేదు" అంటూ అతని చేతిని విదిలించి కొట్టింది లీల.

"అబ్బ ! ... ఊరికే యిలా కోపం తెచ్చుకుంటే ఎలా చెప్పు ... అసలేం జరిగింది ? ... ఏం జరిగింది లీలా చెప్పు !"

"నేను చెప్పాలా ? నీకు తెలియదూ ?" కోరగా చూసింది లీల.

"అదికాదు లీలా ! ఏదో పనిలో వున్నాను. పైగా పొద్దున్న లేచింది మొదలు యిద్దరం అస్తమానూ మాట్లాడుకుంటూనే వున్నాంకదా?... యింకా వేరే మాట్లాడుకోవలసినవి యేమున్నాయి ? ఊరికే కబుర్లని మొదలెడితే పొగుడుకోవడమో పోట్లాడుకోవడమో మిగుల్తోంది. అయినా తీరిగ్గా కూర్చుని నిన్ను నేనూ నన్ను నువ్వూ పొగుడుతూ కూర్చుంటే యేం బాగుంటుంది ? అభిమానాలో ప్రేమలో ఆత్మీయతలో గుండెల్లో వుండాలికాని."

ఇలా కాస్సేపు మురళి మాట్లాడి అనునయించే సరికి లీల మనస్సుకి ఊరట కలిగింది. అయినా ఆమె మనస్సులో అసంతృప్తి పోలేదు. అతనికి బొమ్మలు వెయ్యడంతోనో, ఉద్యోగానికి వెళ్ళిరావడం తోనో పొద్దు బాగానే గడుస్తోంది. తనకే వంటరి తనంతో, స్నేహితు లెవరూ లేక, కాలక్షేపంకాక పిచ్చి ఎత్తినట్లుంటోంది. కాళీగా వుండడంవల్ల

గాజు వేడ

ఎందుకూ పనికిరాని రకరకాలైన ఆలోచనలు.

దాదాపు నాలుగేళ్ళు కావస్తోంది తను యిలా మురళితో కలిసి జీవితాన్ని పంచుకొని. పెళ్ళి అంటూ ప్రత్యేకమైన ఓ తంతు జరగలేదన్నమాట కాని, పెళ్ళి అయిన దంపతులకంటే అన్యోన్యం గానే ఉంటున్నారు తనూ అతనూను. కానయితే ఈమధ్యనే చిన్న చిన్న తగాదాలు వస్తున్నాయి తమ మధ్య అవి పెద్దవికావు. తనకు తెలుసు. కాని అవే పెద్దవయితే ? అప్పుడు ప్రమాదమే!... అప్పుడు మురళిని తనతో బంధించే బంధం ఏముంటుంది ? పొందిన సుఖం అంతా కలలోలాగ కనిపిస్తుంది... సౌఖ్యం అనేది నీటిమీద అలలాగ ఆ సమయంలో అందంగానే కనిపిస్తుంది. కాని తర్వాత ఏదీ అంటే ఏం మిగలదు, ఆ సౌఖ్యం తాలూకు అనుభూతి ఏదో కొద్దిగా తప్ప. మరి అలాంటప్పుడు తను అందించిన సుఖం మురళికి ఏం జ్ఞాపకం ఉంటుంది ? ఉంటే మాత్రం, ఇప్పటి ఈ అనుబంధం కృతజ్ఞతా ఉండొద్దూ? అందుకే కాబోలు ఉష చెప్పింది స్త్రీ పురుషుల మధ్య హృదయ సంబంధమైన ప్రేమా, శారీరక సంబంధమైన సౌఖ్యం మాత్రం ఉంటే సరిపోదు. వారిద్దర్నీ విడిపోకుండా కలిపి ఉంచడానికి మరేదో అదనమైన బంధం ఉండాలి. అది వివాహ బంధం కావచ్చు, సంతాన బంధం కావచ్చు. ఏవిటో — పిచ్చిగాని పెళ్ళి ఆపుతోందా దంపతులు విడిపోడాన్ని ?... పిల్లలున్న దాంపత్యం మాత్రం?... ముగ్గురు నలుగురు పిల్లలున్న దంపతులు, విడిపోయినవాళ్ళు ఎంతమంది లేరు !

మురళికీ తనకీ ఉన్న బంధం విడిపోతుందా ?

చలిలాంటి భయం వెన్నుపూసలోంచి ఒక్కమారు పెరిగెట్టడంతో లీల వణికిపోయింది. జరగదు — అలా ఒక్కనాటికి జరగదు తను శాశ్వతంగా మురళితో ఉండిపోతుంది... ఏ శక్తీ తననీ అతణ్ణీ విడదియ్యలేదు. ఇలా ఆలోచిస్తూన్న లీల కళ్ళు వెనక నుంచి వచ్చి మూసి, వేళ్ళతో లీల నెత్తి మీద మృదువుగా మొట్టి, "ఏ వేలుతో మొట్టానో చెప్పాకో" అన్నాడు మురళి. ముసి ముసి నవ్వులు నవ్వుతూ లీల ఒక వేలు చూపించింది.


"తప్పు" అన్నాడు మురళి.

లీల ఇంకో వేలు చూపించింది.

"ఉహుఁ! నన్ను గురించి కూడా ఎప్పుడూ ఇలా తప్పు అంచనాయే వేస్తూ ఉంటావు" అని మురళి నవ్వితే, లీల ఉలిక్కిపడింది. వెంటనే సర్దుకుని "ఆ... అది సరేకాని... నేనొక ప్రశ్న అడుగుతాను... సూటిగా సమాధానం చెప్పు... నువ్వు ఇన్ని బొమ్మలు వేస్తున్నావు కాని ఎప్పుడేనా ఒక చిన్న పాపాయి బొమ్మ వేశావా ?" అని అడిగింది.

"లేదు... వెయ్యాలంటే ఎంత ? ఒక్క గంట టైమియ్యి, పండంటి పాపాయి చిత్రం వేసి నీ చేతిలో పెడతా."

"గొప్ప పని చేస్తావు... లేవకు... ఇలా పక్కని



వచ్చి కూచో... నీ చెవిలో ఒక మంచి మాట చెప్తాను."

"ఏవిటీ?" అంటూ చెవి ఆమె నోటి దగ్గరికి చేర్చాడు మురళి. నెమ్మదిగా అతని చెవిలో "నేను బాబు బొమ్మ గీశాను." అని చెప్పింది రహస్యంగా...

మురళి సంతోషంతో "ఏది?... ఎక్కడ?" అంటూ చుట్టూ కలయజూశాడు.

"అది నీ చేతికి అందించడానికి మరికొన్ని నెలలు పడుతుంది."

"అది సర్లే ... ఇంతకీ ఆ బాబు బొమ్మ ఎక్కడ దాచావు?"

లీల సిగ్గు బరువుతో కళ్ళు దించుకొని "నా హృదయంలో ... నీ రూపానికి ప్రతిబింబంగా" అంది.

మురళి వెంటనే పట్టలేని సంతోషంతో 'ఆ!' అని అరిచి ఒక్క గంతువేసి "అమ్మ దొంగా! ... చెప్పావేకాదు! ... నిజంగా? ... నిజంగా?..." అంటూ లీలని ముద్దుల వర్షంతో ముంచెత్తేశాడు. లీల పులకించిపోతూ "అబ్బ! వుండు మురళీ! ఏవిటది ... నన్ను కొంచెం ఊపిరి తీసుకోనీ..." అని అతని కౌగిలిలోంచి విడిపించుకోబోయింది. ఆమె చుట్టూ వేసిన వలపు సంకెలని మరింత బిగిస్తూ "ఇంత మంచి మాట చెప్పినందుకు నీకు యేదైనా యివ్వాలి .. యేది కావాలో కోరుకో. ఊ ... కోరుకో" అన్నాడు మురళి.

లీల యేం మాట్లాడకుండా ఆలోచిస్తూ వుండిపోయింది.

"ఏం కోరికవుందో చెప్పు ... చెప్పు లీలా!"

లీల మురిసిపోతూ "మరి...మరి..." అంది.

"సందేహిస్తావెందుకూ? ... చెప్పెయ్యి..."

"నాకూ ... నాకు మా నాన్నగారిని చూడాలని వుంది."

"ఓష్ .. అంతేనా? ... అమాత్రం చిన్న కోరికకి యింత సందేహం ఎందుకూ? ... పైగా ఆయన నిన్నూ, నువ్వు ఆయన్ని చూచికూడా నాలుగైదేళ్ళు కావస్తోంది ..వెళ్ళు, తప్పకుండా వెళ్ళు."

"నువ్వుకూడా రావాలి నాతో."

"నేనా?"

"ఆ... ఇద్దరం సరదాగా వెళదాం."

మురళి ఆలోచనలో పడ్డాడు. నిజానికి లీలకీ తనకీ పెళ్ళి కాలేదు. చట్టరీత్యా ఆమెకి తను భర్త కాడు. మనస్సులు ముఖ్యం కాని, పెళ్ళేమిటి? తంతేమిటి, చట్టం ఏమిటి, అని తనూ లీలా అనుకోవచ్చు. కాని తక్కినవాళ్ళు అనుకోవద్దూ? ఇప్పుడు తను లీలతో ఢిల్లీ వెళితే వాళ్ళ నాన్న 'వెళ్ళు అవతలకి, ఎవరు నువ్వు' అంటే? లీల భర్తని అని తను చెప్తే సరిపోతుందా? లీల అంటే కుదురుతుందా? అందుకు సాక్ష్యం ఏదీ? అల్లుడు హోదాలో వెళ్ళే అవకాశం ఏదీ తనకి? కూతుర్ని మోసం చేసిన ఒక దుర్మార్గుడిగా తనని ఆయన చూస్తే? పోనీ అలా చూడడే అనుకుందాం. మర్యాదగానే ఆహ్వానిస్తాడని అనుకుంటే మాత్రం, తను వెళ్ళి ఆయనకి కనిపించడం దేనికి? తనూ లీలా దాంపత్య జీవితాన్ని గడుపుతున్నట్లు ఆయనకి తెలియదా? ఒక్కమాటేనా వచ్చి చూసి వెళ్ళాడా ఈ మగాడు నాలుగేళ్ళలోనూ? చూడడానికి తను వెళ్ళాలా?... ఊహుఁ!... తను వెళ్ళడు...

"ఏం మురళీ మాట్లాడవేం?... నాతో రావా?"

"వద్దు లీలా... ఇప్పుడు నన్ను రమ్మనకు... ఒక్కత్తెవీ వెళ్ళు... లేకపోతే నువ్వూ వెళ్ళడం మానెయ్యి."

"అదేం కుదరదు... నేనూ వెళ్తాను... నిన్నూ తీసికెళ్తాను."

"అల్లుడిని చూడడానికి ఆయన రాలేదు కాని, ఆయన్ని చూడడానికి నేను బయలుదేరాలా?

"ఈ రోజుల్లోకూడా ఆ పట్టింపు లేవిటి మురళీ! ఇరవయ్యో శతాబ్దంలో కూడా ఆ పాత కాలపు అలకలూ, అల్లుడి బెట్టుసరులూనా? నిజానికి నాన్నగారికిలాంటి పట్టింపులు లేవు. ఆయనే వచ్చి ఉందురు. కాని ఆ స్నేహితులూ, క్లబ్బులూ, ఆ సౌకర్యాలూ వదలలేక ఇంకెక్కడా కుదరవని రారు. అంతే... ఆయనెంత మంచివారో నీకేం తెలుసు? నేనంటే ప్రాణం."

"ఆ... తెలుస్తూనే ఉంది... నాలుగేళ్ళయినా కూతుర్ని చూడడానికి రాలేదు."

"మురళీ!... నువ్వు నాతో వస్తే రా — లేకపోతే మానెయ్యి — అంతేకాని నాన్నగారి గురించి నీ ఇష్టం వచ్చినట్లు నువ్వేం మాట్లాడకు... ఇన్నేళ్ళనుంచీ మన ఇద్దర్నీ ఆదుకున్నది ఆయన డబ్బే — ఆ సంగతి మరిచిపోకు."

"ఓహో!... అయితే కుక్కలా కృతజ్ఞతగా పడి ఉంటాలంటావు..."

"ఎందుకు అంత మాట అంటావు?"

"డబ్బు ఉన్నవాళ్ళు ఎప్పుడో ఒకప్పుడిలా డబ్బు తాలూకు గర్వం చూపిస్తారని నాకు తెలుసు... అందుకే నా కాళ్ళమీద నేను నిలబడాలనే ఉద్యోగంలో జేరింది. తెలిసిందా."

"అహా... ఇవాళ నీకు ఉద్యోగం వచ్చి ఒకరి అవసరం లేదు కనుక ఈ మాటలన్న మాట! నీ గురించి కూడా నేను అలాగే అనుకోవాలిగా మరి!..."

"నీ ఇష్టం నువ్వు ఎలా అనుకున్నాసరే..."

"సరే... ఈ డబ్బూ, డబ్బు తాలూకు గర్వం... ఈ విషయం మీద మనకి తగాదా ఎందుకు గాని... ఇంతకీ నువ్వు నాతో వస్తావా రావా?... నాతో కలిసి సరదాగా ప్రయాణం చెయ్యాలని లేదా?"

"ఎన్నిసార్లు చెయ్యలేదు! ఢిల్లీ రానన్నాను అంతే."

"అయితే నీ పట్టుదలే నీది అన్నమాట... సరే... నేను వెళుతున్నాను..."

"అయినా కాని లీలా — అంటే కోపం వస్తుంది... అసలు ఆగ్రహం వచ్చినా అనుగ్రహం వచ్చినా పట్టలేం. నీతో వచ్చిన చిక్కు ఇదే."

"ఇంక ఈ చిక్కు నీకేం ఉండదులే రేపటి నుంచి. ఇవాళే బయలుదేరుతున్నాను."

"ఇవాళా?... ఇలా సడన్‌గా బయలుదేరితే రిజర్వేషను దొరకొద్దూ?"

"ఆ!... అదేం ఉంది!... స్లీపర్ కోచ్ కండక్టరికి ఇంకో నాలుగు రూపాయలు పడేస్తే సరి..."

"నాలుగు కాదు నలభై ఇస్తామన్నా ఒక్కొక్కప్పుడు దొరకదు... ఇన్ని వందల మైళ్ళు రిజర్వేషన్ లేకుండా ప్రయాణం చెయ్యడం..."

"అబ్బో ప్రేమ!"

"అయినా ఇలా ఘర్షణ పడి ఇవాళే బయలుదేరి వెళ్ళడం నాకేం బాగోలేదు" అన్నాడు మురళి, లీల మీద మనస్సులో ఉన్న ఆప్యాయతని మాటల్లో పొందుపరుస్తూ...

"నాకు తెలుసు నీ ప్రయత్నం... రిజర్వేషను అనీ, ఇదనీ అదనీ కబుర్లు చెప్పి, ఈ రోజు ప్రయాణం మానిపించాలని చూస్తున్నావు... అంత ప్రేమ ఉంటే నాతో రాకూడదూ."

"పోనీ నీకు నామీద ప్రేమ ఎక్కువకదా! ఇవాళ్టికి ఉండిపోకూడదూ?"

తన మాటనే తనకి తిప్పి అందించేసరికి లీలకి చిరాకేసింది... గబగబా వెళ్ళి సూట్‌కేస్ సర్దుకుని బయలుదేరింది. "అయితే నీ పట్టుదలే నీది, అన్నమాట!... సరే వెళ్ళు... ఇదిగో డబ్బు... నీకు ఎంత కావాలో తీసుకో" అంటూ పర్సు పెట్టెమీద పెట్టాడు మురళి.

"నాకేం అక్కర్లేదు... ఈ మాత్రం డబ్బు నా దగ్గరా ఉంది... ఇవాళ ఎలా అయితేనేం నీ సంపాదన వచ్చింది కదా అని గొప్పగా డబ్బులు ఇయ్యనక్కర్లేదు..."

లీల అంటూన్న మాటలు మురళికి చెళ్ళు చెళ్ళున తగులుతున్నాయి. విసుగేసి కోపం వస్తోంది. అయినా తనని తాను సంబాళించుకొంటున్నాడు.

గార్డు జండా ఊపి, రైలు, కూత వేసి బయలుదేరబోతున్నప్పుడు మురళి ఆప్యాయంగా నవ్వి చెయ్యి ఊపుతూ "మళ్ళీ ఎప్పుడు తిరిగి రాణీగారి రాక?" అన్నాడు. లీల ముఖం అటు తిప్పుకుంది. ఆమె కళ్ళల్లో ఊరుతూన్న నీళ్ళు చూసి "పిచ్చి లీల!... నన్ను వదిలి ఉండగలదా? నాలుగు రోజుల్లో తిరిగి రాదూ?" అనుకున్నాడు మురళి. ఇంటికి తిరుగుముఖం పట్టినప్పుడు గుండె బరువుగా ఉన్నట్లూ, అడుగు భారంగా పడుతున్నట్లూ అనిపించింది మురళికి —

16

మెడిసన్ ఫస్టియర్‌లో చేరిన నాటి ఉషకీ, ఫైనలియర్ చదువుతూన్న ఉషకీ అసలు పోలికే లేదు. అప్పుడు అందంగా అలంకరించుకోడానికే భయం... ఎవరేనా పలకరిస్తే జవాబు చెప్పడానికి జంకు... ఒంటరిగా వెళుతున్నప్పుడు ఎవరేనా బోయ్ స్టూడెంట్ ఎదురైతే వణుకు... ఆఖరికి తలుపు వేసుకుని ఒక్కత్తే హాస్టల్ రూమ్‌లో పడుకోడానికి భీతి.. ప్రతి చిన్న గాలికీ చలించిపోయే రావి ఆకులా ప్రతి చిన్న సంఘటనకీ వణికిపోతూ ఉండేది ఎవరితో కాస్త మాట్లాడవలసి వచ్చినా, కనురెప్పలు కదిలిపోతూ వళ్ళంతా చెమటల్లు పట్టేసి, నానా

హైరానా పడిపోయేది. దానికితోడు అర్థంలేని పల్లెటూరి ఆలోచనలూ, భయాలూను...ఆ రోజుల్లో వయస్సు కూడా ఉషకి స్థిమితం లేకుండా చేసేది... హాయిగా ప్రభాకరాన్ని పెళ్లి చేసుకుని సంసార సుఖాల్లో తేలుతూ ఉండకుండా, ఈ చదువెక్కడ వచ్చిందిరా భగవంతుడా అని తనలో తను కుమిలి కుమిలి బాధపడేది... లెక్క చూసుకుంటే మొదటి రెండేళ్ళలోనూ నిద్ర పట్టకుండా జాగరణ చేసిన రాత్రులు ఒకటి రెండు వందలుంటాయి.

అలాంటిది, క్రమేపి మెడికల్ కాలేజీ వాతావరణం వంటబట్టి, మగపిల్లల మనస్తత్వాలు అర్థం అయి, లెక్చెరర్లూ ప్రొఫెసర్లూ పరిచయం అయేసరికి మొదట్లో ఉన్న భయం, పిరికితనం, భీతీ అన్నీ పోయి, ధైర్యం, స్థిమితం ఆత్మ విశ్వాసం ఏర్పడ్డాయి. దానికితోడు ప్రభాకరం దగ్గర్నుంచి ఆశించిన అనురాగం అందకపోయేసరికి, ఆమె పౌరుషం దెబ్బతిని, అతనిపట్ల పెంచుకున్న మమకారం కాస్తా, పట్టుదలకిందా నిర్లక్ష్యంకిందా మారి ఒక రకమైన మొండితనం ఆమెలో చోటు చేసుకుంది. మనస్సుని తన అధీనంలోకి తెచ్చుకుని ప్రభాకరం గురించి ఆలోచించడం మానేసి ఆ ఆలోచనల నన్నింటినీ చదువుమీదకి మళ్ళించడంతో, ఇటు క్లాసులో మంచి మార్కులూ, అటు తోటి విద్యార్థులలోనూ అధ్యాపకులలోనూ గౌరవం పెరిగి, ఒక రకంగా ఆమె గంభీరమైన వ్యక్తిత్వాన్ని పెంచుకోడానికి ఉపకరించింది.

ఆ రోజుల్లో ఆమె ఏ చిన్న అలలకైనా కదిలిపోయే పూలరేకు.

ఇవాళ ఎటువంటి పెనుతుఫానులనైనా ఎదిరించి నిలిచే యుద్ధ నౌక.

అప్పుడామె జీవితం, లోతులెరుగక దూకుతూ పరిగెట్టే సెలయేరు

గాజు మేడ

ఇప్పుడు నిండుగా గంభీరంగా కదులుతూన్న మహానది –


అందుకే అప్పుడు జరిగిన సంఘటనలన్నీ, ఇప్పుడామెకి నవ్వులాటగా తమాషాగా కనిపిస్తున్నాయి. లేకపోతే ఏమిటి ?

తను కొత్తగా మెడిసన్‌లో జేరిన రోజుల్లో, ఓ రోజున క్లాసుకి లేటుగా వెళ్లింది. పాఠం చెప్పేసి లెక్చెరర్ వెళ్లిపోయాక ఓ ఆకతాయి కుర్రాడు "అందమైన అమ్మాయిలు లేటుగా వచ్చినా అందమే!" అంటూ తనకేసి చూస్తూ ఒక జోక్ విసిరాడు. కోపంతో తన ముఖం ఎర్రగా మారిపోయింది. పక్కనున్న తోటి విద్యార్థినులు "ఎందుకోయ్ అలా బుంగమూతి పెడతావ్! రవి ఏమన్నాడని ? అందమైన అమ్మాయివి అన్నాడు. అంతేగా ? నిన్ను అన్నాడు కాని మమ్మల్నెవర్నేనా అన్నాడా ? వచ్చిన అభినందనని చిరునవ్వుతో తీసుకోక చిర్రుబుర్రు లెందుకూ ?" అన్నారు. కాని తనకి కోపం ఆగక వెంటనే తనకి ప్రభాకరం పరిచయం చేసిన ప్రొఫెసర్ గురుమూర్తిగారికి రవి మీద రిపోర్టు చేసింది. ఆయన రవిని పిలిచి మందలించారు. కాని తనని చూసి మందహాసం చేసి "ఇంత చిన్న విషయానికి కంగారు పడితే ఎలాగమ్మా ?.. జీవితం, అందులో కాలేజీ జీవితం, సముద్రంలో, ఈతలాంటిది . ఈ సముద్రంలో నత్తలూ ఉంటాయి, చేపలూ ఉంటాయి... అప్పుడప్పుడు మొసళ్ళూ, తిమింగలాలూ కూడా తగులుతూ ఉంటాయి... అన్నింటినీ తప్పించుకుపోవడమే !... ఆ... ఆ... కొంచెం నీకీ వాతావరణం అంతా కొత్తగానూ భయంగానూ ఉండి, వంటరిగా ఏం తోచకపోతే, అప్పుడప్పుడు మా యింటికి రా... మా అమ్మాయి రాధని నీకు పరిచయం చేస్తాను... అది తెలుగు ఎమ్మే చదువుతోంది. రెండు రోజులు దాని స్నేహం చేశావంటే నీ భయాన్ని ఎక్కడిదక్కడ పోగొట్టేస్తుంది" అన్నారు... నిజమే... అప్పుడుకనక అలా రవి మీద రిపోర్టిచ్చింది కాని... ఇప్పుడిస్తుందా ?... "థేంక్యూ మిస్టర్ రవీ – థేంక్యూ ఫర్ యువర్ కాంప్లిమెంట్" అనదూ ?... అసలిప్పుడు తనమీద జోక్ ఎవరు విసరగలరు ?


అసలు ఆ రోజుల్లో అన్నింటికీ అలాగే కంగారు పడేది. మొదటిసారి ప్రొఫెసర్ గురుమూర్తి గారింటికి వెళ్లినప్పుడు మాత్రం ? గురుమూర్తిగారి భార్య సీతమ్మగారు ఆప్యాయంగానే మాట్లాడింది... "నువ్వు భద్రయ్యగారి అమ్మాయివా ? మేం చిన్నప్పుడు అక్కడ ఉండేవాళ్ళం... మా పుట్టిల్లు ఆ ఊరే... మా భూములక్కడ ఉండేవి... మీ నాన్నగారే వాటిని చూస్తూ మాకు శిస్తు పంపిస్తూ ఉండేవారు... తర్వాత ఫారిన్ వెళ్లాలని మా తమ్ముడు మాధవ్ పట్టుబడితే ఈ మధ్యనే అయిదారేళ్ళ క్రితం ఆ భూములన్నీ అమ్మేశాం... ఆ ఊరు వదిలి వచ్చేసి మేం పాతికేళ్ళయిందనుకో... అప్పటికి నువ్వు పుట్టి ఉండవు.. మీ అన్నయ్య కాబోలు రెండేళ్ళ కుర్రాడుండేవాడు మా మాధవ్ ఈడువాడు. మీ అమ్మా నాన్నా బాగున్నారా ?" అంటూ కొంత సాన్నిహిత్యాన్నీ చనువునీ కూడా కలిగించింది... ఆవిడ ఎంత కలుపుగోరుతనంగా, ఆప్యాయంగా మాట్లాడినా వాళ్ళ అమ్మాయి రాధ మాత్రం కాస్త బెట్టుగా గర్వంగానే పలకరించింది. గర్వంగా జడలో ఉన్న గులాబీని చేత్తో అలవోకగా సర్దుకుంటూ, "అహా...అలాగా... మరే..." అంటూ పొడిముక్కలు అంటూన్నప్పుడు, ఈ పిల్లేమిటి ఈ గర్వం ఏమిటి, వీళ్ళింటికి ఎందుకొచ్చానా అని ఒక్క క్షణం బాధ పడింది తను. "అప్పుడప్పుడు కనిపిస్తూండండి" అని రాధ అన్నప్పుడు పౌరుషంతో తను ఎంత ఊగిపోయింది ? "ఎందుకు కనిపించాలి ? నేను నీకేం నౌఖర్నా ?" అనాలని కూడా అనిపించింది... తనని రాధ అవమాన పరుస్తోందేమోనని భయం, అనుమానం... ఇప్పుడు ? రాధ కాదు రాధలాంటివాళ్ళు వందమంది ఉన్నా, జంకూ కొంకూ లేకుండా తెగేసి మాట్లాడుతుంది... అసలు ఆ మాటకి వస్తే అంతటి రాధా ఇప్పుడేమైంది ? తనకి భక్తురాలుగా, ఒక రకమైన శిష్యురాలుగా తయారవలేదూ ? నవలలు, అందులో తెలుగు నవలలు చదవనివాళ్ళ బ్రతుకూ ఒక బ్రతుకేనా అని ఆ రోజుల్లో తనతో ఉద్రేకంతో వాదించిన రాధ, ఇప్పుడేమంటోంది, "నిజమే ఉషా! చూడగా చూడగా నూటికి ఏ ఒకటో అరో బాగుంటున్నాయి. నువ్వు చెప్పినట్లు అచ్చు అయినవన్నీ చదివెయ్యడం సాహిత్యానికి అపచారమే" అని అనడంలేదూ ?......

నిజమే... మెదడు పూర్తిగా వికసించక, అదుపు తప్పుతూన్న హృదయాన్ని లొంగదీసుకోవడం ఎలాగో తెలియక, వయస్సు ఏక బాధ పెడుతూంటే, ప్రభాకరం తనని దగ్గరగా తీసుకోలేదనీ, పెళ్ళిని

(47 వ పేజీ చూడండి)



"అమ్మా-నాన్న"లో ఒక దృశ్యం



పీడకల

'గంటి'

"అదఃగో వాడూ కోశాడః పువ్వుల్ని వాడినీ పట్టుకోండి!" అని అరిచాడు రంగారావు.

భయంతో, ఆవేశంతో వూగిపోతున్న అతను తప్పించుకోవటానికి ప్రయత్నిస్తున్నాడనుకుని ఎటెండరు, రంగారావు జబ్బని మరింత గట్టిగా పట్టుకున్నాడు. అంతదాకా నిర్ఘాంతపోయి చూస్తున్న సోమసుందరం హటాత్తుగా తనూ పట్టుబడవచ్చునని గ్రహించి పరిగెత్తుకుని వెళ్లిపోయాడు. చివరికి ఆయాసం పట్టలేక ఒకచోట ఆగిపోయాడు. బెదురుతూ వెనక్కితిరిగి చూశాడు. ఎవరూ తనని తరుముతున్నట్లు కనిపించలేదు. తను పరిగెత్తుతున్నాడని పట్టించుకున్నవాళ్ళే ఆ వీధిలో ఎక్కువమంది లేరనిపించింది సోమసుందరానికి. రోడ్డుమీద వేరుశనక్కాయలు అమ్ముకుంటున్న ఒక ముసలతను మాత్రం తనవయిపు కొన్ని క్షణాలపాటు చూశాడు. ఆ తరువాత అతనూ తన వ్యాపారంలో మునిగిపోయాడు.

సోమసుందరానికి ఇంటి కెళ్లబుద్ధికాలేదు. రంగారావు మాట విని ఎవరయినా తనకోసం యింటి దగ్గర కాచుకుని వుంటారేమో అని భయం వేసింది అతనికి కాని, తను మళ్లీ ప్లేగ్రవుండుకి వెళ్లటం వీలుకాదు. స్నేహితుల యిళ్ళకి వెడదామా అంటే ఎవరింటికి వెళ్ళాలో తోచలేదు. అసలు ఎందరు ఇప్పటికే తిరిగి వెడతారు? యింకా చాలామంది స్కూల్లోనే ఆడుకుంటూ వుంటారు. రంగారావు కోస్తున్నాడని తనూ పసుపుపచ్చటి పువ్వుని కోద్దామని చెయ్యి జాపాడు, అంతే. ఇంతలోనే ఎటెండరు రంగారావుని పట్టుకోవడం, వాడు అరవటం, తను భయపడి కొంతసేపు అలాగే నిల్చుని వుండిపోవటం, చివరికి పారిపోవటం యివన్నీ వరసగా జరిగిపోయాయి. తను పరిగెత్తడం ఎందరో చూశారు. తను పువ్వులు కొయ్యలేదంటే ఎవరు నమ్ముతారు? రేపు హెడ్మాస్టరు గదిలోకి రమ్మని కబురు తప్పదు. ఇంతకిముందు ఒకసారి చింతకాయలు కొట్టినందుకు ఒక అబ్బాయిని అలాగే పిలిచారు. అరచేతి మీద వాతలతో తిరిగివచ్చాడు ఆ అబ్బాయి. కష్టంమీద కన్నీళ్ళు ఆపుకుంటూ క్లాసు జరుగుతున్నంతసేపూ తల వంచుకుని వుండిపోయాడు. తనకీ 'కేనింగ్' భాయమా? భయం, ఏడుపూ ముంచుకువచ్చాయి సోమసుందరానికి

"ఏమిట్రా ఒక్కడివీ యిక్కడున్నావు, రా యింటికి పోదాము!" సోమసుందరం ఉలిక్కిపడి తనతో మాట్లాడిన మనిషి వయిపు చూశాడు. రవి తన మేనమామ కాలేజిలో చదువుతున్నాడు.

"రోడ్లవెంబడి తిరగొద్దు!"అంటూఉంటాడు ఎప్పడూ. సోమసుందరం మాట్లాడకుండా అతనితో బాటే నడవటం మొదలుపెట్టాడు. "ఏరా! అలా చెమటలు కక్కుతున్నావు? అసలా ఏడుపు మొహం ఏమిటి?" అని రవి నవ్వుతూ అడిగాడు.

సోమసుందరానికి జరిగిందంతా చెప్పెయ్యాలనిపించింది కాని ఎందుకో సమాధానం ఇవ్వలేకపోయాడు. చొక్కాతో మొహం తుడుచుకుని చేతిలోని సంచీని అవతల చేతిలోకి మార్చాడు. రవి తన ప్రశ్నని ఇంకొకసారి వేసేలోపలే వాళ్ల పక్కనుంచి ఒక లారీ పెద్ద చప్పుడు చేసుకుంటూ వెళ్లిపోయింది. దాని హారన్ మోతకి ఇద్దరి చెవులూ చిల్లు పడినట్లయింది. రవికి లారీవాడిమీద కోపం వచ్చి వాడిని తిట్టడంలో మునిగిపోయాడు.

* * *

హాలు అంతా నిశ్శబ్దంగా ఉంది. హెడ్మాస్టరుగారు తన ముందుబల్లమీద మోచేతులు పెట్టి శూన్యంలోకి చూస్తూ కూర్చుని ఉన్నారు. ఆయన ముందు ఒక తెల్లటి పేము బెత్తం ఉంది. ఆయనతోబాటు వేదికమీద రంగారావు, సోమసుందరంల క్లాసుటీచరుగారుకూడా కూర్చుని ఉన్నారు. ఆయన ఏదో కాగితాన్ని ఏకాగ్రతతో చదువుతున్నారు. రంగారావు, సోమసుందరం వేదికకింద ఒక పక్కగా నుంచున్నారు. ఎటెండరు సంబంధం వాళ్ల వెనక చేతులు కట్టుకుని నుంచున్నాడు.

"రంగారావు!" అని పిలిచారు టీచరుగారు. వెంటనే సంబంధం రంగారావుని రెక్కపట్టుకుని వేదిక మీదకి తీసుకువెళ్లాడు.

"పువ్వులు కొయ్యకూడదని బోర్డు ఉన్నా కోశావు కాబట్టి నీకు డజన్ బెత్తందెబ్బలు వెయ్యాలి" అన్నారు టీచరుగారు. రంగారావు మాట్లాడకుండా ఏడుస్తూ నుంచున్నాడు.

"సోమసుందరం!" అని మళ్లీ పిలిచారు టీచరుగారు.

"నేను పువ్వులు కొయ్యలేదు!" అని అరిచాడు సోమసుందరం. ఈ అరుపుకి హెడ్మాస్టరుగారు ఉలిక్కిపడి అతనివయిపు తిరిగారు.

"సైలెన్స్!" అని గర్జించారు క్లాసు టీచరుగారు. కాని, సోమసుందరం అరుపుతో క్లాసులోని పిల్లలంతా ఒక్కసారి మాట్లాడటం మొదలుపెట్టారు. త్వరలోనే ఈలలు, అరుపులు కూడా మొదలయ్యాయి. "సైలెన్స్!" అని మళ్లీ ఉరుముతూ టీచరుగారు బెత్తంతో బల్లమీద కొట్టారు. సంబంధం సోమసుందరం భుజం మీదచెయ్యి వేశాడు సోమసుందరం దానిని విదిలించుకుని బయటికిపరిగెత్తుకుపోయాడు

"పట్టుకోండి! పట్టుకోండి సుందరాన్ని..." అన్న అరపులు వినిపిస్తున్నాయి. సోమసుందరం వాటిని పట్టించుకోకుండా ముందుకి పరిగెత్తుతూ వెళ్ళిపోయాడు.

ఇప్పుడు తను తమ స్కూలు ప్లేగ్రవుండులో వున్నాడు. అది కొంచెం పెద్ద



గ్రవుండుకిందే లెక్క. సోమసుందరానికి దాని అవతలవయిపు రోడ్డు కొన్ని మైళ్ల దూరంలో వున్నట్లనిపించింది. అయినా బిగబట్టుకుని దూరంగా కనిపించే గేటు వయిపు పరిగెత్తుతున్నాడు. తన వెనక కేకలు, ఏవో పిలుపులు లీలగా వినిపిస్తున్నాయి. ఒక్క క్షణం తల వెనక్కి తిప్పి చూడాలనిపించింది.కాని భయంవేసి ఆ పని చెయ్యలేకపోయాడు. హెడ్మాస్టరు, టీచరు వయస్సు మళ్ళినవాళ్ళు, తనతో సమానంగా పరిగెత్తలేరు. సంబంధం మాత్రం బాగా పరిగెత్తగలడు. తలుచుకుంటే తనని ఒక్క క్షణంలో పట్టుకో గలడు. తన వెనక వస్తున్నాడో లేడో తెలీదు. సోమసుందరానికి ఆయాసం ఎక్కువ అవుతోంది. కాళ్ళు నీరసించి పోతున్నాయి. గేటు ఇంకా దూరంగా ఉంది. దానిని ఎప్పటికి చేరుకోగలడు తను ? సంబంధం చెయ్యి తన భుజంమీద ఇంకా పడదేమిటి? ఇంకా ఎంతసేపు పరిగెత్తితే తను గేటు చేరుకుంటాడు ? సోమసుందరం అటు వయిపు నిరాశగా చూశాడు. అతని నిరాశ కాస్తా భయంగా మారింది. గేటు దగ్గిర ఎర్ర టోపీ ఒకటి కనిపించింది. అంత



దూరంలోనూ అతనికి ఆ పోలీసు కానిస్టేబులు నల్లటి బూట్లు స్పష్టంగా కనిపించాయి. సోమసుందరం భయం ఎక్కువ అయింది. ఇక ఆపుకోలేక వెనక్కి తిరిగి చూశాడు. ఎందరో తనని తరుముతున్నారు. వాళ్లలో సంబంధం మాత్రం కనిపించలేదు. అందరూ పిల్లలే. చేతులు ఊపుతూ అరుస్తున్నారు. ''పోలీస్! పట్టుకోండి! పువ్వులు కోసుకుని తప్పించుకుపోతున్నాడు వాడు!'' అని. ఇంకెంతోసేపు ఉండదు, తను పట్టుబడిపోతాడు. తనని పోలీసుకి అప్పచెబుతారు... పోలీసు ఈల ఊదుతున్నాడు...

సోమసుందరానికి హటాత్తుగా మెలుకువ వచ్చింది. దూరంగా ఎక్కడో వెళ్లిపోతున్న లారీ హారన్ శబ్దం సన్నగిల్లిపోతూ వినిపించింది. ఈ పీడ కల రావటం ఇది మొదటిసారి కాదు. తను ఆ రోజు తన మామయ్య రవితో ఇంటికి వెళ్లిన రాత్రే వచ్చింది. మెలుకువ రాగానే కలే కదా అన్న తెరిపితో బాటు మరునాడు స్కూలులో జరగబోయేదానిని గురించి తలుచుకుని భయం కూడా వేసింది. కాని సోమసుందరానికి అనుకోకుండా స్కూలు బెడద తప్పింది. అప్పటిలో సమ్మెలు, బహిష్కరణలు ఉధృతంగా ఉన్నాయి. మరునాడు అతను స్కూలు దగ్గిరకి వెళ్లేటప్పటికీ పెద్ద గుంపులు, పోలీసులు, ''వెళ్లిపో''మ్మన్న నినాదాలు పరిస్థితినే మార్చి వేశాయి...

* * *

''పేరు...?''

''వయస్సు ?''

''ప్రస్తుతం ఉద్యోగం ?''

ప్రశ్నలకి సమాధానాలు రాసుకుంటున్నాడు పోలీసు అధికారి. సోమసుందరం తనకి వీలయినంత నిదానంగా జవాబులు చెపుతున్నాడు. కాని కంగారులో గుండె దడ దడ కొట్టుకుంటోంది. అంతదాకా తల వంచి రాసుకుంటున్న పోలీసు అధికారి తల ఎత్తి సోమసుందరం వంక చూశాడు. నల్లటి కళ్లజోడు అద్దం వెనుక అతని మొహంలో ఎటువంటి కవళికా తెలియటంలేదు. తను రాస్తున్న పుస్తకాన్ని తిప్పి సోమసుందరం దగ్గిరగా తోసి, ''సంతకం పెట్టండి!'' అన్నాడు.

''అసలు నేను చేసిన నేర మేమిటో చెప్పరా?'' ఆదుర్దాతో సోమసుందరం గొంతుక కొంచెం కీచుగా మారిపోయింది.

పోలీసు అధికారి నవ్వాడు. అతని మీసంకింది నవ్వు తెల్లగా మెరిసింది. అలాగ నవ్వుతూనే అతను లేచి నుంచున్నాడు. సోమసుందరం భయంతో వెనక్కి వాలిపోయాడు. పోలీసు అధికారి బల్లమీద రెండుచేతులూ ఆన్చి సోమసుందరంమీదికి వంగాడు. ఇస్త్రీ చేసిన అతని ఖాకీచొక్కామీద చెమట మరకల తడి స్పష్టంగా కనిపిస్తోంది సోమసుందరానికి. అతను లేచి పారిపోదామనుకున్నాడు. కాని కాళ్ళు పని చెయ్యటంలేదు. వళ్లంతా ఒక్కసారి బరువెక్కి పోయింది. ''నా నేరమేమిటో చెప్ప!'' అని అరుద్దామనుకున్నాడు కాని మాట పెగలటంలేదు. తను ఇంకా వెనక్కి వంగితే కుర్చీతోబాటు వెనక్కి పడిపోతాడేమో — ఈ ఆలోచన రాగానే సోమసుంద

రానికి లీలగా ఏదో తోచింది. అదేమిటో స్పష్టంగా తనకే తెలియలేదు...

బయట ఎవరో కారు హారన్‌ని ఆపకుండా మోగిస్తున్నారు సోమసుందరానికి ఇంకా పూర్తిగా మెళుకువ రాకముందే తన కల చెదిరిపోయినట్లు తెలిసిపోయింది. కొంత ప్రయత్నంమీద కళ్లు తెరిచాడు. గది అంతా చీకటిగా ఉంది. తన వళ్లు చెమటతో తడిసిపోయి ఉంది. కొన్ని క్షణాలపాటు అలాగే ఉండిపోయి మెల్లిగా తలని ఒకవయిపుకి కొంచెం తిప్పి చూశాడు. కిటికీ బయట వెన్నెల తెల్లగా కనిపిస్తోంది ఆ వెన్నెలలోనుంచో ఎక్కడినుంచో కారు హారన్ మోత వినపడుతోంది. కారు హారన్ చెడిపోయి ఉండాలి. లేకపోతే అంతసేపు అలాగ కొట్టుకోదు అనుకున్నాడు సోమసుందరం.

కిటికీ దగ్గిరకి వెళ్లాలనుకుని లేచికూర్చున్నాడు. అదే క్షణం హారన్‌మోతఆగిపోయింది. సోమసుందరం కదలటంతో మంచం శబ్దం చేసింది.

''ఏమిటి నిద్దర పట్టటంలేదా?'' అన్నప్రశ్నకి గదిలో రెండో మంచం వయిపుకి తిరిగాడు. గాజుల చప్పుడు, తరువాత మసక చీకటిలో తెల్లగా కనిపించే కళ్లు. ''మంచినీళ్లు కావాలా?''

''వద్దు! ఊరికేనే లేచాను'' అంటూ సోమసుందరం. మంచం దిగి కిటికీ దగ్గిరికి వెళ్లాడు. వీధి దీపాలుకూడా వెలగటంలేదు చుట్టుపక్కల బిల్డింగుల కిటికీలన్నీ నీడలలో దాక్కుని ఉన్నాయి. రోడ్డుమీద ఆగి ఉన్న కొన్ని కారులు అస్పష్టంగా మెరుస్తున్నాయి. ఇందాకటి కారు ఏదోకాని నిశ్శబ్దంగా ఉంది.

గదిలోకి తిరిగి చూశాడు. ఇప్పటికి చీకటికి అలవాటుపడ్డ సోమసుందరానికి ఆమె మొహం బాగా కనిపించటంలేదు కాని కళ్ల మెరుపు మాత్రం తెలుస్తూనే ఉంది.

''అంతా కల...''అందామనుకున్నాడు. అనలేకపోయాడు.

*   *   *

జడ్జి తలమీద ఫాను వేగంగా, నిశ్శబ్దంగా తిరుగుతోంది. దాని గాలికి ఆయనజుట్టు కొద్దిగా, అప్పుడప్పుడు కదులుతోంది. ఆయన తన ముందు బల్లమీద ఉన్న కాగితంమీద ఏదో రాసుకుంటున్నాడు. ముక్కుమీది కళ్ళజోడు బాగా ముందుకి జారిపోయి ఉంది.

''ఇతన్ని నమ్మటానికి వీలులేదు ! సాక్ష్యం అంతా అతనికి విరుద్ధంగాఉంది! లేదని వాదిస్తాడు! తను నిర్దోషిని అంటాడు! అది సహజం! ఆ దొంగ మాటలని మనం పట్టించుకోకుండా తగిన శిక్ష విధించటమే...''

నల్ల గవును వేసుకుని చెప్పకుపోతున్న లాయరు మాటలు సోమసుందరం తలలోకే ఎక్కటంలేదు. అతని దృష్టి అంతా జడ్జిమీదనే ఉంది. జడ్జి ఏమనుకుంటున్నాడు? ఆ ఆరోపణలని నమ్ముతున్నాడా ? అవన్నీ అబద్ధాలని అతనికి తెలియదా? సోమసుందరాన్ని వేధిస్తున్న ఆందోళన ఒక్కసారి ఉప్పెనలాగ లేచిపోయింది. తను నుంచున్న బోను నుంచి దూకి పారిపోదామనుకున్నాడు. కాళ్లు కదలటంలేదు. తన చేతులు ఆన్చి నుంచున్న కొయ

''గోడ''ని బలంగా నొక్కిపట్టుకున్నాడు. ఆ వత్తిడికి తన వేళ్లమీద చర్మం తెల్లబడింది. వాటివంక చూస్తున్న అతనికి జడ్జి దృష్టి తనమీద పడిందనిపించింది తలఎత్తి చూశాడు జడ్జి తల ఇంకా ఒంచే ఉంది కానీ, కళ్లజోడు మీద నుంచి సోమసుందరాన్ని పరిశీలిస్తున్నాడు.

''అబద్ధాలు చెప్పేవారంటే నాకు అసహ్యం'' అన్నాడు జడ్జి హటాత్తుగా. ఈ మాటలు అతని నోటిలోనుంచి బయటపడటంతో లాయరు వాక్ప్రవాహం ఆగిపోయింది. అతనూ సోమసుందరం వయిపు తిరిగి అతన్ని తీక్షణంగా చూడటం మొదలుపెట్టాడు.

''రంగారావు ! ఎందుకిలా నామీద చెప్తావు ? నేనేం చెయ్యలేదన్న సంగతి నీకు తెలీదా ?'' అని అరుద్దామనుకున్నాడు సోమసుందరం అరవలేకపోయాడు.

''అతని మవునమే చెప్తోంది, అతని నేరం, చూడండి !'' లాయరు చెయ్యెత్తి సోమసుందరాన్ని చూపించాడు. అతని చేతిమీద సగం నల్లటి గవును మడత, నల్లటి సిల్కు కింద తెల్లగా కనిపించే అతని షర్టు చెయ్యి...

ఒక్కసారిగా ఎన్నో వాహనాల హారన్‌ల మోత, బ్రేకులు వెయ్యడం వలన టయరుల కీచు శబ్దాలు— సోమసుందరం ముందుకి పడిన కుదుపుకి మేలుకున్నాడు తను వెడుతున్న టాక్సీకి ముందు కారు సడన్‌గా బ్రేకు వేసినందుకు తన టాక్సీ డ్రయివరు తిట్టుకుంటున్నాడు. ఆ ముందు కారు, ఇంకొక కారు వాళ్లు ఇంకా కోపంగానే తమ హారన్‌లని వాయిస్తున్నారు.

ముందు ఎవరో ''ఈ స్కూటర్ వాళ్ల మూలానే ఆక్సిడంట్లన్నీ...'' అని అరుస్తున్నారు. సోమసుందరం టాక్సీ డ్రయివరు తల బయటపెట్టి తనూ ఏదో అరుస్తున్నాడు. బయట ఎండగా ఉండటంతో తనకి తెలియకుండానే నిద్ర పట్టింది టాక్సీ డ్రయివరు తలని లోపలికి తీసుకుని తనలో ఏదో అంటున్నాడు. సోమసుందరానికి అదేదీ తలకి ఎక్కటంలేదు.

*   *   *

''ఒకసారి నాతో రావాలి!'' కిటికీలోనుంచి చూస్తున్న సోమసుందరం తనతో ఈ మాటలు అన్న వ్యక్తి వయిపు చూశాడు. అతను బాగా గంజి పట్టిన తెల్ల బుష్‌కోటూ, ఖాదీ లాగూ వేసుకుని ఉన్నాడు. బొద్దింక రంగు బూట్లు నున్నగా మెరుస్తున్నాయి. తల జుట్టు కొంచెం నెరిసి ఉంది. మనిషి నిటారుగా కాళ్లు దగ్గిరగా ఉంచి నుంచుని ఉన్నాడు. చేతులుకూడా ఒంటికి నేరుగా వేళ్లాడుతూ ఉన్నాయి.

సోమసుందరం మళ్లీ కిటికీలోనుంచి బయటికి చూశాడు. సన్నగా వాన పడుతోంది. తమ ఇంటి కాంపవుండ్‌వాల్ అవతల కొన్ని గుడిసెల పయి భాగాలు కనిపిస్తున్నాయి. ఊరికి బయటగా ఉండటంచేత అది కొంత నిర్మానుష్యంగానే ఉంది. గేటు దగ్గిర కాపలా నుంచున్న అతను అప్పుడే టోపీ పెట్టుకుని రెయిన్ కోటు తొడుక్కుంటున్నాడు.

''రండి సార్!''

సోమసుందరం మాట్లాడకుండా లేచి అతని వెంట వెళ్లాడు. హాలులో కూర్చుని ఉన్న రంగారావుని చూసి సోమసుందరం ఆశ్చర్యపోయాడు. రంగారావు వేసుకున్న తెల్లటి ఇస్త్రీ బట్టలమీద అక్కడక్కడ వాన చినుకులు పడినట్లున్నాయి. అవి పడినచోట్ల ఎంతో లేత ఊదా మరకలు కనిపిస్తున్నాయి. రంగారావు పక్కనే ఇంకొక అతను కూర్చుని ఉన్నాడు. చేతిలో కాగితాల కట్ట ఏదో ఉంది.

''రా సుందరం, కూర్చో!'' రంగారావు తనకి ఇంకొక పక్కన ఖాళీగా ఉన్న చోటుని తడుతూ అన్నాడు.

''కాఫీ తెప్పించనా?'' అని ఆప్యాయంగా అడిగాడు రంగారావు. సోమసుందరం అడ్డంగా తల ఆడించాడు.

''ఇతనేనండీ, సోమసుందరం ! చిన్నప్పుడు మా ఇద్దరినీ స్కూలు ప్యూను పట్టుకోబోతే తెలివిగా తను మాత్రం తప్పించుకున్నాడు! బలే గడుసు

పీడ కల



సినిమా విశేషాలు

అద్దెకొచ్చిన అబ్బాయికి అంధురాలితో వివాహం

"లా" చదువుతున్న ఆనంద్ తనమిత్రుడు కె. వి. చలం రెకమెండేషన్‌తో సూర్యకాంతం ఇంట్లోవున్న ఓ గదిని అద్దెకు తీసుకున్నాడు.సూర్యకాంతానికి రాధిక అనే గ్రుడ్డి మేనకోడలుంది. గ్రుడ్డిదనే దయకూడా లేకుండా, గొడ్డుచాకిరి చేయిస్తుంది రాధికచే సూర్యకాంతం. మేనత్త పోరుకు అలవాటుపడ్డ రాధిక, అసహాయస్థితిలో వుంటుంది.

రాధిక పడుతున్న కష్టాలను కళ్లారా చూసిన ఆనంద్ ఆవిడపట్ల సానుభూతిని చూపిస్తూ వచ్చాడు సానుభూతి ప్రేమ అనే అనుభూతిగా మారి పెండ్లిదాకా వెళ్లింది. రాధిక గ్రుడ్డిదనే వూహ ఆనంద్‌కులేదు. రాలేదు కూడా. మనస్సుతో మనుషుల్ని చూచే రాధికంటే ఇష్టపడ్డాడు. ఆవిడ కష్టాలకొక ఆనకట్ట కట్టాలనుకున్నాడు. అందుకే తాళికట్టి, తనదానిగా చేసుకొన్నాడు. కొన్నాళ్లు ఆనందడోలల్లో తేలియాడారు దంపతులిద్దరూ. అమృతాన్ని చవిచూస్తున్న ఆ దంపతుల సంసారంలో అపశృతులు కలిపారు కొందరు స్వార్థపరులు. కలిసిన మనస్సులకు కలవరాన్ని కల్గించారు ఆ దుర్మార్గులు. తత్ఫలితం ఏమిటి ? ఎవరా స్వార్థపరులు, దుర్మార్గులు ? ఈ విషయం తెల్సుకోవాలంటే కిరణ్ ప్రొడక్షన్స్ వారి రంగులచిత్రం "బ్రతుకే ఒక పండుగ" చూడాల్సిందే.

పి. వి. రమణయ్య సమర్పణలో వై. కిష్టఫర్, పి. హనుమంతరావులు నిర్మించిన ఈ చిత్రానికి కె. వి. మహదేవన్ సంగీతబాణీలు పెద్ద ఎస్సెట్ అనే చెప్పాలి. సత్యానంద్ మాటలు, లక్ష్మణ్ గోరే ఛాయ, కె. గోపాలరావు కూర్పు, పి. వెంకటరావు కళను సమకూర్చిన ఈ చిత్రానికి పి. చంద్రశేఖర రెడ్డి దర్శకుడు

అల్లు రామలింగయ్య, చంద్రమోహన్, కె. వి. చలం, శ్రీధర్, సూర్యకాంతం, రమాప్రభ, నిర్మల, భవానీ, సత్యప్రియ, సుధ, లీలారమ, లక్ష్మీకుమార్ రెడ్డి, డా. సుబ్బారావ్, రవి, ఆచంటవెంకటరత్నం, జగ్గారావ్, నల్లం నరసింహారావు, జి. యస్. స్వామి, రాజు, నెల్లూరు సుబ్బారావ్, శ్రీరామ్, ప్రసాద్ ప్రధానపాత్రలను పోషించిన ఈ చిత్రం సెప్టెంబరులో విడుదలౌతుంది.

పోలీస్ ఆఫీసర్ పై హత్యానేరం

పోలీస్ ఆఫీసర్‌గా వుద్యోగం చేస్తున్న హీరో కృష్ణ (చిత్రంలో రవి) తన తండ్రి పిలుపుపై వూరెళ్తాడు. విషయ మేమిటో తెల్సుకున్నాడు.

తను సోదరిగా భావించిన రజినికి, తనకూ పెళ్లి నిశ్చయం చేస్తారు పెద్దలు.

అది అసంభవం అంటాడతను. తామిరువురే నచ్చచెప్పుకుందామని రవి, రజని వూరిబయట కల్సుకుంటారు. కానీ విధివశాత్తు బోటు ప్రయాణంలో మరణిస్తుంది రజని ఆ రోజు. కృష్ణ ఆవిడ్ని హత్య చేశాడనే నేరం అతనిపై ఆరోపింపబడుతుంది.

కానీ కృష్ణను ప్రేమించిన లాయర్ భారతి (చిత్రంలో ఇందిర) బెయిలుపై అతన్ని విడిపిస్తుంది. అనుకోని ప్రమాదాలకు గురి అయిన కృష్ణ, చివరకు తను నిర్దోషి అని నిరూపించుకుంటారా ? భారతిని తన భార్యగా స్వీకరించడాన్కి అంగీకరిస్తారా ? అనే సందేహాలకు సమాధానమే సీతారామాంజనేయ మూవీస్‌వారి "మనస్సాక్షి" చిత్రం.

అమరా రామసుబ్బారావు నిర్మిస్తున్న ఈ చిత్రంలో జగ్గయ్య, కాంతారావు, షావుకారు జానకి, పుష్పకుమారి, అనిత, గిరిబాబు, నాగేష్, మిక్కిలినేని, త్యాగరాజు, నూతన నటి ఉమ ముఖ్య పాత్రల్లో కన్పిస్తారు. పి. సాంబశివరావు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి రాఘవులు సంగీతాన్ని, గోపాలకృష్ణ కెమెరాను, వాసిరెడ్డి సీతాదేవి కథను, ఆదుర్తి నరసింహమూర్తి మాటలను, అంకిరెడ్డి కూర్పును నిర్వహిస్తున్నారు. భానూ పిక్చర్స్ ద్వారా విడుదల అయ్యే ఈ చిత్రానికి కొలిశెట్టి శివప్రసాద్ సహ నిర్మాత, కొలిశెట్టి సుబ్బారాయుడు నిర్వాహణ.

రాజాతో జయ నాటకం

కృష్ణంరాజు ఒక డాక్టర్. అతని మేనమామ కూతురు జయసుధ. కృష్ణంరాజును వలచింది ఆ వయ్యారి. కానీ అతనంత సులువుగా లొంగే ఘటం కాదు అందుకే ఓ నాటక మాడింది. తన తండ్రికి సుస్తీగా వుందని కబురంపింది. వెంటనే విమానంలా వాలాడు కృష్ణంరాజు. తీరా వచ్చిం తర్వాతగాని తెల్సుకోలేకపోయాడు సుస్తీ మేనమామకు కాదు, జయసుధకని. సుస్తీ ఎవరికైతేనేం తప్పుతుందా ? బాధ ఎక్కడ అని అడిగాడు జయసుధను. ఇక్కడ అంటూ గుండె చూపించింది. ముందు కాస్త సంకోచించినా, డాక్టర్‌గా తన విధిని నిర్వర్తించాలిగా. అందుకే ఆవిడ చూపెట్టిన దగ్గరే స్టెతస్కోపు పెట్టి పరీక్ష చేయబూనాడు రాజా.

కానీ అంతలో "అక్కడే – అక్కడే, అలా, అలా అంటుంటే ఎంత బాగుంది బావా" అంటూ మత్తుగా, నృత్యం చేస్తూ పాడసాగింది జయసుధ. ఇంతలో కట్ అన్నారు దర్శకుడు లెనిన్‌బాబు. ఈ శృంగార సన్నివేశం రవీంద్రా ఆర్ట్ పిక్చర్స్‌వారి "అమ్మా–నాన్న" చిత్రంలో కన్పిస్తుంది.

ప్రభ, రమాప్రభ, నిర్మల, బేబీరోహిణి, చంద్రమోహన్, రాజబాబు, ముక్కామల, సాక్షి రంగారావు ప్రధాన తారాగణమైన ఈ చిత్రానికి పినిసెట్టి మాటలను, చలపతిరావు స్వరాల్ని, వి. యస్. ఆర్. కృష్ణారావు కెమెరాను, నిర్వహిస్తున్నారు. నిర్మాత : తమ్మారెడ్డి కృష్ణమూర్తి. లక్ష్మీ ఫిలింస్ విడుదల.



"గాజుల కిష్టయ్య"లో ఒక దృశ్యం

వాడు!" రంగారావు మాటలకి అతని పక్కనే ఉన్న వ్యక్తి పెదవులతో మాత్రం నవ్వాడు. అతని కళ్ళు సోమసుందరాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ ఉండిపోయాయి

"అంత తెలివి గలవాడివి ఇప్పుడెలా ఇంత పనిని జరగనిచ్చావు చెప్పు!"

"ఎంత పని ?" అందామనుకున్నాడు సోమసుందరం. గొంతుకలో ఏదో చిక్కుకున్నట్లయింది. అవ్యక్తంగా ఏదో శబ్దం మాత్రం బయటపడింది అతని నోట్లో నుంచి.

పీడకల

"సరేలే, అదంతా ఎందుకుకాని ముందీ కాగితంమీద సంతకం పెట్టు! తొందరగా బయట పడచ్చు!..." అంటూ రంగారావు తన పక్కమనిషి ఇచ్చిన ఒక కాగితాన్ని సోమసుందరానికి ఇచ్చాడు.

సోమసుందరం దాన్ని పయిపయిగా చదివాడు. చదివి శూన్యంగా ఎదురుగా గోడవంక చూశాడు. ఆ గోడమీద ఫ్రేము కట్టిఉన్న పటం చాలా పాతది అయి ఉండాలి. ఆ మొహాన్ని తను ఎన్నిసార్లు, ఎన్ని చోట్ల, ఎన్ని పటాలలో చూశాడో లెక్కలేదు. చూడనివాళ్లు మనవాళ్లు ఎందరు ఉండగలరు, అనుకున్నాడు సోమసుందరం. అయినా ఈరోజు ఎందుకో అది కొత్తగా కనిపిస్తోంది.

"ఇదంతా ఒక పీడకల అనుకో సుందరం ! ఆ స్టేట్‌మెంట్‌మీద నీ సంతకం పడేశావంటే అంతా సరిగ్గా పోతుంది– ఇదిగ పెన్ను..." రంగారావు తన జేబులోని బంగారు మూతవున్న కలాన్ని తీసి సోమసుందరానికి ఇచ్చాడు.

సినిమా



''దేవుడు యిచ్చిన చెల్లెలు'' లో ఒక దృశ్యం

వాణిశ్రీకి నటరత్న బహుమతి

వాణిశ్రీ, నటరత్న ప్రేమించుకున్నారు. ఒకరి మనస్సు నొకరు పూర్తిగా అర్ధం చేసుకున్నారు. పవిత్ర ప్రేమకు ఒండొరులు బానిసలయ్యారు. అనురాగంతో అంతరంగాలు కలుపుకున్నారు. తన ప్రేయసి కోసం ఓ విలువైన బహుమతిని తెచ్చారు. మాటల్లో ఏదో చిక్కు ప్రశ్న వేశారు తన ప్రేయసిని. ''ఈ చిక్కు ప్రశ్న విప్పలేవా'' అన్నారు నటరత్న. ''నీ ప్రేమలో చిక్కుకున్నాక అన్నీ మర్చి పోయాను'' అంది వాణిశ్రీ. ఇంతలో నటరత్న ఓ చిన్న పెట్టెను వాణిశ్రీ చేతిలో పెట్టారు. పెట్టెను తెరచి చూచిన వాణిశ్రీ అందులోని వజ్రపుటుంగరాన్ని చూచి మురిసిపోయింది. కానీ వెంటనే ''దాచుంచు. పెళ్లినాటికి ఏకంగా ఇద్దువు గానీ'' అంది వాణిశ్రీ- ''అందుకున్నావుగా! నీ దగ్గరే వుంచు'' అంటూనే ఆవిడ వెయ్యికి వుంగరాన్ని తొడిగారు నందమూరి. అంతటితో వూరుకున్నారా అంటే లేదు. వాణిశ్రీని తన హృదయానికి హత్తుకున్నారు. కాసేపు ఇద్దరూ మైమరచారు. ఇంతలో కట్ అన్నారు దర్శకుడు బి. వి. ప్రసాద్.

ఇంతకూ ఎందులో అనుకున్నారు పై సన్నివేశం. భాస్కర చిత్రవారి ''ఆరాధన'' చిత్రంలో. ఏ. పుండరీకాక్షయ్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి గొల్లపూడి మాటలను, హనుమంతరావు సంగీతాన్ని, సత్యనారాయణ ఛాయాగ్రహణాన్ని, నిర్వహిస్తున్నారు.

అన్నపూర్ణా విడుదల చేసే ఈ చిత్రంలో జగ్గయ్య, గుమ్మడి, ప్రభాకరరెడ్డి, విజయలలిత, కె. వి. చలం, సాక్షి రంగారావు ముఖ్య పాత్రధారులు.

నరనారాయణ

ఉత్తమ చిత్రాలను నిర్మించే కాంక్ష వున్న నిర్మాత పుండరీకాక్షయ్యగారికి ''నరనారాయణుల''పై కళాత్మకమైన చిత్ర కావ్యాన్ని సృష్టించాలన్న ఆశ ఏర్పడి రెండేండ్లు అయింది.

మణిపూస లాంటి ''నరనారాయణ'' చిత్రానికి కొండవీటి వేంకటకవిగారు మహోత్కృష్టమైన సేవ చేస్తున్న నిజాన్ని, యిటీవల వారితో జరిపిన సంభాషణం తెలియచేసింది.

వేంకటకవిగారి రచనలో రతనాలు పండగలవు అనిపించింది. జన సామాన్యానికి కూడా అర్థమయ్యే రచనాశైలి వారిది.

నరుడుగా నటించే వ్యక్తి ఎంత సమర్ధుడుగా వుండాలో, నారాయణ పాత్రధారి కూడా అంతే ప్రజ్ఞావంతుడై యుండాలి.

తెలుగు చిత్ర రంగంలో నరనారాయణ పుణ్యే లెవరో ప్రేక్షకులు పసిగట్టలేరా?

రమాప్రభకు వింత-యిల్లు!

ప్రేక్షకులను నవ్వించే నటి రమాప్రభ, రాజబాబు సరసన నిలబడి సమానంగా నటించగల హాస్య నటి రమాప్రభ.

ఈమె ఆధ్వర్యంలో హైద్రాబాద్ మిత్రులు కమలాకరరావు, దయానంద్ కరుణ చిత్రను స్థాపించారు.

ప్రధమ ప్రయత్నంగా సంపూర్ణ హాస్య చిత్రాన్ని తలపెట్టారు. ప్రేక్షకుడికి రెండున్నర గంటలసేపు వినోద కాలక్షేపాన్ని అందచేసే కధావస్తువును ఎన్నుకొన్నారు.

చిత్రం పేరు ''వింత యిల్లు—సంతగోల''. ఈ చిత్రానికి అప్పలాచార్య రచన్ను, దేవరాజ్ ఛాయను, తోట కళను, ఆదుర్తి హరనాథ్ కూర్పును, వెంకన్నబాబు ప్రొడక్షన్ను, శంకర్ సంగీతాన్ని నిర్వహిస్తున్నారు.

ఆగస్టు 16న వాహినీ 'డి' థియేటర్‌కు వెళ్లాను. ఆ రోజు ఒక గొంతు కమనీయంగా పాడిన నిజాన్ని చెవులార విన్నాను. మహాగాయిని సుశీలతో గొంతు కలిపాడు. అతిశయోక్తి కాదుగాని... పాట మధుర మధురంగా వచ్చింది. ఆ గాయకుడి పేరు ఆనంద్.వాయిస్‌లో కల్చర్,స్వీట్‌నెస్ వుంది.ఆనంద్—సుశీల కలిసి ఆలాపించిన ఆ పాటనుగోపీ రాశాడు.

''వింత యిల్లు —సంత గోల'' చిత్రంలో శరత్,ప్రభలమీద సుశీల,ఆనంద్ పాడినపాటనుచిత్రీకరించబోతున్నట్లు, దర్శకుడు లక్ష్మీదీపక్‌చెప్పారు.

దీపక్ దర్శకత్వం నిర్వహిస్తున్న మొదటి కామెడీ చిత్రం ''వింత యిల్లు — సంత గోల''.

ప్రధాన పాత్రలను రాజబాబు, నాగభూషణం, పద్మనాభం, కాంతారావు, రమాప్రభ, జయమాలిని, చంద్రమోహన్ పోషిస్తున్నారు. ఈ చిత్రం తారకరామ, శ్రీ తారకరామ, నవభారత్ ద్వారా నవంబరులో విడుదలవుతుంది.

లక్కీ జయచిత్ర!

రెండు వారాల క్రితం తెలుగు వాసన వున్న తమిళ చిత్రాన్ని శ్యామ్‌ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ తెలుగులో నిర్మించే హక్కును కైవశం చేసుకొన్నట్టు రాస్తూ, నాయిక పాత్రను లక్ష్మి మాత్రమే పోషించగలదని పేర్కొన్నాను.

ఆగస్టు 19 న, జెమినీ రికార్డింగ్ థియేటర్లో దర్శకుడు దాసరి చెప్పారు-జయచిత్ర నాయికని.

జయచిత్రను అదృష్టవంతురాలు అని చెప్పాలి. ఎందుకంటె ... వాణిశ్రీగాని, లక్ష్మిగాని చెయ్యగలరనిపించే పాత్ర జయచిత్రకు వచ్చినందుకు.

గడుసరిదర్శకత్వంలో జయచిత్రరాణించగలదు. ఈ చిత్రంతో జయచిత్రకు విలువ పెరగ గలదు.

''దారి తప్పిన ఆడది''కి నీడ యిచ్చి, మనసిచ్చి, మాంగల్యం యిచ్చిన మంచి మనిషిగా కృష్ణంరాజు నటిస్తున్నారు.

''దారి తప్పిన ఆడది'' చిత్రానికి చక్రవర్తి సంగీత సారధి. సినిమా అనువాదం, సంభాషణం, దర్శకత్వం ఏడక్షరాల ప్రతిభావంతుడు నిర్వహిస్తున్నారు. (గడుసరి...దాసరి.) ఎస్. రవీంద్రనాథ్ చౌదరి నిర్మిస్తున్న ''దారి తప్పిన ఆడది''ని లక్ష్మి ఫిలింస్ విడుదల చేస్తారు. సహాయ పాత్రలను

''గుణవంతుడు'' లో ఒక దృశ్యం



సువర్ణసుందరిని ఆకర్షించిన స్వప్నసుందరి

స్వప్నసుందరిగా, సువర్ణసుందరిగా దర్శన మిచ్చి, ప్రేక్షకుల వూహల్లో శృంగార దేవతగా ముద్ర వేసుకున్న అంజలీదేవిని మరొక స్వప్నసుందరి ఆకర్షించిన విషయాన్ని పాఠకులకు తెలుపుతున్నాను.

"ఢిల్లీని ప్రస్తుత నివాస స్థలంగా గొన్న స్వప్నసుందరి ఎవరో కాదు. "తియ్యని వెన్నెల రేయి" పాటను పాడిన సరళ కుమార్తే స్వప్నసుందరి" అని అంజలీదేవి చెప్పారు.

"మహాకవి క్షేత్రయ్య" చిత్రంలోని ఒక పాటను స్వప్నసుందరి పాడింది. ఆమె గాత్రం సుమధురంగా వున్నదన్న నిజాన్ని సౌండ్ ఇంజినీరు కోటేశ్వరరావు బలపరచారు.

"భగవంతుడు స్వప్నసుందరికి ఎంతటి మధుర కంఠాన్ని యిచ్చాడో, అంతకుమించిన అందచందాలను ప్రసాదించాడు" అంటూ స్వప్నసుందరిని అంజలీదేవి ప్రశంసిస్తూ, తర్వాతి చిత్రంలో హీరోయిన్‌గా పరిచయంచేసే వుద్దేశ్యాన్ని వ్యక్తపరిచింది.

స్వప్నసుందరికి కూచిపూడి, కథక్, భరతం మున్నగు నృత్యములందు విశేషానుభవం వుండడమే గాక, విదేశీయుల ప్రశంసాహారాలు కూడా వున్నాయని అంజలీదేవి చెప్పారు.

అంజలీపిక్చర్ కంబైన్స్‌వారి "మహాకవి క్షేత్రయ్య" చిత్ర నిర్మాణ ప్రారంభదశలో స్వప్నసుందరిని, ఆదినారాయణరావుగారు చూసివుంటే, వున్న మూడు నాయిక పాత్రలలో ఒకటి లభించి వుండేదేమోననెడి భావం, నాకు బోధపడింది.

క్షేత్రయ్య నిర్మాణం!

"మహాకవి క్షేత్రయ్య" చిత్ర నిర్మాణం యిరవై ఏండ్లనాడే జరపడానికి నిశ్చయించిన నిజాన్ని, ఆదినారాయణరావుగారు చూపిన స్క్రిప్టు పుస్తకం తెలియచేసింది. ఆనాడు సముద్రాల రాఘవాచార్య, వేదాంతం రాఘవయ్య, ఆదినారాయణరావు, అక్కినేని, అంజలీదేవి వరుసగా రచన్ను, దర్శకత్వాన్ని, సంగీతాన్ని, క్షేత్రయ్య వేషాన్ని భామిని వేషాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.

ఎప్పట్నుంచో క్షేత్రయ్య పాత్రపట్ల, అక్కినేనికి ప్రేమ, నమ్మకం వున్నదని ఆయినే చెప్పారు.

నేటితరం నుంచి ఆనాటితరంవరకు 'క్షేత్రయ్య' పాత్రను ఆదరించగలరన్న ధృడవిశ్వాసం నాగేశ్వరరావుకు వుండడంవల్లనే, పునర్జీవితుడు ఆ పాత్రకు ప్రాముఖ్యతను యిచ్చారనిపిస్తుంది.

"రెండు షెడ్యూల్స్ జరిగిన తరువాత, 'క్షేత్రయ్య' రషస్‌ను ఎందరోచూచి, అక్కినేనికిది రజతోత్సవ చిత్రం" అని ఏకగ్రీవ అభిప్రాయాన్ని వెల్లడించారు. "ఆదుర్తి కీర్తి మరింత పెరుగుతుంది; ఆదినారాయణరావును మరువలేరు."

పదకొండు చిత్రాల నాయకుడు

"మహాకవి క్షేత్రయ్య"గా జనవరి ఏడున ఆంధ్ర ప్రేక్షకుల ఆశీర్వాదాన్ని అందుకునే అక్కినేని, ఆ రోజునే తన 'అన్నపూర్ణ' స్టుడియోను ప్రారంభించడానికి నిర్ణయించారు.

జులై 13 న నిరాడంబరంగా, శంఖుస్థాపనతో ఆరంభమైన, అన్నపూర్ణా స్టుడియో జనవరి 13 నాటికి రెండు భారీ చిత్రాల షూటింగులతో కల కలలాడగలదని తెలపడం నా ధర్మంగా భావిస్తున్నాను.

ఆ రెండు చిత్రాలను నిర్మించే వ్యక్తులు అసాధారణ ప్రజ్ఞావంతులు. జగపతి రాజేంద్రప్రసాద్ గారి "బంగారు బొమ్మలు". సురేష్ రామానాయుడు గారి "సెక్రటరి".

"బంగారు బొమ్మలు, సెక్రటరి" చిత్రాలు గాక, మరో తొమ్మిది మందికి అక్కినేని అంగీకరించిన విషయం ప్రేక్షకులకు సంతోష వార్తే గదా!

జమునకు సత్యనారాయణ విడాకులు

ఆశ్చర్యంగావుంది కదూ. జమున కేమిటి సత్యనారాయణ విడాకులివ్వడమేమిటి? అనే సందేహం వచ్చిందికదూ. ఇది అబద్ధంకాదు. నిజమే. బాగా చదువుకున్న సత్యనారాయణ, చదువు, వుద్యోగం వున్న జమునను కోరి పెండ్లి చేసుకుంటాడు. కొంతకాలం భార్యాభర్తలిద్దరూ సుముఖంగానే కాపురం చేసారు. తనభార్య వుద్యోగం చేయడం తనకంత సబబుగాలేదంటాడు సత్యనారాయణ. తన భర్తకు తనమిత్రుడి సాయంతో కాలేజిలో లెక్చరల్ పోస్ట్ ఇప్పిస్తానంటుంది జమున. సత్యనారాయణ మనస్సు అందుకు అంగీకరించదు.

ఒకసారి తన కొలీగ్స్ అందరికీ తమఇంట్లో విందునిస్తుంది జమున. ఆహూతులంధరితో సోషల్‌గా తనభార్య మాట్లాడడం సహించలేకపోయాడు సత్యనారాయణ. జమునతో నిక్కచ్చిగా చెప్పేసాడు. ఏమని? ఆవిడ వుద్యోగం చెయడం, ఇలా పదుగురితో మాట్లాడడం ఇష్టంలేదని. కానీ జమున ఆత్మాభిమానంకల స్త్రీ. తనస్వార్థంకోసం మరొకరి స్వేచ్ఛకు అడ్డుచెప్పడం సమంజసం కాదంటుంది. మనస్సు నిర్మలమైనపుడు నలుగురి మనుషుల మధ్య తిరగడంమూలంగా, వారితో సంభాషించడం మూలంగా వాటిల్లే నష్టం ఏమీ వుండదు అంటుంది. ఇలా చిన్న చిన్న గొడవలను పెద్దవిచేసి, తనభార్యకు విడాకులిస్తాడు సత్యనారాయణ.

ఇంతకూ పై సంఘటన ఏ చిత్రంలోనిదో చెప్పాలిగా. శ్రీ గౌతమ్‌పిక్చర్స్ వారి "ఈకాలం దంపతులు" చిత్రంలో పై నుదహరించిన సమస్యల సంఘటన లెన్నో వున్నాయి. ఒకరు తెలిసో, తెలియకో చేసిన తప్పవల్ల ఎన్ని అనర్థాలు సంభవిస్తాయో పై చిత్రం వివరంగా విశదపరుస్తుంది. భార్యాభర్తలమధ్య సంఘీభావం, సమైక్యత, సర్దుబాటు, నమ్మకం లేకుంటే, వారి జీవితాలు పాడవడమేకాక, వారిపిల్లల భవిష్యత్తు కూడా అగమ్యగోచరమౌతుందనడానికి ప్రత్యక్షసాక్ష్యమే "ఈకాలం దంపతులు". రామబ్రహ్మంగారు నిర్మిస్తున్న ఈ చిత్రానికి డి. యోగానంద్ దర్శకుడు.



"మనస్సాక్షి" లో జానకి



"ఈకాలపు పిల్లలు" లో యీకాలపుపిల్ల శ్రీదేవి

సినిమా

ఎప్పుడిస్తే అప్పుడే !

ఇది చిత్రానికి యిడిన పేరు అనుకునేరు సుమా. కాదు... కాదు. ఇది కధ కాదు సుమా!

అగ్ర దర్శకుడు విశ్వనాథ్ ఎప్పుడిస్తే (కాల్ షీట్సు), అప్పుడే చిత్ర నిర్మాణానికి పూనుకొంటాను, అన్నాడు "ఓ సీత కధ" చిత్ర నిర్మాత శర్మ

తెలుగులో అఖండ విజయాన్ని సాధించిన "ఓ సీత కధ"ను కన్నడంలో శర్మ నిర్మించారు. తెలుగు తెచ్చినంత పేరునుగాని, డబ్బునుగాని కన్నడం తేలేకపోయింది.

విశ్వనాథ్ గారిచ్చే కధను మాత్రమే తను చిత్రంగా నిర్మించదలచినట్టు శర్మ చెప్పారు గాబట్టి, నమ్ముకున్న వ్యక్తికి సహాయపడే మనసత్వం కాశీనాధునికి వుంది గాబట్టి, త్వరలోనే చిత్రం ప్రారంభం కాగలదు.

తెలుగులో మేరే అప్నే

ఉదయిని ఆర్ట్సు "మేరే అప్నే" చిత్రాన్ని తెలుగులో నిర్మించేందుకు నిర్ణయించింది. విక్టరీ మధుసూదనరావు దర్శకత్వం, చక్రవర్తి సంగీత సారధ్యం, బొల్లిముంత రచన చేస్తున్నారు. "మనసున్న మనిషి"ని అందిస్తున్న జి. వి. కృష్ణా రావు "మేరే అప్నే" చిత్రాన్ని తలపెట్టారు.

ఇది సాధ్యమా ?

రాళ్ళు, రప్పలతో నిస్సారంగా పడివున్న భూమిని సారవంతం చేయడం సాధ్యమా ? ప్రయత్నంలో పట్టుదలను పటిష్ఠం చేస్తే, సాధించలేనిదంటూ ఏదీ వుండదు. మనోబలంతో ముందడుగు వేస్తే, సాధ్యం కానిదంటూ ఏదీ వుండదు అనే సత్యాన్ని నమ్మి, బీడు భూముల్ని పంట భూములుగా మార్చి, పేద ప్రజల కొక వుపాధి కల్పిస్తారు హీరో కృష్ణ. పల్లె ప్రజలకే ఆపద వచ్చినా, నేనున్నానంటూ, ఆపత్సమయంలో వారికి అండగా నిలుస్తుంటారు కృష్ణ. అందుకే ఆ పేద ప్రజలందరూ అతన్ని "దేవుడిలాంటి మనిషి" అనేవాళ్ళు.

నేను ఏమైనా ఫరవాలేదు. నావాళ్ళు బాగుండాలి. వాళ్ల బాగోగులు నాకు కావాలి అనే మనస్తత్వం గొన్న పాత్రను "దేవుడిలాంటి మనిషి" చిత్రంలో కృష్ణ పోషిస్తున్నారు. ఈ హెవీ రోల్‌ను కృష్ణ అద్వితీయంగా పోషిస్తున్నట్టు రషస్ చూచిన వారు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్ర దర్శకుడు సి. ఎస్. రావు చిత్రంలో ఒక ముఖ్య పాత్రలో అగుపిస్తారు. చిత్రంలోని తదితర ముఖ్య పాత్రలను షావుకారు జానకి, వెన్నిరాడై నిర్మల, శ్రీదేవి, చంద్రమోహన్, రావి కొండలరావు, కాశీనాథ్ తాతా, సి. నాగభూషణం, రాజబాబు, సత్యనారాయణ, మాడా, కె. కె. శర్మ, మల్లాది పోషిస్తున్నారు.


పూర్ణిమా పిక్చర్స్ పతాకం క్రింద డి. ఎన్. రాజుగారు నిర్మిస్తున్న ఈ చిత్రానికి కె. వి. మహదేవన్ సంగీతాన్ని, డి. వి. నరసరాజు సంభాషణలను, జి. కె. రాము ఛాయను, గోఖలే కళను సమకూరుస్తున్నారు. బహుశా అక్టోబరు ప్రాంతంలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనే వుద్దేశ్యంలో వున్నారు నిర్మాత డి. ఎన్. రాజుగారు.

పాడిపంటలు

పద్మాలయా ఆర్ట్ పిక్చర్స్ స్టుడియో ప్రమేయం రవ్వంతయినా లేకుండా, పూర్తిగా ప్రకృతి రమణీయతగొన్న ప్రదేశాలలో షూటింగు చెయ్యడానికి నిర్ణయించిన నిజాన్ని, నిర్మాత ఆదిశేషగిరిరావు చెప్పారు.

మానికొండ, కడియం, పోలవరం, సోమశిల ప్రాజెక్టు, అమలాపురం, గుంటూరుగాక మరికొన్ని ప్రదేశాలలో "పాడిపంటలు" వర్ణచిత్ర నిర్మాణం జరుగుతుంది. ఈ చిత్రానికి కధ, దర్శకత్వం పి. చంద్రశేఖరరెడ్డి. మాటలను మహారధి, సంగీతాన్ని మహదేవన్, కూర్పును గోపాలరావు, ఛాయను స్వామి నిర్వహిస్తున్నారు.

"పాడిపంటలు" చిత్రంలోని ప్రధాన పాత్రలను కృష్ణ, జగ్గయ్య, గుమ్మడి, నాగభూషణం, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, పద్మనాభం, చంద్రమోహన్, రామమోహన్, మురళీమోహన్, విజయనిర్మల, లత, అంజలీదేవి, కృష్ణకుమారి, రమాప్రభ, నిర్మల, నందితాబోసు పోషిస్తున్నారు.



"రక్తపాశం" లో కృష్ణంరాజు

విదేశీ చిత్రంలో కృష్ణ

విఖ్యాత చిత్ర నిర్మాత జి. హనుమంతరావు గారిని కార్యసాధకుడు అని మరొకసారి చెప్పడానికి కారణం వుంది.

విదేశాల్లో చిత్ర నిర్మాణం అంటే మాటలా? అట్టి పనిని చేపట్టి, విజయుడయ్యారు, పద్మాలయా పిక్చర్స్ అధినేత.

రాబోయే "మే, జూన్" మాసాల్లో హనుమంతరావుగారి విదేశీ వర్ణ చిత్రం ప్రారంభమవుతుంది. లండన్‌లో కొంత, పరిసర ప్రాంతాలలో మరి కొంత షూటింగు జరగడానికి వలసిన ఏర్పాట్లను సమకూర్చిన హనుమంతరావుగారిని కార్యసాధకుడు అనడం వుచితమేగదా !

హీరోగా కృష్ణ నటించే విదేశీ చిత్రానికి కధ రాసినది నిర్మాత హనుమంతరావే.

కృష్ణ జానపదం !

"జీనియస్" సి. ఎస్. రావ్ దర్శకత్వం నిర్వహించే విచిత్ర సంఘటనలను గొన్న వర్ణ జానపద చిత్రంలో కృష్ణ హీరోగా నటించడానికి అంగీకరించారు.

"చీకటి వెలుగులు" వర్ణ చిత్రాన్ని అందించిన రంజిత్‌కుమార్ హీరో కృష్ణతో నిర్మించబోయే వర్ణ చిత్రం షూటింగు డిశంబరులో ప్రారంభం కావచ్చు.

ఉత్తమ చిత్రకు, పద్మజా మూవీస్‌కు అధినేత అయిన కోగంటి కుటుంబరావు నిర్మించబోయే వర్ణ చిత్రానికి కృష్ణ నాయకుడు.

పైన చెప్పినవిగాక, మరో అయిదుగురికి కృష్ణ అంగీకారం తెలిపారు.

ఎక్కువ చిత్రాలు చెయ్యకూడదని కృష్ణ తీసుకున్న నిర్ణయం ఎంతేని అభినందనీయం.

విజయదశమిరోజున వినాయకచవితి

— కృష్ణంరాజు


"వినాయక చవితి శుభ సందర్భంలో పాఠకులందరికీ నా నమోవాకాలు. చవితి రోజున ఆ పండుగను జరుపుకునే భాగ్యానికి నేను నోచుకోలేదు. ఎంతో హుషారుగా, చలాకీగా జరుపుకునే ఆ పండుగకు నేను బలవత్తర కారణంవల్ల దూరమయ్యాను. వినాయక చవితిని ఎంతో ఘనంగా జరిపేవాళ్లం ఒకప్పుడు. కానీ ఆ గణపతికి మాపై ఎందుకు ఆగ్రహం కల్గిందో వూహించలేకపోయాము. నవ్వుతూ, నలుగురిచేత తిట్లు తింటూ, హేపీగా గడిపే ఆ రోజున మా కుటుంబంలో ఓ విషాదాన్ని విసిరాడు ఆ వినాయకుడు. మా తాతగారు మాకు లేకుండా పోయారు ఆ రోజు.

అప్పటినుంచీ చవితి రోజున ఆ పండుగను జరుపుకోవడంలేదు మేము. వినాయకుడంటే మాకు ఎనలేని భక్తి. ఆ స్వామిని కొలువకుండా వుండలేము. అందుకే విజయదశమి రోజునే వినాయక చవితిని గూడా చేసుకోవడం ఆనవాయితీగా పెట్టుకున్నాం. పండుగ చేసుకోకపోయినా, ఎప్పటికన్నా గూడా ఆ రోజు ఇంకాస్త వుత్సాహంగా ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొంటూ, ఆప్తులతో, ఆత్మీయులతో ముచ్చటిస్తూ, జరిగిపోయిన జరగకూడని సంఘటనను మర్చిపోతూ, హాయిగా గడుపుతుంటాం మేము" అన్నారు హీరో కృష్ణంరాజు.

— శ్రీనివాస్

అదృష్టం జారిపోదు

మానస



"తవఁకి తెలీదేటుందమ్మగోరూ ?"

ఆస్పటాల్లో సేర్పుకోనాకి పెద్ద డాట్రు బాబు, మందులివ్వనాకి సిన్న డాట్రూ, మడిసి లానే ఉండి సూ ణ్ణాకి ఓర్పు బోయిలూ, వంతులోరీగా ఎవుడికందిందాడు ముందే గుంజేసుకోగా, మా వరసొచ్చి మావుఁ నాలుగురాళ్లు కళ్లసూడ్డవంటే... మడిసి సచ్చిపోయినప్పుడే తల్లీ ! నానడిగిందే ఎక్కువ కాదు;నలుగురం ఓటాలేసుకోవాల" వినయంగా చేతులు కట్టుకుని చెబుతున్నాడు శవాలు మోసే తోటీ శారదతో.

"సరేలే. కానీండి!" నిర్లిప్తంగా అంది శారద.

నలుగురు తోటీలూ సాయంపట్టి శ్రీనివాస్ భౌతికకాయాన్ని హాస్పిటలు గేటు దగ్గరికి చేర్చారు. ఆమె పర్సులో మిగిలిన రెండు పదులూ తీసి వాళ్లకిచ్చింది.

వాళ్లు వెళ్లిపోయారు.

* * *

"... ధరలన్నీ మా సెడ్డ పిరవైఁపోనాయి తల్లీ !

మేళాంతో ఎదురు కఱ్ఱల పాలకాడి మీన మడుసులు మోసుకెల్లాలంటే... రెండొంద లొద్దీ !

సిన్నకారు మీన తోలుకెల్లి అగ్గెట్టియా లంటె నూటయాభయవుద్ది !

అయన్నీ ఎందుకు ? సొల్పంలో నాగేయ మంటారా, మా సొర్గోహనం, అదే తల్లీ, మా తోపుడుబండీ మీన నాగేత్తాం. వంద రూపాయలు సార్జీలవుతాయి.

ఎలగెల్లినా, మల్లీ కాటికాడ ఖర్చులు వీయే! సెప్పండమ్మ తొరగా! మా కేరే బేరాలుండాయి !"

కారాకిల్లీ నవుల్తా ఏవేవో చెప్పుకు పోతున్నాడా వ్యక్తి. దేనికీ పెదవి విప్పని శారద సూటిగా వాడి కళ్లలోకి చూసింది. వాటిలో జాలి అన్నది ఎక్కడా లేదు. బీడీ కాల్చుకుంటూ అతి సునాయాసంగా చెబుతున్నాడు. ఆమె కళ్లలో ఏంగ్రహించాడో మళ్లీ అన్నాడు.

"సెప్పాల్సింది మా ధరమం గాబట్టి సెప్పాను. ఈ బత్తు పద్దతులియ్యేనమ్మా ! సూసాత్తవుంటే ఉం.ఎ ఊరు నాగా నేదు. ఒక మాటినుకోండమ్మగోరూ: తవఁరీ పీనుగ నేసుకుని సీ పూరెళ్దారనుకుంటే మాత్తరం అవహా సార్జీలు ... ? ఇంతకి డబలింగ్గా, డబలింగుకి డబలింగూ అయిపోతాయి కదమ్మా !

అంతుకే తవఁకన్నీ బోధ సేశాను.

అయితే, మరికోమాట కూడా నేక పోలేదు తల్లీ !

మడిసి దక్కనేదుగా అని మునిసిపాలిటోళ్ళకి పీనుగ నొగ్గేసి కూడా ఎల్లిపోతూంటా రమ్మా కొంతమంది ధరమ పెబువులు. సీ...సీ! సొప్పొద్దూ...; అలగ మునిసిపాలిటోళ్ల కొగ్గేసిన పీనుగ పాట్లు కుక్కలు కూడా పడవు తల్లీ ! సందేళ దాకా సూసి, ఏ నారీలోనో ఈడ్సుకెల్లి,యాడో సెంటల్లో కప్పెట్టేత్తారు.

మరికోమాట ...

ఈళ్లే ఎదవలనుకుంటే... ఈళ్ల జేజెమ్మల్లాంటి అలగా జాతోళ్లు కూడా కాసుక్కూసుంటారు మాయమ్మా ! దహనం సేసేతామని, పాత్తిక్కీ పరక్కీ బేరవాఁడ కుని, పీనుగ నెత్తుకుపోయి, ముష్టిల్లి క్రమ్మేత్తారు ఆ నా కొడుకులు చెంటరు చెంటర్నో 'దిక్కు నేనోడు బాబూ ! అనోధోడు బాబూ ! సచ్చిపోనాడు బాబూ !' అంటూ అదుక్కుని, సేతులు మార్చి, సేతులు మార్చి, వోసన తగలంగానే ఏ కాలవఁడో ఒగ్గేసి పారిపోతారు. నా మాటేటి తమకి నమ్మకం నేకపోతే విశారింసియ్యండి తల్లీ ! పీనుగుల్ని మోసే వాళ్లమే గానీ... మాకాడ నిజాయితుందమ్మగోరూ ! ఆలోచించుకోండి.

"సందేళైపోనాదని మాత్తం దిగులెట్టమాకండి. రేత్తిరైనా, పొగులైనా మా సార్జీ లొకటే...; సేసేపనీ ఒకటే !"

* * *

అంతసేపూ మౌన సముద్రంలో మునిగిపోయిన శారదలో కదలిక ఏర్పడింది.

ఆ కదలికతో ఇహలోకంలో పడేసరికి మళ్లీ నిస్సహాయమైన ఆలోచనలు ఆమెను

విశ్వ - విజ్ఞానం

మామూలు మనిషి ఏ కొండవాలులో నైనా డిసెంబరు పూవులు (వయొలెట్‌లు) పరిచినట్లు కనిపిస్తే కోసి, అందమైన గుత్తి తయారు చెయ్యాలనుకుంటాడు. అదే భూగర్భ శాస్త్రవేత్త అయితే అక్కడనేలలో జింక్ (తుత్తినాగం) వున్నదంటాడు.

సోవియెట్ విజ్ఞాన పరిషత్తు ప్రథమాధ్యక్షులు, భూగర్భ శాస్త్రవేత్త అయిన డా. అలెగ్జాండర్ కార్పిన్‌స్కీ సోదర శాస్త్రవేత్తలముందు ఒక విచిత్రమైన ప్రశ్నవేశారు "భూగర్భ శిలా నిర్మాణ స్వరూపాన్ని, ఖనిజ నిక్షేపాన్నీ మొక్కలు సూచిస్తాయా ?'

ఖనిజ నిధులను తెలుసుకోవడంలో మనుష్యునికి తోడ్పడగల అనేక వృక్షాలు యీ వేళ తెలుసును. జియోబోటని అనే శాస్త్రమే పరిణతి పొందింది.

జిప్సోఫిలా అనే మొక్క భూమిలోని రాగి గనులను చూపుతుందని ఇటీవలనే శాస్త్రవేత్తలు నిరూపించేరు. అల్టాయ్ మండలంలోని ప్రాచీన గనులలో ఆ మొక్క కనిపించింది. ఓక్—కాపెర్ పొదలు నేలలో జిప్సమ్ వునికిని చూపుతాయి. పొట్టిచెర్రీ, ముళ్ల బీచ్‌పొదలుసున్నం రాయివున్నట్లు తెలుపుతాయి. హనీసకుల్ మొక్క బంగారం, వెండి వున్న చోట్ల పెరుగుతుంది.

వారస్‌వుడ్ వంటి చెట్లు కొన్ని చోట్ల చాలా ఎత్తుగా పెరుగుతాయి. కొన్నిచోట్ల గిడసబారివుంటాయి. నేలలో బరోన్ ఎక్కువ తక్కువ వుండడం వలన యిది తటస్థిస్తుంది. ఖనిజ నిధుల సమీపంలో కొన్ని మొక్కలలో కొన్ని మార్పులొస్తాయి. ఎడారుల్లో ఆకాంత ఫిల్లియమ్ అనే ముళ్ల మొక్క పెంకురంగు పువ్వులు పూస్తుంది. కాని దాని పువ్వులు తెల్లగా వుంటే గంధకం హెచ్చుగా ఉంది, అక్కడి నేలలో అని అర్థం.

చాల మొక్కలు తామే ఖనిజాల్ని కూడబెడతాయి. వాటికాండాల్ని ఎండబెట్టి ఎంతో విలువైన పదార్థాలు వానినుంచి తీయవచ్చు. మొక్కలో రాగో, జింక్, గంధకమో విశేషంగా కనిపిస్తే అవి వున్నచోట ఆలోహాలు దండిగా ఉన్నాయని అర్థం. ఏదో లోహంతో కూడిన ఆహారాన్ని జీర్ణం చేసుకోగల శక్తి మొక్కకుంది. అందుచేత ఆ మొక్క చచ్చిపోయినప్పుడు తాను కూడబెట్టిన పదార్థాన్ని తిరిగి నేలకే ఇచ్చేస్తుంది. జంతువులూ అంతే. ఆ విధంగా బొగ్గు, నూనె, రాగి, ఇంకా అనేక ఉపయుక్త వస్తువుల నిధులు ఏర్పడుతున్నాయి.

వేధించసాగాయి. చీకటి పడిపోతోంది. ప్రతిక్షణం ఒక శూలమై తన్ను పొడిచేస్తున్నంతగా కుమిలిపోసాగింది.

మనిషి బతకడానికైనా డబ్బే; పీనుగని సాగనంపడానికైనా డబ్బే! సరిగ్గా అదే లేదు తన దగ్గిర.. బ్యాగు తెరిచి చూసింది. రెండు రూపాయల లోపు చిల్లర.

చేతులు చూసుకుంది. బోసిగా ఉన్నాయి. అవి ఇప్పుడే కాదు; ఎప్పుడూ బోసే! కాకపోతే ఎడమ చేతికి ఉండాల్సిన వాచీమాత్రం మందులకోసం క్రితం రోజున మరో చెయ్యి నలంకరించింది ఆర్టిస్టిక్‌గా మెళ్ళో మెది లేది తళతళలాడే గొలుసు మాత్రమే; తెగ నమ్మినా పదిరూపాయలు రావు దానికి

కనీసం తోపుడిబండిమీద సాగనంపడానికి కూడా నోచుకోలేని తన నసుర్దత. ఉన్న ఫ ం ా త న గుండె ఆగిచ) తే? తనకా అదృష్టం కూడానా ? ల్లబికి వచ్చే దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది శారద. కళ్ళు వర్షధారలైపోయాయి.

"చెప్పండమ్మా! మా కవతలేరే బేరాలుండాయి. ఒక్కతానే కూసోనాకి ఈలవదు మాకు."

కళ్ళలో నీళ్ళతోటే తలెత్తి చూసింది శారద. అప్పటికే కొంతమంది జనం ఆమె చుట్టూ మూగి ఉన్నారు. చోద్యం చూస్తున్నట్టు చూసే ఆ జనాన్ని చూసి కుంచించుకుపోయి మళ్ళీ తల దించేసుకుంది శారద.

"బాధ పడకమ్మా! మనం నిమిత్తమాత్రులం" అంటూ ఒణికిపోతున్న స్వరంతో ఆప్యాయంగా ఓదార్చ ప్రయత్నిం

అదృష్టం జారిపోదు

చిన ఓ కంఠధ్వని విని మళ్ళీ తలెత్తి అటువైపు చూసింది శారద.

ముడతలుబడ్డ శరీరం...తెల్లగా ముగ్గులా పండిపోయి జుట్టూ. చేతికర్ర ఊతా! ఇవాళో రేపో అన్నట్టు ఉన్న వయసు మళ్ళిపోయిన ఓ వృద్ధుడు సానుభూతిగా ఆమెవైపే చూస్తున్నాడు.

'ఏడవక, ఏం చెయ్యమంటారు బాబూ!' అన్నట్టు దీనంగా చూసింది శారద ఆ వృద్ధుడివైపు.

అమె కళ్ళలో ప్రస్ఫుటమౌతున్న ఉద్వేగాన్ని గ్రహించిన ఆ వృద్ధుడు, 'చదువుకున్న దానిలా కనపడుతున్నావు. నీకు అర్థం కానిదేముంది? అడుగడుగునా దుర్భరమయ్యే పరిస్థితులకి ఓర్పుతో, సహనంతో ఎదురు నిలిచి, జీవనాన్ని సాగించి అలిసిపోయే మనిషి ఈ రోజుల్లో చావులోనే సుఖపడుతున్నాడమ్మా! బాధపడకు. ఏదీ మన చేతుల్లో లేదు. మనిషి బ్రతికినంతకాలం ఎలా సుఖపడ్డాడనికాదు; ఎలా సుఖపెట్టేమన్నదికాదు; ఎలా దాటిపోయాడన్నదే చూసుకోవాల్సిన మాయదారి రోజులివి. మనం బ్రతికినంతకాలమూ చెయ్యలేకపోయినా ... కనీసం మట్టిలో కల్సిపోయేటప్పుడైనా, జీవి ఆత్మ శాంతించేట్టు చెయ్యడం మన ధర్మమమ్మా!

దహన సంస్కారం మన సంస్కారాల్లో గొప్పది తల్లీ! బాధపడి ప్రయోజనం లేదు. ఆలస్యం చెయ్యకు. నీ తండ్రిలాటివాడ్ని. నా చేతనైన సహాయం చేస్తున్నాను, కాదన కమ్మా!" అంటూ ఐదు రూపాయలనోటు ఆమె చేతిలో పెట్టి గిరుక్కుమని వెనుదిరిగాడు.

హటాత్తుగా జరిగిన ఈ సంఘటనకి నిస్త్రాణయై కొయ్యబారిపోయిన శారద, కొన్ని క్షణాల తరువాత తేరుకుని బాపురుమనే లోపల, పాములాట ఎంతో ఆసక్తిగా చూసి, చివర్లో డబ్బులివ్వాల్సొస్తుందని తప్పించుకున్నట్టు కొంతమంది జారుకోగా, మిగిలిన వాళ్ళు, వాళ్లకి తోచింది విసిరేసి అయ్యోపాపం! అంటూ నిట్టూర్చి వెళ్లిపోయారు. శారద చుట్టూ చూసేసరికి... చిల్లర డబ్బులూ, రూపాయినోట్లూ వికటాట్టహాసం చేస్తూ కనిపించాయి తన ప్రమేయమే లేకుండా అలా పోగైన ఆ పాతిక ముప్పై రూపాయిల్ని చూసి, ఫేలవంగా నవ్వుకుంటూ అనుకుంది. బొమ్మలాడించేవాడు తోలు బొమ్మలకి ప్రాణం పోసి ఆడిస్తే... నేను ప్రాణముండే బొమ్మనే తోలుబొమ్మచేసి ఆడించావు. భగవాన్ ఎందుకు నాకీ శిక్ష...? కనికరించి సన్నిక్షణంలో అంతం చెయ్యలేవా ప్రభూ...?"

* * *

వర్షం లేదుగానీ, దేవుడు లోకాన్నంతా ముంచేసే ప్రయత్నమే చేసినట్టు ఉరుములూ, మెరుపులూ, ఉన్నట్టుండి మనుషుల్ని సహితం ఊడ్చి పారేసే ఈదురు గాలులూ! దేదీప్యమానంగా వెలిగే కరంటులైట్లు మెరుపులతో పోటీ...! చివరికి ఓటమి! ఎక్కడపోయిందో తెలీదు; ఊరు ఊరంతా చీకటి. కటిక చీకటి...!

జీవితం అంటే తియ్యటిదీ, మధురమైందీ

అని మభ్యపెట్టుకుంటున్న అమాయకులు హాస్పటల్లోకి రావడం, పోవడం తప్పించి, దాదాపు జన సంచారం స్తంభించి పోయింది ఆ రోడ్డుమీద, ఆరు గంటలు కాకుండానే!

వాహనాల లైట్ల కాంతిలో తళతళ మెరుస్తున్న ఉచిత ధర్మాసుపత్రిబోర్డు 'ఇచ్చట మనుషులు చంపబడుదురు' అన్న వికటాట్టహాసం చేస్తోంది.

సన్నటి జల్లు ప్రారంభమైంది. ఈదురు గాలితో కూడిన ఆ జల్లు, ఇంజక్షను సిరంజిలోంచి పిచ్చికారీ చెయ్యబడ్డ ధారలా సూటిగా వచ్చి తగుల్తోంది ఒళ్లు జివ్వుమనేట్టు...!

"లే, శ్రీనివాస్! లే! వర్షం పడుతోంది" అని తట్టి లేపుతున్నట్టు అప్రయత్నంగా అతని రెండు చేతులూ పట్టుకుని కుదిపిన శారద, మెరుపు వెలుగులో శ్రీనివాస్ నిర్జీవ వదనాన్ని చూసి ఖిన్నురాలై అతని గుండెల మీద వాలిపోయింది.

* * *

"తల్చుకుంటేనే గుండె తరుక్కుపోయే పరిస్థితి తల్లీ! పుట్టిన ప్రతిజీవి గిట్టడానికే అన్నది సృష్టి ధర్మమే అని తెలిసినా, విలపిస్తాము. ఇది మనవల్ల జరిగిందేనేమో అనుకుంటూ భ్రమపడతాము. తప్పమ్మా, ఏడవకు! శ్రీవాసు అదృష్టవంతుడే అనుకోవాలి. బాధపడకుండా, దాటిపోయాడు!"

శారద మాట్లాడలేదు. నిర్లిప్తంగా ఉండిపోయింది.

"గగుర్పాటు కలిగించే ఈ పరిస్థితుల్లో నిన్ను ఓదార్చడం అలాఉంచి, ఆశ్రయించక

అదృష్టం జారిపోదు

తప్పడంలేదమ్మా! నాకో సహాయం చెయ్యగలవా? జన్మజన్మలకి ఋణపడి ఉంటాను!"

మౌనంగా నిర్లిప్తంగా ఉండిపోయిన శారద ఆశ్చర్యంగా చూసింది అతన్ని.

నిర్మలమైన వదనమే అయినా ... కళ్ళలో ఏదో చెప్పుకోలేని బాధ ప్రస్ఫుటమౌతున్నట్లు గమనించింది శారద. రామచంద్రమూర్తి ఎవరో అరగంట క్రితందాకా తనకి తెలియదు.

నిస్సహాయ పరిస్థితులలో ఏదీ తోచక, పరిగెత్తి పారిపోయి ఏ రైలుక్రిందైనా పడిపోదామా అని అనుకుంటున్న సమయంలో "బాధ పడకమ్మా! నేను చేస్తాను దహన సంస్కారాలు" అంటూముందుకి వచ్చాడు. ఆమె ఆ క్షణంలో శ్రీరామచంద్రుడ్నే చూసింది అతని ముఖ వర్చస్సులో. మానవతా వాదాన్ని త్రోసిపుచ్చక, సాటిమనిషిని అర్థంచేసుకుని మహోపకారం చెయ్యడానికి సంసిద్ధుడైన ఈ మహాత్ముడు నానుంచి ఆశించే సహాయమేమై ఉంటుంది ... ??? ఆశ్చర్యంగా చూసింది శారద!

వెల్లుబికివస్తున్న దుఃఖాన్ని ఆపుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు రామచంద్రమూర్తి. సాధ్యపడటంలేదు; నోట మాటరాని అతని పరిస్థితి గమనించి శారదే అంది: "నేను చేయగల సహాయమేమిటో? సంశయించకండి, ఏదైనా చేస్తాను ... చెప్పండి మేష్టారూ!"

ఆమె అడిగిన ప్రశ్నకి వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు రామచంద్రమూర్తి. రెండు నిముషాలాగి అన్నాడు;

'ఏం చెప్పమంటావు తల్లీ! ఒక్కగానొక్క బంగారు బొమ్మ నా చెల్లెలు రాధ. పెళ్ళై పూర్తిగా సంవత్సరంకూడా కాలేదు. దేవుడింతలోనే చిన్నచూపు చూశాడు. యాక్సిడెంటైన బావగారు దాటిపోయినా ఇంత బాధ పడేవాడ్ని కాదేమో...! 'ఆయుష్షు తీరిపోయింది - దాటిపోయాడు' అని ఒక్కసారి ఏడ్చి సరిపెట్టుకో గలిగేవాడ్ని!

కాని జీవితాంతమూ ఇలా కుమిలి పోవాల్సిన పరిస్థితు లేర్పడ్డాయమ్మా! నైవేద్యంలా రెండు కళ్ళూ తీసేసుకున్నాడు దేవుడు."


ఆ మాట చెబుతున్నపుడు అతని గొంతుకలో బాధ మరింత ఎక్కువైపోయిందేమో కొన్ని క్షణాలదాకా మళ్లీ మాట్లాడలేక పోయాడు.

"మాకు ఆస్తి ఉంది. హోదా ఉంది. అన్ని సుఖాలు ఉన్నాయి; ఒక్క మనశ్శాంతి తప్ప. ఇదమ్మా నా పరిస్థితి. ఈ పరిస్థితుల్లోనే నేను నిన్ను మరింత మనఃక్లేశానికి గురిచేసి ... నీ నుండి సహాయం పొందాలని చూస్తున్నాను. నే నేమిస్తే మాత్రం దానికి ఋణం తీర్చుకున్నట్లౌతుంది ...? అయినా అడగలేక అడగలేక అడుగుతున్నాను. చచ్చి నీ కడుపున పుట్టి, జీవితాంతం సేవచేసి నీ ఋణం తీర్చుకుంటాను. చెప్పమ్మా! నీ భర్త కంటి పాపలతో నా బావకి దృష్టి ప్రసాదించగలవా తల్లీ?" రామచంద్రమూర్తి రెండు చేతులూ దోసిడిగా చేసి అర్థిస్తున్నాడు.

ఆ...! ఆ! ఎంత స్వార్థం? ఎంత కుట్ర? అని శారద గొంతుక చించుకుని అరవలేదు. అవుననలేదు; కాదనలేదు! అసలు చలనమే లేకుండా ఉండిపోయింది శ్రీనివాస్ భౌతిక కాయాన్ని చూస్తూ!

రెండు నిమిషాలు పైగా, మాటా పలుకూ లేకుండా అలా ఉండిపోయిన శారదని అనునయంగా 'చెయ్యలేవమ్మా! నాకు తెలుసు. ఇది త్యాగం కాదు ఘోరమైన పాపం...! అయినా ఉండబట్టలేక అడిగేశాను. డాక్టరుగారు మరీ మరీ ప్రోత్సహించడంతో నిన్నిలా బాధ పెట్టాల్సొచ్చింది. నన్ను క్షమించమ్మా!" అన్నాడు రామచంద్రమూర్తి గాద్గదికంగా!

శారద దేనికీ సమాధానం ఇవ్వలేదు. అదే మౌనంతో ఉండిపోయింది. సుళ్లు తిరిగి



పోతున్న ఆమె కళ్ళల్లో నీళ్ళలోంచి మసకగా కనపడుతున్న శ్రీనివాస్ భౌతిక కాయాన్ని చూస్తూ, గునపాలు గుచ్చుకున్నట్లై ఘొల్లుమంది.

మా పెళ్ళికి ఎవరూ ఒప్పుకోలేదు. కులాలు వేరని అడ్డుపడిపోయారు పెద్దవాళ్ళు. అయినా ఒకళ్ళకొకళ్ళం కావాలనుకున్నాం! అయ్యాం! అయి ఏం సాధించగలిగాం...? భగవాన్ ఏం తప్పు చేశామని మాకీ శిక్ష...?

నిరుపేదననీ, అనాధననీ జాలిపడి చేరదీసి, నా జీవితానికో అర్థాన్ని సృష్టించిన ఉత్తముడు శ్రీనివాస్! ఆయన్నే తీసుకెళ్ళిపోయావు. మేం చేసిన అపరాధం ఏమిటి భగవాన్?

మా కాళ్ళమీద మేము నిలబడగలమన్ననాడు పెళ్ళి చేసుకోవాలనుకున్నాం. అలా మేము కోరుకున్నట్టే శ్రీనివాస్‌కి ఉద్యోగం వచ్చింది. మంచి రోజులు వచ్చాయి. మా ఆశలు ఫలించాయని నీ సన్నిధిలో ఒకళ్ళకొకళ్ళమై ఇలా 'హనీమూన్' కని ఊరు విడిచి వందల మైళ్ళు దూరం వచ్చి ప్రకృతినీ దాని రమణీయతనీ ఆస్వాదించే... ఈ పరిస్థితుల్లోనా తండ్రీ ఆ చిన్న మూపు చూసేది...?

ఆ మాయదారి గాస్ట్రో ఎంట్రైటిస్ నాకు వచ్చినా, ఎంతో అదృష్టవంతురాలినై ఆయన చేతులమీదే దాటిపోయేదాన్ని. అలాగాక ఆయన్నే తీసికెళ్ళిపోయావు.

కేవలం ఒక్కరోజులో దాపురించిన ఈ వ్యాధిని తగ్గించినట్టు తగ్గించి, మరింత ఉధృతంచేసి మోసంచేసి తీసికెళ్ళిపోయావు. ఇది నీకు తగునా భగవాన్!'' నిస్సహాయురాలైన శారద చూడలేక చూడలేక మళ్ళీ శ్రీనివాస్ వదనాన్ని తిలకిస్తూ అనుకుంది.

'జీవితాంతం ఒకరికొకరు తోడనుకున్నాం. నాకా అదృష్టం లేకపోయింది. ఈ హఠాత్సంఘటన జరక్కపోతే నిన్నెంత సుఖపెట్టేదాన్నో నాకు తెలీదుగాని, పోయిన తరువాత కనీసం అంత్యక్రియలు కూడా జరిపించే స్తోమత లేనిదాన్నైపోయాను. చివరికి నీ శవాన్ని మట్టిలో కలపడానికి కూడా నువ్వే పూనుకోవాల్సొచ్చిందంటే నన్ను క్షమిస్తావో లేదో శ్రీనివాస్...!

దివ్యజ్యోతుల్లాంటి నీ కంటిపాపలు మరో

అదృష్టం జారిపోదు

జంటకి వెలుగు రేఖలుగా మార్చి మరీ వెళ్తున్నావు. నువ్వు ధన్యుడివి శ్రీనివాస్!

నేను అసహాయురాల్ని. నీ శరీరం కిరాతకులకి అప్పజెప్పి వెళ్లలేను. దిక్కులేకుండా వదిలేసి పారిపోలేను. పంచభూతాల్లో కల్సిపోడానికి లోటురాని స్మశాన వైరాగ్యాన్ని మాత్రం ఏర్పరచగలిగాననే తృప్తైనా ఈ మాయదారి జీవితానికి మిగలాలనే ఈ పని చేస్తున్నాను శ్రీనివాస్, నన్ను క్షమిస్తావు కదూ!'

"పోనీలేమ్మా; బాధపడకు!" ఆమె కళ్లలో ధారలుగా రాలిపోతున్న ముత్యాల్ని చూసి రామచంద్రమూర్తి నివారించబోయాడు.

"బాధపడటం లేదు మూర్తిగారూ, గర్విస్తున్నాను. శ్రీనివాస్ ఎంతో ఉత్తముడు. కాబట్టే, తనువు చాలించికూడా ఉపయోగపడుతున్నాడు" దుఃఖం ముంచుకురాగా శారద అంతకన్నా మరి మాట్లాడలేక పోయింది.

"నువ్వు మనిషివి మాత్రం కాదమ్మా! మానవేతరానివి. దేవతవి వయస్సులో చిన్నదానివైనా చేతులెత్తి మొక్కుతున్నాను. దేవుడు నిన్ను చల్లగా కాపాడ్తాడమ్మా!" రామచంద్రమూర్తి పరమానంద భరితుడై రెండు చేతులూ జోడించాడు కృతజ్ఞతగా!

"దేవుడు చెయ్యాల్సిన సహాయంచేసేశాడు. ఇప్పుడు నాకు కావలసింది మానవ సహాయం! మీ చెల్లెలు లాటిదాన్ని మూర్తిగారూ! మీ చేతులమీద శ్రీనివాస్‌ని మట్టిలో కలిపేస్తే అంతకన్నా నాకు కావలసిందేంలేదు. ఏనాటికైనా నేనే మీకు ఋణపడి ఉంటాను." శారద రెండు చేతులూ జోడించింది శ్రేయ పూర్వకంగా!

"ఋణం సంగతి మాట్లాడకు తల్లీ! ఆ మాట వర్తించేది నాకూ, నా చెల్లెలుకీ! రాధ జీవితంలో కొత్త వెలుగుని చూపించావు. నువ్వు మా ఇలవేల్పువి. నువ్వు చేసిన ఈ మహత్తర త్యాగం ముందు నేను చేసే సహాయం ఎంతమ్మా? నిజానికది సహాయం కాదు — బాధ్యత!

నా చేతుల్తో నేనే శ్రీనివాస్‌ని పంచభూతాల్లో మిళితంచేస్తాను నువ్వు బెంగపడకమ్మా! వెళ్దాం పదమ్మా! ఇప్పే పైపైపోతోంది అర్జంటుగా మనం 'ఐ హాస్పిటల్'కి వెళ్ళాలి"

* * *

'వెళ్ళొస్తాను మూర్తిగారూ, నాకు సెలవిప్పించండి!' అంటూ మరోసారి చేతులు జోడించింది శారద ఐ హస్పిటల్లో సొరాల మీద సంతకాలు పెట్టేసి బైటికి రాగానే!

"మీ చెల్లెలులాటిదాన్ని మూర్తిగారూ! అన్నావు నేనెంత సంబరపడిపోయానో తెలీదు. తోడబుట్టిన వాళ్ళం కాకపోయినా, అంతకన్నా మిన్న ఐన అనుబూతే మనది. నీకుమాత్రం ఎవరు...? మాతో ఉండిపోవమ్మా! నీకేలోటూ లేకుండా చూస్తాను." రామచంద్రమూర్తి కృతజ్ఞతాపూర్వకంగా అర్ధించాడు.

"లేదు మూర్తిగారూ! వెళ్ళిపోవాలి. మీ ఆదరణకి కృతజ్ఞురాల్ని. ప్లీజ్, నేనిక్కడ ఉండలేను దయచేసి అడ్డు చెప్పకండి!"

"పోనీలేమ్మా. మాతో ఉండిపోవడానికి నీకు మనస్కరించకపోతే, బలవంతంచెయ్యను గానీ, కొన్నాళ్ళైనా విశ్రాంతిగా మాతో గడిపి వెళ్ళిపోదువుకాని. నామాట మన్నించవూ?"

"మీకెలా చెప్పాలో అర్ధంకావటంలేదు మూర్తిగారూ! మనశ్శాంతీ, విశ్రాంతీ అన్నవి చాలా అరుదైనవి నా జీవితంలో. నిజానికి నేనింకా ఇక్కడే ఉంటే...అవి పూర్తిగా నోచుకునే పరిస్థితులే ఏర్పడతాయిగానీ... మనోధైర్యం అన్నదానికి ఆస్కారం అంటూ ఎక్కడ ఉంటుందో చెప్పండి...? నా శ్రేయస్సు కోరేవారు మీరు. నా పరిస్థితి అర్ధంచేసుకుని సెలవిప్పించండి...! వేడుకుంటున్నాను."

"మనశ్శాంతికోసం నువ్వు వెళ్ళిపోవాలనుకుంటే అడ్డు తగలనేనుకోమ్మా. కానీ, మంచికి మానవత్వానికి ప్రతిరూపమైన నిన్ను కనీసం దర్శించుకునే భాగ్యం, నా చెల్లెలుకి కూడా కలిగించవూ?"

'మీకు లోటు మూర్తిగారూ! ఎన్ని ఒడుదుడుకులున్నా మనశ్శాస్త్ర ధర్మాలూ, మూఢనమ్మకాలూ ఇంకా మన్ని వెంటాడుతూనే ఉన్నాయి భర్తపోయిన నన్ను ఏ పునిస్త్రీ ఈడదీ రా శ్రావణ మాసపు రోజుల్లో చూడాలను దు వేనొచ్చి ఆమెనే మాత్రం ఊరడించగలను చెప్పండి; లేనిపోని మనస్పర్ధలు కలిగించడం తప్పు...?"

ఆ మాటకి రామచంద్రమూర్తి కళ్లలో నీళ్ళు తిరిగాయి. అయినా నిలదొక్కుకుని ఉన్నాడు. "అంతమాట అనకు తల్లీ! సాటి మనిషిని అర్ధంచేసుకునే సంస్కారవతివి. నువ్వే నిటికి అమంగళిని కాదమ్మా!

స్వయంగా నీకు చేతులెత్తి జోహార్లర్పించందే నా చెల్లెలు మాత్రం తృప్తి పడగలదా? అందుకే అర్థిస్తున్నాను. దయచేసి ఒక్కసారి, ఆమెకా భాగ్యం కలిగించి వెళ్లిపోదువు గాని నా మాట మన్నించమ్మా!''

రామచంద్రమూర్తి అంత ప్రాధేయపడే సరికి శారదకి సరే అనక తప్పలేదు.

రామచంద్రమూర్తి శారదని ఇంటికి తీసుకువెళ్లి, చెల్లెలు రాధకి అప్పజెప్పి, శ్రీనివాస్ భౌతిక కాయానికి దహన సంస్కారాల ఏర్పాట్లకి మళ్లీ హాస్పటల్‌కి వెళ్లిపోయాడు వెంటనే!

* * *

''కథల్లో కూడా సాధ్యపడని త్యాగాన్ని చేశారు. సొంతవాళ్లు కూడా ఇంత సాహసించలేరు. మీ దంపతులిద్దరూ కారణజన్ములు శారదగారూ! మీకు ఎప్పుడూ ఋణపడే ఉంటాము'' కన్నీళ్లతోనే శారద కాళ్లు కడిగింది రాధ.

''తప్పమ్మా! ఏడవకూడదు. మన ఃపడి చేసుకోవాలనుకుని ఒకరికొకరు ముడిపడ్డ దంపతుల ఆనందం ఎలాంటిదో నాకు బాగా తెలుసు. అలాంటి జంట నూరేళ్లూ హాయిగా, ఆనందంగా సాగిపోవాలనే కోరుకుంటూ ఉంటాను. మరి వెళ్లొస్తాను రాధా!''

''వెళ్లిపోతావా అక్కయ్యా?'' దాదాపు చిన్న పిల్లలా అరిచింది రాధ.

శారద సూటిగా రాధ కళ్లలోకి చూసింది.

''అవునక్కయ్యా! అనూహ్యమైన ఈ బాధాపూరిత తన్మయానందాలలో నిన్నలాగే పిలవాలనిస్తోంది. అన్నయ్య అంతా చెప్పాడు కాబట్టి, పరిస్థితిని అర్థంచేసుకుని నువ్వు వెళ్లిపోతానంటే అడ్డుచెప్పి బాధపెట్టలేను గానీ, కనీసం మోహన్‌కి కట్లు విప్పేదాకా అయినా ఉండగలిగితే మాకెంతో నిండుగా ఉంటుందక్కయ్యా! ప్లీజ్!''

''క్షమించు రాధా! వెళ్లిపోవాలి. నేనేదో త్యాగం చేశానంటూ మీరంతా కృతజ్ఞతలు చెబుతూ నెత్తిమీద పెట్టుకోవడం సరి పెట్టుకోలేను. ఇక్కడఉంటే అనుక్షణం ఈ విషయాలే తలపుల్లోకి వచ్చి మిమ్మల్నీ నన్నూ కూడా మరింత కృంగదీస్తాయి. అందుకే వీలైనంత తొందరగా వెళ్లిపోవాలనుకుంటున్నాను. సాయంత్రం బండికే వెళ్తాను.''

రాధ మరి మాట్లాడలేకపోయింది. శారద ఆ విషయం మర్చిపోయేట్టు ఏవేవో సంగతులు చెప్పి మధ్యాహ్నం దాకా గడిపింది.

* * *

ఎర్రబడిన కళ్ళతో, రేగిపోయిన జుట్టుతో నీరసంగా అడుగులువేస్తూ వస్తున్నాడు రామచంద్రమూర్తి. రాధ గబాలున లేచి ఎదురు వెళ్ళింది. శారదమాత్రం గంభీరంగా అలా సోఫాలోనే కూర్చుండిపోయింది.

''కాసిని మంచినీళ్ళు!'' నీరసంగా అడిగాడు రామచంద్రమూర్తి. రాధ గబగబా లోపలికి వెళ్ళి మంచినీళ్ళు పట్టుకువచ్చింది.

మంచినీళ్ళు త్రాగి, నుదుటిమీద చెమటని రుమాల్తో తుడుచుకుంటూ గాద్గదికంగా అన్నాడు శారద నుద్దేశించి, 'ముత్యాల్లాంటి కంటిపాపలు తీసుకుని ఈ పాపిష్టి చేతుల్తోనే శ్రీనివాస్‌ని బుగ్గిపాలు చేసేసి వచ్చానమ్మా! భౌతికంగా శ్రీనివాస్ నీకు దూరమైపోయాడు...! ఇదమ్మా, నేను నీకు చేసిన సాయం...!'' రామచంద్రమూర్తి కనుకొలకుల్లోంచి నీళ్ళు సుళ్ళు తిరిగాయి. కళ్ళు మూసుకుని చేత్తో కణతలు నొక్కుకుంటూ సోఫాలో చేరబడ్డాడు.

నిశ్చలంగా, నిర్లిప్తంగా కూర్చున్న శారద పెదవి విప్పి మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నట్టు కిటికీవంక చూస్తూ ఉండిపోయింది, ఓ రెండు నిమిషాలు...!

''మీ సహాయం మరువలేను. ఋణం సంగతి ఎత్తితే ఈ జన్మకేకాదు; ఎన్ని జన్మలెత్తినా తీరేదికాదు! నాకు శెలవిప్పించండి మూర్తిగారూ, నాలుగ్గంటల బండిలో వెళ్ళిపోతాను.''

''ఇప్పుడా, ఈపరిస్థితుల్లోనా? వద్దమ్మా! అదీగాక మోహన్‌కి ఆపరేషన్ చేసి ఈ రాత్రి కళ్ళు అమరుస్తారని డాక్టరుగారు చెప్పారు. కాబట్టి అది అయిపోయి, కట్లు విప్పేదాకా అయినా ఉండి వెళ్ళిపోదువుగానీ. మాకెంతో తృప్తిగా ఉంటుంది. నా మాట కాదనకమ్మా!'' రామచంద్రమూర్తి వారించబోయాడు.

''నో...నో ఇంపాసిబుల్. పంపించేస్తానని మాటిచ్చారు. దయచేసి మళ్ళీ కాదనకండి...! నేను వెళ్ళిపోవాలి! ఇక్కడింక మరోక్షణం కూడా ఉండలేను'' శారద గట్టిగా అరిచింది.

క్షణక్షణానికీ శారద అంతర్యంలోని బాధ మరింత ఉద్ధృతమైపోతోందని గ్రహించిన రామచంద్రమూర్తి ఇక ఎదురు చెప్పలేకపోయాడు.

''సరేనమ్మా ఇవాళ సాయంత్రం బండికే వెళ్ళిపోదువుగానీ'' అంటూ సోఫాలోంచి లేచి బాత్‌రూమ్‌వైపు నడిచాడు, 'ప్రేమ'సనుకి బయటేద్దరడానికి.

* * *

''నీ ఔదార్యాన్ని లెక్క కడుతున్నానని మాత్రం అనుకోవద్దు, ఉంచమ్మా నీ ఖర్చులకిది'' అంటూ పర్సు చేతి కందించాడు రామచంద్రమూర్తి టికెట్‌తోపాటు.

మరోసారి నిర్లిప్తంగా నవ్విన శారద అందులో రెండు పదిరూపాయల నోట్లు తీసుకుని, 'చాలు వెళ్లిరండి! మళ్లీ ఆపరేషన్‌కి లేటైపోతోంది' అంది.

''ఫరవాలేదు'' రైలు రాగానే ఎక్కించి వెళ్తాము' అన్నారిద్దరూ.

''రైలు రావడానికింకా ఆలస్యం ఉంది. దయచేసి వెళ్లిరండి'' అన్నది శారద.



గుండెనిండా నిండిపోయిన బాధతో కృంగిపోతున్న ఆమె ఏకాంతాన్ని ఆశిస్తోందని గ్రహించిన రామచంద్రమూర్తి 'అలాగేనమ్మా!' అనే లోపల 'వెళ్లొస్తానక్కయ్యా!' బొంగురుపోయిన కంఠంతో చేతులు జోడించిందిరాధ.

"చనువు తీసుకుంటున్నానని అనుకోకు శారదా! రాధలాటి దానివి. జరిగింది మర్చిపోయి హాయిగా పెళ్లి చేసుకుని వర్ధిల్లాలని నా ఆశ. నీ ఔదార్యం, నీ మంచితనం, ఎప్పుడూ నిన్ను కాపాడుతూనే ఉంటాయి. అయినా, జీవితంలో ఏ అవసరమొచ్చినా ... ఈ అన్నయ్యని మాత్రం మర్చిపోకు — గుడ్‌లక్ !" దుఃఖం పొంగిరాగా తడబడుతూ గాద్గదంగా అని రామచంద్రమూర్తి కళ్లజోడు తీసి, చెమర్చిన కళ్లను తుడ్చుకుని, 'వెళ్లొస్తానమ్మా !'అని చేతులు జోడించాడు.

హృదయపూర్వకంగా నమస్కరించింది శారద.

రాధా, రామచంద్రమూర్తి వెనుదిరిగి వెళ్లిపోయారు. వెళ్లిపోతున్న వాళ్లనూ తదేకంగా చూస్తూ ఉండిపోయింది శారద.


మరో పదినిమిషాల్లో ఎనౌన్స్‌మెంట్; ఎక్స్‌ప్రెస్ నాలుగ్గంటలు లేటని... !

* * *

గంట గడిచేసరికి బ్రహ్మ ప్రళయమైపోయింది శారదకి. ఏకాంతం కోసం రామచంద్రమూర్తినీ రాధనీ పంపించేస్తే ... ఒంటరిగా మిగిలిన తన్ని ఆలోచనలు మలి స్తిమితం లేకుండా చేస్తున్నాయి. ఆ ఆవేదన భరించలేని శారద కాస్త చల్లగాలి కోసం స్టేషన్ బైటికి వచ్చి ... ఎదురుగాఉన్న పార్కువైపు దారి తీసింది.

పార్కు సెంటర్లో జనం గుమిగూడి ఉన్నారు.

"ఒక్కగానొక్క కొడుకుబాబూ! ఈ ముసలాడ్నిలా గర్భశోకంలో ముంచేసి వెళ్ళిపోయాడు. కళ్ళ ఆపరేషనుకని వస్తే...ఇలా కలరావచ్చి దాటిపోయాడు ముసరి ముండా కొడుకుని. నా తలకొరివి పెట్టేవాడ్ని, నేనే బూడిద చెయ్యాల్సొచ్చింది. ఎరని ఏగానీ లేదు చేతిలో. ఎలాసాగనంపేది నా బాబుని...? కరుణగల తల్లులు. దయగల తండ్రులు, మీ తోడబుట్టిన వాడనుకుని మీరే తలో చెయ్యా వెయ్యాలి..." తలమీద రెండు చేతులూ పెట్టుకుని పిచ్చిగా అరుస్తూ రోదిస్తున్నాడో వృద్ధుడు.



అదృష్టం జారిపోదు

గుమిగూడిన జనం ప్రక్కనుంచే పార్కులోకి దారితీస్తున్న శారద వృద్ధుడి ఆర్తనాదం విని అచేతనంగా ఆగిపోయి, కర్తవ్యం బోధించినట్టు, జనాన్ని తప్పించుకుని, పర్సులోంచి పదిరూపాయలనోటు తీసి వృద్ధుడి చేతిలో పెడుతూ, అతడ్ని చూసి దిగ్భ్రాంతి చెంది, నోటమాట రాక, రెండడుగులు వెనక్కివేసి.... అప్రయత్నంగా శవాన్ని చూసి నఖశిఖపర్యంతమూ కలిగిన గగుర్పాటుకి కళ్ళు బైర్లుకమ్మగా, అసంకల్పితంగా మరో రెండడుగులు వెనక్కివేసి... ఆ! శ్రీనివాస్...! ఆ! శ్రీనివాస్! అంటూ కుప్పలా కూలిపోయింది.

'భగవాన్ నన్ను అంతం చెయ్యలేవా? ఈ క్షణంలో గుండె నాపలేవా?' అంటూ క్రితంరోజు ఆమె చేసిన ఆక్రందనలు ఇప్పుడు విన్నాడేమో...భక్తి పరిపక్వమైన భక్తురాలికి మోక్షసిద్ధి చేసినట్టు, భగవంతుడామెను స్వీకరించాడు.

'ఎవరో పాపం ఆడకూతురు. నడుస్తూ నడుస్తూ గుండెఆగి పడిపోయింది. పాపం పడిపోతూ కూడా ఆ భగవంతుడ్నే స్మరిస్తూపోయింది. అదృష్టవంతురాలు ...!'

జనం ఆమె చావుని సమీక్షించి సానుభూతి వ్యక్తం చేశారు

* * *

నిజమే ..!

శారద అదృష్టవంతురాలు...! ఎంతో అదృష్టవంతురాలు!

కేవలం తనపట్ల సానుభూతి వ్యక్తం చేసి క్రితం రోజు ఐదురూపాయలు చేతిలో పెట్టిన ముసలాడే ... ఇవాళ శ్రీనివాస్ తండ్రి అవతారం ఎత్తి సాక్షాత్కరించిన మరు క్షణంలో దాటిపోయింది.

నిజానికి మోహన్ అనేవాడు లేనేలేడనీ, చచ్చిపోయిన మనుషుల్ని సహితం మోసం చేసి బ్రతికే కూటానికి రామచంద్రమూర్తి నాయకుడనీ, రాధ అతని చెల్లెలుకాదు; కేవలం ఉంపుడుకత్తె అనీ, శ్రీనివాస్ కంటిపాపలు ఖరీదైన శేఠ్‌కి ఐదువేలకి అమ్మేడుపోగా ... శరీరాన్ని ముసలాడు వందరూపాయలకి కొనుక్కున్నాడనీ... శారద తెల్సుకోకుండానే దాటిపోవడంలో కొంత అదృష్టవంతురాలనుకోవాలి !

అలా గాక.


తెల్సుకునుంటే 'నా సమ్మతిన నా భర్త కళ్ల దానం చేస్తున్నాను' అని హాస్పటల్లో కాగితంమీద రాసిచ్చినందుకు నోరెత్తే అవకాశంలేక, జుట్టు పీక్కుని పీక్కుని, చావలేకా బ్రతకలేకా, మతి చెలించి పిచ్చెక్కిపోయేది — ఇలా జరగలేదు కాబట్టి మరి కొంత అదృష్టవంతురాలనుకోవాలి !

అన్నిటికన్నా మిన్నగా రామచంద్రమూర్తి కల్పిస్తానన్న ఆశ్రయాన్ని తిరస్కరించడంలో పొరపాటున కూడా సూర్యరశ్మి సోకని పాతాళ గృహంలో, భయంకరమైన బలవంతపు వేశ్యా యోగం తప్పినందుకు మరింత అదృష్టవంతురాలూ, ఎంతో అదృష్టవంతురాలూ అనుకోవాలి...!

* * *

ఇరవై నాలుగ్గంటలు నిరీక్షించి దిక్కులేని జీవి క్రింద జమకట్టి ఆమె శవాన్ని మునిసిపాలిటీవాళ్లూ, నిర్జీవుడైన శ్రీనివాస్‌ని స్థలాలు మార్చి, మార్చి అడుక్కుని ముష్టివాళ్లూ, అన్నదమ్ముల్లాగా, ఐకమత్యంతో దాదాపు ఒకే సమయంలో తమ కర్తవ్యం నిర్వహించుకున్నారు స్మశానంలో !

'ఎప్పటికీ కలిసే ఉంటాము' అని ప్రమాణ చేసుకుంటున్నప్పుడు గుళ్లో బండరాయి వినలేదనీ, చూడలేదనీ కాబోలు; మరోసారి దేవుడితో 'కష్టాల్లో, సుఖాల్లో మాత్రమే కాదు; చావులోకూడా కలిసే ఉంటాము' అని చెప్పడానికి అమరలోకానికి వెళ్తున్నట్టుగా ప్రక్క ప్రక్కన మండేచితిలో మంటలు ఒకటిగా కలిసిపోయాయి !



అందాలు చిమ్ముతూ
ఆకర్షణ వెద చల్లితే



మీదారి పొడవునా
చూపుల తోరణాలే!

లాక్మే వానిషింగ్ క్రీం మీ సౌందర్యానికి రాచబాట. మంచులో తడిసి, తొలికాంతిలో విరిసిన పూవులా మిమ్మ చేస్తుంది.

శ్రేష్ఠమైన మేకప్‌కు ఆదర్శవంతమైన ఆధారము లాక్మే వానిషింగ్ క్రీం. దీనిపై పౌడరు చాలాసేపు హత్తుకొనివుంటుంది.

ఎంతో తేట అయింది, ఎంతో సహజమైంది; అయినా ఎంత మార్పును తెస్తుంది.

లాక్మే వానిషింగ్ క్రీం

అద్దుకొన్న పౌడరును హత్తుకొని వుంచుతుంది.



మీ సౌందర్య పోషణ మా ఏకైక ఆశయం

లాక్మే

dCP LVC 2 6 Tel

యాదృచ్ఛికం



మల్లాది వెంకట కృష్ణమూర్తి

గంగరాజు కారోజు ఎదురయిన సమస్య కొత్తదేం కాదు. బాగా పాతదే. గంగరాజు ఆఫీసర్ ఆ ఆఫీసుకు బదిలీఅయి వచ్చినంత పాతదా సమస్య. ప్రతీసారి ఆ సమస్యకి ఏదో ఓ పరిష్కారం దొరుకుతూనే వుంది గంగరాజుకి.

అంత పెద్ద సమస్య కాకపోయినా, ఒకోసారి అది కొండంత సమస్యగా అనిపిస్తూంటుంది గంగరాజుకి.

అడిగినప్పుడు, అడిగినంత సెలవు మంజూరు చెయ్యడు గంగరాజు ఆఫీసర్. తను ఆఫీసర్‌గా గుర్తింపబడాలంటే, సెలవు మంజూరు చేయకుండా తను ఆఫీసరనే నిజాన్ని గుర్తుచేయాలనుకునే స్వభావం ఆయనది, బహుశ.

దగ్గరే ఉన్న అజంతా, ఎల్లోరాలని, నాలుగైదు రోజులు బొంబాయిని చూడాలని సంసిద్ధమయ్యాడు గంగరాజు. కేవలం ఆరు రోజులే కాబట్టి సెలవు దొరకకపోతుందా అనే ధీమాతో అన్ని ప్రయత్నాలు చేసేసాడు, రైల్వే టిక్కెట్ రిజర్వేషన్‌తో సహా.

గంగరాజు సెలవ అడగబోయే ముందురోజే మరొకతను సెలవడిగితే, రెండురోజులుకూడా సేంక్షన్ చేయలేదా దుర్మార్గపు ఆఫీసర్. గంగరాజు గుండెల్లో రాయి పడ్డట్టయింది.

మామూలు పరిస్థితులలో సెలవు ఇవ్వడని గ్రహించాడు గంగరాజు. స్వంత వూరునుంచి దొంగ 'సెలవు టెలిగ్రాం' తెప్పించే వ్యవధి కూడా లేదు. తీవ్రంగా ఆలోచించాడు గంగరాజు.

మర్నాడు వుదయం నేరుగా టెలిగ్రాఫ్ ఆఫీస్‌కి వెళ్ళి, అక్కడ పనిచేసే ఓ పాత పరిచయస్థుడి స్నేహితుడిని కాళ్ళా వేళ్ళా బతిమాలి, తన వూరునుంచి టెలిగ్రాం వచ్చినట్లుగా ఇంటి చిరునామాకి, ఓ టెలిగ్రాం తయారు చేయించుకున్నాడు.

ఎర్ర కాగితంమీద అంటించిన తెల్ల కాగితపు పీలికలమీద, 'ఫాదర్ సీరియస్. స్టార్ట్ ఇమ్మీడియట్లీ' అన్న వార్తని, తన సెలవు అప్లికేషన్‌కి జతచేసి పంపించాడు ఆఫీసర్ గదిలోకి.

సెలవు మంజూరయింది. ఆఫీసర్ ఏకళనున్నాడో, 'గుడ్‌లక్' అనికూడా వ్రాసాడు. ఎగిరి గంతేసాడు గంగరాజు. వారంరోజులు ఇక ఆఫీస్‌మొహం చూడక్కరలేదు.

గంగరాజు ముందు అనుకున్న విధంగా, అజంతా, ఎల్లోరా, బొంబాయి చూశాడు. తనతో తీసుకెళ్ళిన కెమెరాతో నాలుగురీళ్ళు ఫోటోలు తీశాడు, రీలుకి పన్నెండు ఫోటోలు చొప్పున.

శుక్రవారంనాడు బొంబేలో, దీపాలు పెట్టేవేళ, గేట్ వే ఆఫ్ ఇండియా దగ్గర, వర్షం పడుతూంటే తలదాచుకుని, లైట్లతో వెలిగిపోతున్న తాజ్‌మహల్ హోటల్‌ని చూస్తూంటే ఎవరో గంగరాజు భుజంమీద చేయివేసి తెలుగులో పలకరించారు.


అతన్ని చూడగానే గంగరాజు రాతైపోయాడు. "ఎప్పుడొచ్చారు? ఎప్పుడెల్తారు?" అడిగాడతడు నవ్వుతూ.

"మ...మ...రే..." గొణిగాడు.

స్వయానా తన ఆఫీసర్ బావమరిది అప్రాచ్యుడు. బావకోసం ఆఫీస్‌కి ఎన్నోసార్లు వచ్చి, గంగరాజుని చూసాడు. తనని ఇక్కడ చూసిన సంగతి ఆయనకి వూదేస్తే...?

177* రూపాయలకు మాత్రమే
బ్రహ్మాండమైన, స్పష్టమైన శబ్దం

177* రూపాయలకు మాత్రమే
తక్కువ బ్యాటరీ ఖర్చు, అందమైన ఆకారం



2 బ్యాండ్ల నెల్కో తాపీ

ఈ విషయాలను పరీక్షించి చూసుకోండి –
నెల్కో తాపీ యొక్క 950 mW మేక్సిమమ్ ఔట్‌పుట్ మీకు బ్రహ్మాండమైన శబ్దాన్ని యిస్తుంది.
నెల్కో తాపీ షార్ట్‌వేవ్ సెన్సిటివిటీ 10-20 µV/m వలన రేడియో స్టేషన్ ఎంత దూరంగావున్నా, మీకు స్పష్టంగా వినిపిస్తుంది.
నెల్కో తాపీ యొక్క కరెంటు (Iq) కేవలం 16 mA గనక, రేడియో బ్యాటరీలు ఎక్కువ కాలం మన్నుతాయి.
214 రూపాయలకైనా సరే మీకు, బజార్లో యింతకన్న మంచి రేడియో దొరకదు.
ఇంకా 14 రకాల, ఇంత మంచి రేడియోలు, మీ నెల్కో డీలర్ దగ్గర దొరుకుతాయి.

నెల్కో–ప్రియ మిత్రసమానం అతి విశ్వాసనీయం

*ఎక్సయిజ్ పన్నులతో, సహా, స్థానిక పన్నులు అదనం.

Creative Unit-A 1988

ది నేషనల్ రేడియో & ఎలక్ట్రానిక్స్ కం. లిమిటెడ్,

8092/1-2, రాష్ట్రపతిరోడ్డు, సికింద్రాబాద్ 500003.

ధర్మపథం | కలకాలం నిలిచే గ్రంథం

ఆ మధ్య ఒక సుప్రసిద్ధ విమర్శకులొకరు ఈ శతాబ్దంలో వెలువడిన గ్రంథాలలో ఏవి నిలవగలవో — తమ అభిప్రాయానుసారం వివరించారు. కొందరి రచనలు ఆ పట్టికలో చేరనందున ఆ రచయితలకు ఎక్కువ అసంతృప్తి కూడా కలిగింది.

రచన బాగా ఉంటే పదిమందీ మెచ్చుకుంటారు. శక్తి ఉన్న అభిమానులు సమ్మానాలు జరిపిస్తారు. పుస్తకం ఎలా ఉన్నా, అధికారుల పలుకుబడీ, శ్రీమంతుల అభిమానం ఉన్నప్పుడు తాత్కాలికంగానైనా ముఖప్రీతి కయినా అభినందనాలు, సమ్మానాలు లభించవచ్చును. వీటిలో ఏవీ స్థిరంగా నిలవగలవని చెప్పలేము. పుస్తకాలకు చాలా ఎక్కువ ప్రతులను అచ్చువేసి, బహుళ ప్రచారం చేసినా, గ్రంథాన్ని భద్రంగా దాచిపెట్టినా—అవి కలకాలం నిలవగలవని చెప్పలేము. వ్రాత పుస్తకాలు కొలదిగా ఉండడంవల్ల, అచ్చు పుస్తకాలు అధికంగా ఉండడంవల్ల ముద్రిత గ్రంథాలు ప్రచారం పొంది, స్థిరంగా ఉంటాయని చెప్పలేము.

గ్రంథం చిరకాలం ఉండడానికి అచ్చుపడడం గాని, వ్రాత ప్రతిగా ఉండడంగాని, నలుగురి ప్రశంసలూ పొందడంగాని కారణం కానేకాదు.

అనాదులని చెప్పబడుతున్న వేదాలు ఇప్పటికీ నిలిచిఉన్నవి. ఇకమీదా నిలుస్తాయి. అధ్యయన, అధ్యాపనల మూలంగా వాటికి స్థిరత్వం సిద్ధించింది.

గురువు శిష్యునికి బోధిస్తే, ఆ శిష్యుడు తన శిష్యులకు బోధిస్తూ — పరంపరగా ఈ సంప్రదాయం సాగుచున్నందున అవి స్వర లోపం లేకుండా నిలిచి వున్నాయి. ఇట్లే మహామునుల సూత్రగ్రంథాలు, స్మృతులు, దర్శనాలూ కూడా లిపిసంబంధం లేకుండానే స్థిరంగా ఉన్నాయి అంతేకాక— వ్రాతరూపంలో ఉండిన కాళిదాసాది మహాకవుల కావ్యాలు, నాటకాలు, లక్షణగ్రంథాలు చివరికి నిఘంటువులు కంఠస్థం అయినప్పుడే స్థిరత్వం పొందగలిగాయి.

పూర్వపు లిపులు ఇప్పుడు లేవు. కాలాన్ని బట్టి వాటిలో మార్పు వస్తూనే వుంటుంది. నన్నయనాటి తెలుగులిపికి, ఇప్పటి తెలుగు లిపికి ఎంతో వ్యత్యాసం ఉన్నది. లిపులు మారినా గ్రంథాలు మారవు. కారణం అవి పాఠ ప్రవచనాలలో ఉండడమే! ప్రసిద్ధ గ్రంథాలను ఆ యా ప్రాంతాలవారు ఆ యా లిపులలో వ్రాసుకుని చదువుకుంటున్నారు.

గ్రంథం నాలుగు కాలాలపాటు నిలవడానికి అది పాఠ, ప్రవచనాలలో వుండాలి. స్త్రీల పాటలు వ్రాతలోగాని, ముద్రణలోగాని లేకున్నా ప్రచారంపొంది పరంపరగా వస్తున్నవి. పాఠ ప్రవచనాలలో ఉన్నవే స్థిరంగా ఉంటాయి. గ్రంథం పాఠప్రవచనాలలో ఉండాలంటే అది కొందరి ఆమోదాన్ని పొందితే చాలదు. జన సామాన్యపు ఆదరాన్ని చూరగొనాలి.

బులుసు వేంకటరమణయ్య

కొత్త సీరియల్
శ్రావణ సంధ్య
త్వరలో ప్రారంభం!

యాదృచ్ఛికం

గంగరాజు వర్షంలో తడుస్తూనే పరిగెత్తాడు శివాజీ విగ్రహంవైపు, తన ఆఫీసర్ బావమరిదికి సరయిన సమాధానం ఇవ్వకుండా.

సోమవారం పుదయం నాంపల్లి రైల్వే స్టేషన్లో దిగాక, గంగరాజుకి మళ్ళీ భయం మొదలయింది. ఆఫీస్కి నిర్లిప్తంగా వెళ్ళాడు. ఆఫీసర్కి ఈపాటికి తనుఆడిన అబద్ధం తెల్సిపోయి వుంటుందా? ఆ బావమరిది ఆదివారం చేరుకునుంటే, తనకన్నా ఓరోజు ముందుగా ?......భయం క్రమంగా తగ్గింది.

ఆఫీస్లో అడుగుపెట్టాక మళ్ళీ భయం మొదలయింది గంగరాజుకి. పావుగంట తర్వాత ప్యూన్ వచ్చి చెప్పాడు, ఆఫీసర్ పిలుస్తున్నారని.

గంగరాజు కాళ్ళు తడబడుతూంటే ఆఫీసర్ గదిలోకి అడుగుపెట్టాడు మేకపిల్లలా. ఆఫీసర్ పులిలా చూడలేదు.

"ఐయామ్ సారీ మిస్టర్ గంగరాజు." అంటూ గంగరాజు చేతిలో వుంచాడు ఆఫీసర్ రెండు కాగితాలని.

టెలిగ్రాంలు ఆ రెండూ. రెండూ ఇంటి నుంచి వచ్చినవే, గంగరాజు స్వగ్రామంనుంచి.

"ఫాదర్ సీరియస్. స్టార్ట్ ఇమ్మిడియట్లీ." అన్న ఆ మొదటి టెలిగ్రాం సరిగ్గా గంగరాజు శెలవుమీదవున్న మొదటిరోజు వచ్చింది, ఔరంగాబాద్లో గంగరాజు వున్నప్పుడు.

"సారీ. ఫాదర్ ఎక్స్పైర్డ్" అన్నది రెండవ టెలిగ్రాం గంగరాజు స్వగ్రామం నుంచి, గంగరాజు శెలవమీదవున్న అయిదవ రోజు, శుక్రవారం చేరింది ఆఫీస్కి — బొంబాయిలో వున్నప్పుడు.

తట్టుకోలేక, గంగరాజు ఆఫీసర్ ఎదురుగా వున్న కుర్చీలో కూలబడ్డాడు.

హైదరాబాద్ నోట్బుక్

(6వ పేజీ తరువాయి)

పత్రికా రచయిత గుణకర్మలు. ఇవి పూర్తిగా ఉన్నవాడు భీమ మహాకవి. కనుకనే సంవత్సరానికి రెండు కావ్య కన్యలకు వివాహాలు చేస్తున్నాడు. మిత్రులు, సహృదయులు శ్రీ జె. బాపురెడ్డి ఈ బొమ్మను స్వీకరించిన నెమ్మదితో ఇదే నా మొదటి ప్రతిభా ప్రోత్సాహం, ఇక వద్దు అన్నారు. కావ్య కల్యాణాలకు ప్రభుత్వ నిషేధం లేదుగదా!

బొమ్మ కావ్యం కాళిదాసు మేఘ సందేశం లాగ ఉందని డాక్టర్ దివాకర్ల, ఆధ్యాత్మిక దృష్టి తొణికిసలాడుతున్నదని డాక్టర్ నాయని కృష్ణకుమారి, ఇరం మంజిల్లో వెలువడిన కావ్యంలో స్వర్గసుగంధాలున్నాయని శ్రీ దాశరథి, మువ్వలకత ముప్పిరిగొన్నదని శ్రీ మాలె కొండయ్య, డాక్టర్ ఆరిపిరాల విశ్వం ప్రసంగించిన మీదట శ్రీ పాలగుమ్మి విశ్వనాథం బొమ్మలోని కొన్ని గేయాలను కమ్మగా పాడారు. శ్రీ దేవులపల్లి రామానుజరావు స్వాగత వాక్యాలలో ఆరంభమైన సభ ఆయన కృతజ్ఞతా వచనాలతోనే సమాప్తమయింది.

ఉపశ్రుతి:

"ఏమిటండీ, 'ఆంధ్రప్రదేశ్ అవతరించి ఎన్నో ఏళ్లయినా, తిరుమలై దేవస్థానం, పెన్నారు నదివంటి మాటల ఉచ్చారణ మారలేదు?" అని అడిగాడు ఒక అధికార భాషాభిమాని. నేను సమాధానం చెప్పేంతలో పక్కన ఉన్న పెద్దమనిషి "అయ్యా, అది కాంపోసిట్ మద్రాసురాష్ట్రం వాసన. పిల్ల వచ్చినా పుట్టింటి పెంపు చాలా నే నామెత ఉందిగదా!" అన్నారు.


"బాబు పొడుగ్గా, వెడల్పయిన భుజాలతో, గట్టి, తెల్లని పళ్ళతో పెరుగుతాడు."

"ఎందువల్లనంటే, నేను కాల్షియం-శాండోజ్ తీసుకుంటున్నాను గనుక"

మీ పసిపాప పళ్ళూ, ఎముకలూ మీరు గర్భిణీతో ఉన్నప్పుడే తయారవటం మొదలెడతాయి. అప్పుడే పాపకు కాల్షియం అత్యవసరం. దానిని మీరే యివ్వగలరు. తేలికైన కాల్షియం-శాండోజ్ పద్ధతిలో.

రోజుకు మూడు సార్లు 3-4 బిళ్ళల చొప్పున కమ్మని, రాస్ప్బెరీ రుచి కలిగి విటమిన్లు సి, డి మరియు బి$_{12}$తో పుష్టివంతం చేయబడిన కాల్షియం-శాండోజ్ బిళ్ళలను చప్పరించండి. మీ పాప గట్టి పళ్ళూ, పటిష్టమైన ఎముకలూ కలిగినదిగా తయారు అవుతుంది. మీకు కాల్షియం లోపంగాని, కాళ్ళు పట్టటంగాని, కండరాల నొప్పిగాని ఉండదు.

శాండోజ్‌ను విశ్వసించండి—వారు ప్రపంచంలో శుద్ధమైన కాల్షియం తయారీ చేయడంలో ముందంజ వేసారు.





dCP/CS/9dTel

డాక్టర్ సలహాలు

ఎ. ఎల్. — విజయవాడ

మా బాబుకు ఇప్పుడు 3 నెలలు. ఇంతవరకు పోలియో డ్రాప్సుగాని, బి. సి. జి. గాని, టీకాలు గాని వేయలేదు. ఏవి ఎప్పుడెప్పుడు వేయించాలో తెలియజేయండి.

టీకాలుగాని, ఇతర రోగ నివారిక ఇంజక్షన్లు, మందులుగాని పిల్లలకు, కాల, దేహ పరిస్థితి మీద, ఆధారపడి వేయించవలసి ఉంటుంది.

సాధారణంగా, 3 వ నెలలోగాని పుట్టిన వెంటనేగాని, టీకాలు (మశూచి నిరోధకానికి) వేయటం జరుగుతున్నది బి. సి. జి. (క్షయ నిరోధకం) పిల్లలు పుట్టిన వెంటనే ఎంత త్వరగా వేయిస్తే అంతమంచిది. వయస్సు పైబడినకొద్దీ ఇతర పరీక్షలు చేసిగాని, ఈ ఇంజక్షన్ వేయటం కుదరదు.

'ట్రిపుల్ యాంటీజన్—(కోరింతదగ్గు, ధనుర్వాతం, డిఫ్తీరియా నిరోధకాలు) నెలకొకమారుగా 4 వ నెలనుంచి, 3 సార్లు వేయించవలసి ఉంటుంది. కొందరు ఇదే సమయంలో, అదేరోజునె పోలియో డ్రాప్స్ 3 మార్లు వేయిస్తారు. (నోటిలో), లేకపోతే 6, 7, 8 వ నెలలో, 6 వారాలకొకమారుగా 3 సార్లు వేయటం మామూలు.

జి. ఎస్. — ఖర్గపూర్

మా బాబు వయస్సు 10 నెలలు. విరోచనాలు సరిగ్గా అవుటలేదు. గట్టిగా ఉంటున్నవి. మరే ఇతరమైన బాధలేవీ అవుపించటం లేదు. ఇప్పుడు ఫారెక్సు గూడా పెడుతున్నాము.

పదినెలల పిల్లలకి విరేచనం సరిగా అవకపోవటం, ఆహారంలో లోటున్నట్లు సూచించడం మాత్రమే అని ఎక్కువగా కనబడే లేక నిర్ణయించబడు కారణం.

అవుపాలు, ఫారెక్స్ పెట్టడం సరియే అయినా, వీటిని నీళ్లతో మిశ్రమం చేయుటంలో తగిన జాగ్రత్త అవసరం. పాలు మొదలయినవి నిర్ణీత కాల ప్రకారం ఇవ్వాలి, మధ్య మధ్య—బాగా కాచి చల్లార్చిన నీటితో అరు అవున్సులకి మూడు చెంచాల గ్లూకోజ్ పంచదార వేసి పట్టిస్తూ ఉంటే విరేచనం సాఫీగా అవుతుంది. ఇలా బాగా బట్టి రోజుకి 2, 3 పర్యాయాలు ఈ గ్లూకోజు నీళ్ళు ఇవ్వవచ్చును.

ఎస్. ఎస్. కె. — కొమరగిరిపట్నం

నా ముఖం ఎప్పుడూ జిడ్డుగా వుంటుంది. అందువిహీనముగా వుంటాయి. ఇవి తగ్గటానికి ఏమైనా ఉపాయము వున్నదా?

ఇదేదో సిగరెట్టు ప్రకటనలాగా—అందానికి చిట్కాల శీర్షికకు ప్రశ్నలా కనబడుతోంది. మీరు వ్రాసిన ప్రశ్న నాకు అర్థం కాలేదు కదా! మీరు, ఏ "సిగరెట్" లేక ఇతర అందాన్ని వికాసం కలిగించే సంస్థలో కలుసుకొంటే తగిన ఫలితం ఉంటుంది.

పాఠకులు, దయచేసి, ఇటువంటి ప్రశ్నలు పంపి, పోస్టు ఖర్చులు, మీ అమూల్యమైన కాలం వృధా చేయవద్దని, ఒకవేళ ప్రశ్నలు పంపినా, ఈ శీర్షికలో సమాధానాలు ఇవ్వటం జరుగదని మనవి!!

కె. యస్. ఆర్. — రాజమండ్రి

నా వయస్సు 22 సం.లు పుట్టినప్పటినుండి నాకు దొడ్డి కాళ్లు వచ్చినవి. దొడ్డి కాళ్లు రావటానికి కారణము, ఇది ఏర్పడకుండా వుండటానికి ఏదైనా శస్త్ర చికిత్స వున్నదో వ్రాయండి.

పుట్టుకతోనే దొడ్డికాళ్ళు రావటం అనేది ఉన్నా అలా అవటం చాలా అరుదు. పుట్టిన తర్వాత విటమిన్ 'డి' లోపం మొదలయిన వాటివల్ల ఎముకలు మెత్తబడి, వంగటం జరుగుతుంది. దీనినే వ్యవహారికంగా దొడ్డికాళ్లు అంటారు.

ఇది కనబడకుండా చేయటానికి కొన్ని ముఖ్య కేంద్రాలు మద్రాసు, బొంబాయి, ఢిల్లీ మొదలయినచోట్లలో "ఆర్థోప్లాస్టీ" అనే చికిత్సవల్ల నయమవుతుంది.

— డా॥ కె. వెంకటేశ్వరరావు

పుకార్లు పుట్టించవద్దు
పుకార్లు నమ్మవద్దు

ఉత్తరాలు

(5 వ పేజీ తరువాయి)

కథలు

"పుట్టాలు వస్తారు జాగ్రత్త" అన్న వోగిరాల పద్మారాణి" గారి కథ నేటి సామాన్య కుటుంబికుల అవస్థను తెలుపుతున్నది. 'అంత చక్కని' కథని ప్రచురించినందుకు మీరు అభినందనీయులు.

ఆండాల్, నరసింహం, పద్మ, గోపాల్, [illegible]దేవి, గోపీనాథ్, హరిప్రియ, జయలక్ష్మి. (చిత్తూరు)

* * *

"కలం మనిషి ఎక్కడుంటే లోపం" కథలు నిజానికి చాలా దగ్గరగా ఉన్నాయి. ఒక కొత్త వెరైటీ ఉన్న ఇలాంటి కథలు ఇకముందు కూడా ఉంటాయని తలుస్తాను!

'మ. జా' (విజయనగరం)

* * *

సుజాత ముఖచిత్రము గల మీ పత్రికలో చందుసోంబాబుగారి కథ 'దేవుడు లేని చోటు' వాస్తవానికి దగ్గరగా ఉన్నా కథలో అడవిలో తిరిగే క్రూర మృగాలనైనా నమ్మవచ్చును కాని ఈ మృగజాతిని నమ్మరాదని వ్రాసినారు. అందరు అట్లుండరుకదా!

ఈ. ఉదయకుమార్ (పాలంగి)

సినిమా

శ్రీనివాస్‌గారు సినిమా విషయాలు వ్రాస్తూ 'క్షేత్రయ్య' పిలక బ్రాహ్మడు కాదనిరెండు మూడు సార్లు వ్రాసారు. పిలకపెట్టుకొనుట గౌరవనీయము కాదనియూ, పిలక బ్రాహ్మడు అనగా [illegible] అనియూ వీరి అభిప్రాయంగా తోస్తోంది. పూర్వం ఒక్క బ్రాహ్మణులే కాకుండా అన్ని జాతుల వారు పిలక పెట్టుకొనేవారు. దాని తరువాత క్రాపులు వచ్చాయి. అనిపోయి హిప్పీ గిరజాలు వస్తున్నాయి. ఆ ఆ కాలపు సాంప్రదాయాలు వాటిని 'అగౌరవ' పరచడం బాగాలేదు. వెనుకటి సాంప్రదాయాలను గౌరవించాలి కాని హీనంగా చూడరాదని శ్రీనివాస్ గారికి మనవి.

తి. మోహనరావు (హిందూపూర్)

అవీ—ఇవీ—అన్నీ

వివాహం

విజయవాడ శ్రీ రామాటాకీస్ అధినేతలలో ఒకరయిన శ్రీ టి. వెంకయ్యనాయుడుగారి తృతీయ పుత్రుడు చి. డాక్టర్ రామప్రసాద్‌కు, విజయవాడ వాస్తవ్యులు శ్రీ వో. ఎస్. రావు గారి కుమార్తె చి. సౌ. డాక్టర్ రాజ్యలక్ష్మికి ఆగస్టు 10వ తేది ఉదయం విజయవాడలోని ఫిల్మ్ ఛాంబర్ హాలులో వైభవంగా వివాహం జరిగింది. సినిమారంగానికి చెందిన పలువురు, బంధుమిత్రులనేకమంది హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

nted and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3 Editor: S. Radhakrishna

హాయిగా వేసి చదువులో చేర్పించాడనీ మనస్సులో ఎంతగా కుమిలి కుమిలి బాధపడేది ఆ రోజుల్లో?... ఒక్కో రోజున ఏ సముద్రంలోనో పడి చావాలనీ, "నే నింక పెళ్లి చేసుకోకుండా ఆగలేను... నేను కోరుకున్న ప్రభాకరం ఇంకో అయిదేళ్ళదాకా పెళ్లి చేసుకోను అంటున్నాడు... నేనీ నరకంలాంటి విరహాన్ని అనుభవించలేక ఈ విషం తీసుకున్నాను" అని కసిగా ఓ చీటీ రాసిపడేసి ఏ సైనైడో మింగుదాం అనీ ఎన్నిమార్లు అనుకోలేదు... ఇప్పుడలా ఛస్తే బెంబేలు పడుతుందా తను?... ఒకవేళ ఆ ప్రభాకరమే వచ్చి "ఉషా మనం పెళ్లి చేసుకుందామా?" అని ఇప్పుడడిగితే, ఫైనలియర్ అయి హౌస్ సర్జన్ పూర్తి చేసేదాకా ఆగు... అప్పుడు నిన్ను చేసుకొనేదీ, చేసుకోనిదీ నిర్ణయం చేసుకుని చెప్తా" అని స్థిమితంగా సమాధానం చెప్పి పంపదూ?

నిజానికి ప్రభాకరమే కారణం ఇవాళ తను ఈ స్థితిలోకి రావడానికి. ఆ కృతజ్ఞత తనకి ఎప్పుడూ వుంటుంది. కాని సహాయం చేస్తున్న భాగ్యానికి, తన కోర్కెల్ని అర్ధంచేసుకోకుండా, తన అభ్యర్ధనవి వినకుండా, ఓ పై అధికారిలా శాసించి, పెత్తనం చలాయించబోయినందుకే తనకి కోపం. అప్పుడు తన హృదయం కోమలంగా, ప్రభాకరంపట్ల పట్టలేని ప్రేమతో, కోరికలతో నిండిపోయి వుంది. అప్పుడు తన అంతర్యాన్ని అర్ధంచేసుకుని పెళ్లి చేసుకుంటే యిప్పుడు అతనూ తనూ యెంత హాయిగా ఆనందంగా జీవిస్తూవుందురు! తనకై వికసించి వేచి వున్న కుసుమాన్ని స్వీకరించడానికి ఆలశ్యంచేస్తే, ఆ తర్వాత తనకే అది లభిస్తుందని ఏమిటి నమ్మకం? ఏ గడుసువాడో స్వంతం చేసుకుంటే?... అది తొంభై పాళ్ళు జరక్కపోవచ్చు. కాని...కాని...

ఉష కంఠం అంతా నెప్పిగా బాధగా మారిపోయింది.

మనస్సులో ఏదో వెలితి ... హృదయంలో ఏదో ఆవేదన...

కాస్సేపు అలా వెళ్ళివస్తే రిలీఫ్‌గా వుంటుందని వాచీ చూసుకుని లేచింది... అద్దంలో చూసుకుంటే మొహం అప్పుడే మేకప్ అయినట్లుంది. జుట్టు ఎక్కడా రేగలేదు. బట్టలు నలగలేదు... 'కడిగిన ముత్యంలా ఉంది' అంటారు ఇదే కాబోలు అని నవ్వుకుంది— తనమీద తనకే వ్యామోహం వచ్చేలా ఉంటే, మరి కాలేజీ బ్యూటీ అన్నారంటే అనరూ? అయితే మార్కుల్లో కూడా అన్నీ డిస్టింగ్షన్ వస్తున్నాయి కనుక ఈ అందం అందరి పొగడ్తలకీ కారణం అయింది. ఇదే చదువులో పూజ్యం అయితే! 'విగ్రహ పుష్టిరా' అని ఆక్షేపించి ఉందురు.

రూమ్‌కి తాళం వేస్తూండగా "ఉషా! ప్లీజ్! ఎనాటమీలో ఈ చాప్టర్, ముఖ్యంగా ఈ పేరా అర్థం కావడంలేదు. కొంచెం చెప్పవ్?" అంటూ పక్క బ్లాక్‌లో మనోరమ వచ్చింది. "ఇప్పుడా? బీచ్‌కి వెళదాం అనుకుంటున్నాను. సరే" అంటూ పది నిముషాలు రమకోసం వెచ్చించి, హాస్టల్ మెట్లు దిగి రోడ్డు ఎక్కింది. ఏభై గజాలు నడిచిందోలేదో రవి కనిపించి "గుడ్ ఈవినింగ్ ఉషా!" అన్నాడు.

గా జు మే డ

(22వ పేజీ తరువాయి)

ఉష చిరునవ్వుతో విష్ చేసింది.

"ఎందాకా?" అన్నాడు.


"అలా బీచ్‌కి వెళదాం అని"

"రైట్! నేనూ అటే బైలుదేరాను"

ఇద్దరూ ఏవో కాలేజీ కబుర్లూ, పిచ్చాపాటీ చెప్పుకుంటూ కొంచెం దూరం నడిచారు. ఉన్నట్టుండి రవి ఆగి "ఒక్కొక్క సమస్యమీద మీరు చెప్పే విషయాలు వింటూంటే ఆశ్చర్యం వేస్తుంది! మీ విజ్ఞానం ఏమిటి అపారంగా ఉందే! ఎన్ని పుస్తకాలు చదివారేమిటి? సుమారు ఓ వెయ్యి ఉంటాయా?" అన్నాడు ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేస్తూ.

ఉష నవ్వి "వెయ్యా?... లక్షా? ఏం లేదు... ఓ రకంగా నాది, లేట్ ఎడ్యుకేషన్ ... పదిహేనవ ఏడుదాకా అక్షరం రాదు. పదహారోఏట మెట్రిక్ చదివి, పదిహేడోఏడు వెళ్లేటప్పటికి పి. యు. సి. పేసయి మెడిసిన్‌లో చేరా" అంది.

"సో క్విక్... సో బ్రిలియంట్...వండర్‌ఫుల్! నాకో మేనమామ కూతురుంది ... దాదాపు ఇరవై నిండుతున్నాయి. ఇప్పటికి నాలుగేళ్లయి మెట్రిక్ పేస్ కాలేకపోతోంది... దాన్ని నాకిచ్చి పెళ్లి చెయ్యాలని పెద్దవాళ్ల పట్టు. అది మెట్రిక్ పేసైతేనే కాని చేసుకోనని నేను"



"సంతానం—సౌభాగ్యం"లో

ఉష ఉలిక్కిపడింది. వెంటనే సర్దుకుంది.

"మిస్టర్ రవీ! ఆ అమ్మాయిని బాధపెట్టకు. పెళ్లి కావాలంటే చేసేసుకో! లేకపోతే మానెయ్యి. అంతేకాని షరతులుపెట్టి ఆడదాన్ని చంపడం ఏమిటి? ఆ అమ్మాయి ఎప్పటికో అప్పటికి మెట్రిక్ పేస్‌అవుతుంది. కానిఅప్పటికి ఆ అమ్మాయిలో ఉండే సౌకుమార్యం, లాలిత్యం, ముగ్ధత్వం,వయస్సు తాలూకు మురిపెం అన్నీ హారతికర్పూరంలా హరించుకుపోతాయి. అప్పుడామెకి పెళ్లి అయినా ఒకటే కాకపోయినా ఒకటే! ఎర్లీ మేరేజెస్ ఎంత మూర్ఖమో లేట్ మేరేజెస్ కూడా అంతే అవివేకం"

ఉష అంత ఉద్రేకంగా ఎందుకు చెబుతోందో అర్థం కాలేదు రవికి. బహుశా అది ఆమె కన్విక్షనేమో. మరయితే తనకి కూడా ఇరవై మూడో ఇరవై నాలుగో ఉంటాయికదా? ఇప్పటిదాకా తనెందుకు మేరేజీ చేసుకోకుండా ఆగింది? అడుగుదాం అనుకున్నాడు రవి. కాని ఇంతలో వాళ్ల వెనకాల సడన్‌బ్రేక్‌పడి ఒక కారు ఆగింది. కారులోంచి గురుమూర్తిగారి అమ్మాయి రాధ దిగి "హమ్మయ్య దొరికావు. ప్రొద్దుటినుంచి నిన్ను పట్టుకోలేక ఛస్తున్నాను. కాలేజీకి వెళితే హాస్టల్‌కి వెళ్ళావు అన్నారు. హాస్టల్‌కి వెళితే ఇప్పుడే బీచ్‌కి వెళుతున్నావని రమ చెప్పింది. ఎక్కు! కారెక్కు! ఊ! అర్జెంటు! మనం వెళ్లిపోవాలి" అంటూ గబగబా మాట్లాడేసి ఉష రెక్కపట్టుకుని కారులోకి లాగేయసాగింది.

"ఉండు... ఏమిటీ అర్జంటు? ఏం కథ?"

"అబ్బ! అంతా కారులో వెళుతూ చెప్తానులే! ఏమండీ మిస్టర్! ఏం అనుకోకండేం? అర్జంటుగా మా ఉషని తీసికెళ్లవలసి వచ్చింది" అందిరాధ.

"మరి వస్తాను రవీ! ఎక్స్‌క్యూజ్‌మీ" అంది ఉష.

రవి నవ్వుతూ "ఫర్వాలేదు వెళ్ళిరండి" అంటూ చెయ్యి ఊపాడు. కారు టాప్‌గేర్‌లో వెళ్లిపోయింది గురుమూర్తి ఇంటివైపు.

[ఇంకా ఉంది]



శ్రీరామకృష్ణా ఆర్ట్సు
వైకుంఠపాళి
నిర్మాత: ఎమ్.రామకృష్ణారెడ్డి B.E.
దర్శకత్వం: కె.బాపయ్య
కథ, మాటలు: పాలగుమ్మి పద్మరాజు
పాటలు: ఆత్రేయ
సంగీతం: కె.వి.మహదేవన్
లక్ష్మీ ఫిలింస్
RamaRaoArts
LAKSHMIDUBS